


www.telugutrack.in

APTEL 16257

# తెలుగు ట్రాక్

TELUGU TRACK

Volume : 1 :: Issue : 39 WEEKLY MONDAY 18 September 2023 Pages 16 Rs.10/- VIJAYAWADA


# టీడీపీకి కలిసొస్తున్న కాలం

తెలుగు ట్రాక్, విజయవాడ: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కేసులో అవినీతి జరిగిందని సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ అరెస్ట్ పై అనేక వివాదాలు ఉన్నాయి. అదే సమయంలో కోర్టులో కౌంటర్లు దాఖలు చేయడానికి వారాల తరబడి గడువు అడుగుతున్న లాయర్లు ప్రెస్ మీట్లు పెట్టి గంటల తరబడి వివరాలు చెబుతున్నారు. వైఎస్ఆర్‌సీపీ నేతలు చంద్రబాబుపై విరుచుకుపడుతున్నారు. లోకేష్ ను కూడా అరెస్ట్ చేయబోతున్నామని బెదిరిస్తున్నారు. ఇలాంటి సమయంలో రాజకీయం వేడెక్కుతోంది. చంద్రబాబుకు మద్దతుగా నిరసన ప్రదర్శనలు ఒక్క సారిగా పెరుగుతూండటం అధికార పార్టీని సైతం ఆశ్చర్య పరుస్తోంది. తెలుగుదేశం పార్టీ అధినేతను అరెస్ట్ చేసినప్పుడు పోలీసుల నిర్బంధాల వల్ల కానీ కేసుల భయం వల్ల కానీ .. ఇతర కారణాల వల్ల కానీ జనం పెద్దగా బయటకు రాలేదని వైఎస్ఆర్‌సీపీ అనుకుంది. కానీ ఒక్క సారిగా వచ్చే ఆవేశంతో బయటకు వచ్చే జనం వెంటనే చల్లబడిపోతారు. కానీ ఇప్పుడు మెల్లగా ఐయామ్ విత్ బాబు అంటూ జనం రోడ్డెక్కుతున్నారు. హైదరాబాద్, బెంగళూరుతో పాటు విదేశాల్లోనూ చంద్రబాబుకు మద్దతుగా ర్యాలీలు చేస్తున్నారు. తెలంగాణలో ఖమ్మం, మధిర, నిజామాబాద్, కోదాడ వంటి ప్రాంతాల్లోనూ ర్యాలీలు జరగడం ఆశ్చర్యకరంగా మారింది. ఏపీలో నిర్బంధాల వల్ల పెద్దగా బయటకు రాని ప్రజలు శనివారం మాత్రం.. ర్యాలీలతో హోరెత్తించారు.విజయవాడ, గుంటూరుల్లో రెండు రోజుల వ్యవధిలో చోటు చేసుకున్న నిరసనలు టీడీపీ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచాయి. మహిళలు ముందు ఉండి మరీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. పోలీసులు అడ్డుకున్నా ఆగలేదు. గుంటూరులో నిర్వహించిన ప్రదర్శన ముందుగా ప్రీప్లాన్డ్ కాదు. కొంత మంది అలా రోడ్డుపైకి వచ్చారు. తర్వాత విస్తృతంగా ప్రచారం జరగడంతో.. అలా వెంటనే మహిళలంతా రోడ్డుపైకి మద్దతుగా వచ్చారు. ఈ స్పందన అనూహ్యమని.. ఇది రాష్ట్రమంతా పాకితే.. ప్రజాఉద్యమం వస్తుందని ఇది ప్రభుత్వానికి చాలా ఇబ్బందికరమన్న వాదన వినిపిస్తోంది. చంద్రబాబును అరెస్ట్ చేసి వారం రోజులు అవుతోంది. ఓ వైపు స్కిల్ కేసులో ఆధారాలు లేవన్న ప్రచారం బలపడుతూండటం.. మరో వైపు చంద్రబాబు చేసిన పనులను టీడీపీ విస్తృతంగా చేస్తూండటంతో ఆయనపై సానుభూతి పెరిగడానికి కారణం అవుతోంది. ఇవన్నీ వైఎస్ఆర్‌సీపీకి ఇబ్బందికరంగా మారుతున్నాయి. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబును అరెస్ట్ చేయడం .. అదీ కూడా ఆయనను వేధించినట్లుగా అరెస్ట్ చేయడం వల్ల ఆ పార్టీకి అనసవరంగా చాన్సిచ్చామన్న భావనలో వైసీపీ నేతలు ఉన్నారు. చంద్రబాబుకు విపరీతంగా సానుభూతి వస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. అదే సమయంలో లోకేష్ ఢిల్లీలో కూడా జాతీయ స్థాయిలో హైలెట్ అయ్యారు. వరుస జాతీయ మీడియాకు ఇంటర్వ్యూలు ఇచ్చారు. మరో వైపు రాజమండ్రిలో నారా బ్రాహ్మణి క్యాండిల్ ర్యాలీ తర్వాత మీడియాతో మాట్లాడిన మాటలు ఆమెలోనూ మంచి లీడర్ ఉన్నారన్న అభిప్రాయాన్ని కల్పిస్తున్నాయి. ఎలా చూసినా టీడీపీకి ఎన్ని బలాలున్నాయో చూపించినట్లయిందన్న వాదన వైసీపీలోనూ వినిపిస్తోంది.


పాఠకులకు ,ప్రకటన కర్తలకు,శ్రేయోభిలాషులకు

వినాయక చవితి శుభాకాంక్షలు


## చంద్రబాబు బెయిల్ పిటీషన్ విచారణ రేపు

10లో

## 7లో పొత్తులతో మారనున్న రాజకీయ ముఖ చిత్రం

## మహా లక్ష్మికి అభయ హస్తం

పేద మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం

రూ.500 లకే గ్యాస్ సిలిండర్

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

2లో



## బీజేపీ వల్లనే విమోచనం

2లో



కాంగ్రెస్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలు

కాంగ్రెస్‌ను తెలంగాణ ప్రజలు క్షమించరు.

# బీజేపీ వల్లనే అధికారికంగా విమోచనం

తెలుగు ట్రాక్,హైదరాబాద్

తెలంగాణలోని సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన 75వ తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జాతీయ జెండాను ఎగురవేసి వేడుకలను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం ఆధునిక తెలంగాణ, మహారాష్ట్రలోని మరాఠ్‌వాడా ప్రాంతం, కర్ణాటకలోని పలు జిల్లాలతో కూడిన హైదరాబాద్ రాష్ట్ర విముక్తి పోరాటంలో ప్రాణత్యాగం చేసిన వీరులకు నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ చరిత్రను తప్పుగా చిత్రీకరించే ప్రయత్నం చేసే వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. నిజాం హయాంలో తెలంగాణకు విముక్తి కల్పించి స్వాతంత్ర్యం రాకుంటే భారతమాత కడుపులో కాన్సర్ వచ్చినట్లేనని సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన ప్రకటనను కేంద్ర మంత్రి అమిత్ షా గుర్తు చేశారు.

'సర్దార్ పటేల్ లేకుంటే తెలంగాణకు ఇంత త్వరగా విముక్తి వచ్చేది కాదు. దేశాన్ని ఏకం చేయాలనే నినాదంతో పోలీసు చర్యలకు సిద్ధమయ్యామన్నారు. మిలటరీ 'ఆపరేషన్ పోలో' ప్రారంభించిన తర్వాత చుక్క రక్తం చిందకుండా, నిజాం భారత్ శక్తి కంటే ముందే పోరాడి తెలంగాణ స్వాతంత్ర్యానికి సిద్ధమయ్యారు. పటేల్ ఆదేశాల మేరకే కేఎం మున్షీ నేతృత్వంలో ఈ ఆపరేషన్ జరిగింది. తెలంగాణ స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఆర్యసమాజ్, హిందూ మహా సభ వంటి అనేక సంస్థలు పనిచేశాయి. 75 సంవత్సరాలుగా దేశంలోని ఏ ప్రభుత్వం కూడా మన యువతకు తెలంగాణా స్వాతంత్ర్య పోరాటం గురించి చెప్పడానికి ప్రయత్నించలేదు. చరిత్రలో ఈ సంఘటనలకు తగిన గౌరవం ఇవ్వడంతో పాటు, ఈ ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిన ఘనత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకే దక్కుతుంది. తెలంగాణ భవిష్యత్ తరాలకు స్ఫూర్తినివ్వడమే లక్ష్యం. మన పెద్దల పోరాటాన్ని స్మరించుకుని వారు కలలుగన్న రాష్ట్రాన్ని నిర్మించడమే సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల లక్ష్యం. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుంది' అని అమిత్‌షా పేర్కొన్నారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక



కూడా విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తెలంగాణ చరిత్రను దాదాపు 75 ఏళ్ల పాటు కొందరు వక్రీకరించారని, మోదీ ప్రధాని అయ్యాక ఆ తప్పుల్ని సరిచేశారని వెల్లడించారు అమిత్ షా. ఈ 9 ఏళ్ల పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. సర్దార్ పటేల్, కేఎం మున్షీ కారణంగానే తెలంగాణలో నిజాం పాలన అంతమైందని అన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సంస్థాన్ విమోచన ఎగ్జిబిషన్‌ని ప్రారంభించారు. తెలంగాణ విమోచన దినోత్సవం గురించి తెలియకుండా గత ప్రభుత్వాలు కుట్ర చేశాయని మండి పడ్డారు. భూమి కోసం, భుక్తి కోసం జరిగిన ఈ పోరాటం..సమైక్యతా దిన ఎలా వుతుందని పరోక్షంగా తెలంగాణ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కేసీఆర్ సర్కార్ ఇవాళ జాతీయ సమైక్యతా దినోత్సవం పేరిట వేడుకలు నిర్వహిస్తోంది. దీన్ని ఉద్దేశించే అమిత్‌షా ఈ వ్యాఖ్యలు చేశారు.

ఓటు బ్యాంకు కోసమే విమోచన దినోత్సవాన్ని రాజకీయం చేస్తున్నారని మండి పడ్డారు.

"బ్రిటీష్ నుంచి భారత్‌కి స్వాతంత్ర్యం వచ్చినా నిజాంలు తెలంగాణను 399 రోజుల పాటు పాలించారు. అన్నిరోజులు ఇక్కడి ప్రజలు నరకం చూశారు. సర్దార్ పటేల్ రంగంలోకి దిగి 400వ రోజు వాళ్లకు నిజాం కర్కశ పాలన నుంచి విముక్తినిచ్చారు. విమోచన దినోత్సవం జరపాలంటే కొందరు భయపడుతున్నారు"

మోడీ కారణంగానే..

ఇక బుజ్జగింపుల కోసం వాస్తవాలను దాచిపెడితే చరిత్ర మిగిలిపోదని అమిత్ షా అభిప్రాయపడ్డారు. 'భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా 399 రోజుల పాటు నిజాం భూభాగంలో రజాకార్ల అరాచకాలు కొనసాగాయి. మన పూర్వీకులు కలలుగన్న తెలంగాణ అభివృద్ధికి కృషి చేయాలి. హైదరాబాద్ విమోచన దినోత్సవంతో తెలంగాణ ప్రజల స్వాతంత్ర్య వేడుకలను అధికారికంగా నిర్వహించాలన్నది ప్రధాని మోదీ ఆలోచన' అని అమిత్‌షా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు అమిత్ షా. మోడీ కారణంగానే దేశం ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా

మారిందని, జి20 ద్వారా భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను మరోసారి ప్రపంచానికి తెలియజేశామని ఆయన ప్రజలకు గుర్తు చేశారు. భారత్ చేస్తున్న అభివృద్ధిని నేడు ప్రపంచం మొత్తం కొనియాడుతుందని అమిత్ షా తెలిపారు.

కాంగ్రెస్‌ను క్షమించరు: కిషన్ రెడ్డి

ఈ కార్యక్రమంలోనే సశస్త్ర సీమబల్ అధికారుల నివాస సముదాయాలను అమిత్ షా ప్రారంభించారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని? తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కూడా కేంద్రమంత్రి షా ప్రారంభించారు. తెలంగాణ స్వాతంత్ర్య దిగ్గజాలు షూబుల్లాఖాన్, రామ్‌జీ గోండ్‌లను స్మరించుకుంటూ ప్రత్యేక పోస్టల్ కవర్‌ను అమిత్ షా ఆవిష్కరించారు. అంతకుముందు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, సహాయ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పోరాట చరిత్రను, స్ఫూర్తిని నాశనం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించిందన్నారు. దీన్ని తెలంగాణ ప్రజలు క్షమించరని కేంద్రమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిన్న సింధూతో భేటీ

భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుతో అమిత్ షా భేటీ కానున్నట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. మర్యాదపూర్వకంగానే సింధును అమిత్ షా కలవనున్నారని వెల్లడించాయి. కానీ దీని వెనుక రాజకీయ కోణం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. బీజేపీకి మద్దతు ఇవ్వాల్సిందిగా సింధును అమిత్ షా కోరే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. క్రీడా రంగంలో పీవీ సింధుకు మంచి పాపులారిటీ ఉంది. దేశం తరపున వివిధ టోర్నీలలో ఎన్నో పతకాలు సాధించింది. తెలుగు రాష్ట్రంలో పీసీ సింధు అంటే తెలియని వారు ఎవరూ ఉండరు. తెలంగాణలో బలపడాలని చూస్తున్న బీజేపీ.. తమ పార్టీ కోసం సింధు మద్దతు కోరే అవకాశం లేకపోలేదని ప్రచారం జరుగుతోంది.వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ కసరత్తులు చేస్తోంది. సినీ, క్రీడా రంగాలకు సంబంధించిన ప్రముఖులతో అగ్ర నేతలు భేటీ అవుతున్నారు. గతంలో అమిత్ షా హైదరాబాద్ పర్యటనకు వచ్చిన సమయంలో యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్‌తో భేటీ కావడం సంచలనంగా మారింది. 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా విజయం సాధించినందుకు ఎన్టీఆర్‌ను ప్రశంసించడానికి అమిత్ షా కలిసినట్లు కాషాయ వర్గాలు బయటకు చెప్పినా.. ఈ భేటీ వెనుక పెద్ద వ్యూహమే ఉందనే ఊహాగానాలు వినిపించాయి. సౌత్ ఇండియాలో బీజేపీ అంత స్ట్రాంగ్ కాకపోవడంతో బలం పుంజుకోవాలని ఎప్పటినుంచో వ్యూహాలు సిద్ధం చేస్తోంది. అందులో భాగంగానే ఎన్టీఆర్‌ను అమిత్ షా కలిశారని, సౌత్ ఇండియాలో ఎన్టీఆర్ క్రేజ్‌ను బీజేపీ ఉపయోగించుకోనుందనే ప్రచారం జోరుగా సాగింది. కానీ ఈ భేటీలో అసలు ఏం జరిగిందనేది ఇప్పటివరకు బయటకు రాలేదు. ఆ తర్వాత బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హైదరాబాద్ పర్యటనలో యంగ్ హీరో నితిన్, టీమిండియా ఉమెన్స్ టీమ్ మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌తో భేటీ అయ్యారు. ఇలా వరుసగా సెలబ్రెటీలతో భేటీ అవుతూ వస్తుండగా.. ఇప్పుడు పీవీ సింధుతో అమిత్ షా నేరుగా సమావేశం కానుండటం కీలకంగా మారింది. తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో ఈ భేటీ మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది.

# మహా లక్ష్మికి అభయ హస్తం

### పేద మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం
### రూ.500 లకే గ్యాస్ సిలిండర్
### ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

తెలుగు ట్రాక్,హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో కాంగ్రెస్ నిర్వహించిన విజయభేరి సభలో ఆ పార్టీ ఆరు గ్యారెంటీ హామీలను ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఈ హామీలను ప్రకటించారుతెలంగాణలో రానున్న ఎన్నికల్లో అధికారమే టార్గెట్ గా దూసుకెళ్తున్న కాంగ్రెస్ మహిళా ఓటర్లే మెయిన్ టార్గెట్ గా మెజారిటీ హామీలు ప్రకటించినట్లు తెలుస్తోంది. ఆరు గ్యారంటీ హామీలతో పాటు సోనియాగాంధీ ప్రకటించిన మొత్తం ప్రకటించిన హామీల లిస్టు ఇలా వుంది.

మహాలక్ష్మి పథకం ద్వారా పేద మహిళలకు నెలకు రూ.2 వేల 500 ఆర్థిక సాయం చేయనున్నారు.

రూ.500 లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రకటించారు.

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు.



ఇళ్లు లేని వారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం చేస్తామని వెల్లడించారు.

ఉద్యమకారుల కుటుంబాలకు 250 చ.గజాల ఇంటి స్థలం ఇస్తామన్నారు. రైతు భరోసా ద్వారా రైతులు, కౌలు రైతులకు ఏటా రూ.15 వేల పంట పెట్టుబడి సాయం ఇస్తామని ప్రకటించారు. వ్యవసాయం కూలీలకు ఏడాదికి రూ.12 వేల సాయం. వరి పంటకు ప్రతి క్వింటాల్ కు రూ.500 బోనస్ ఇస్తామన్నారు. గృహజ్యోతి కింద ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు హామీ ఇచ్చారు. చేయూత పథకం ద్వారా నెలకు రూ.4 వేల పింఛన్ ఇస్తామని ప్రకటించారు.

రాజీవ్ ఆరోగ్య శ్రీ లిమిట్ రూ.10 లక్షల వరకు పెంపు

రైతు భరోసా కింద రూ.15 వేలు పెట్టుబడి స్తాయం. కౌలురైతులకు రూ.12 వేలు సాయం. వరికి మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్. వరి పంటకు క్వింటాల్‌కు రూ.500 బోనస్. ప్రజల ఆకాంక్షల మేరకు తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్. ప్రజా సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేశాం. ఉపాధిహామీ చట్టం చేసింది కాంగ్రెస్సే. ఆహార భద్రత చట్టం చేసి ప్రజల ఆకలి తీర్చింది కాంగ్రెస్." అని ఖర్గే అన్నారు.

# బాలయ్య.. ఇక ఫుల్ చార్జ్



తెలుగు ట్రాక్,రాజమండ్రి

త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా పరామర్శ యాత్ర చేస్తానని కూడా ప్రకటించేశారు. చంద్రబాబు అరెస్ట్‌ని తట్టుకోలేక చనిపోయినవారి కుటుంబాలను, పోలీస్ లాఠీఛార్జ్‌లో తీవ్రంగా గాయపడ్డవారిని పరామర్శించాలన్నది ఆ యాత్ర లక్ష్యం. బాలయ్య చాలా ఏళ్ల నుంచి పాలిటిక్స్‌లోనే ఉంటున్నా? సందర్భం వచ్చినప్పుడు తప్ప పార్టీ వ్యవహారాల్లో పెద్దగా జోక్యం చేసుకోలేదు. మీటింగ్స్ ఉంటే హాజరవడం, నియోజకవర్గ పనులు చూసుకోవడం వరకే పరిమితం అయ్యారాయన. కానీ.. ఇప్పుడు పరిస్థితులు తిరగబడ్డాయి.స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్ట్ తర్వాత.. పార్టీ కార్యకలాపాల్లో కీలకంగా మారిపోయారు బాలకృష్ణ. శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి స్పెషల్ ఫ్లైట్‌లో హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చిన దగ్గరి నుంచి పూర్తి స్థాయి పొలిటికల్ లీడర్ రోల్‌లోకి వెళ్ళిపోయారు. అరెస్ట్‌ను నిరసిస్తూ.. టీడీపీ బంద్‌కు పిలుపునివ్వడం, దానికి సంబంధించిన వ్యవహాలాను టీడీపీ హెడ్డాఫీస్ నుంచి సమీక్షించడం లాంటి పనుల్లో మునిగిపోయారు. మామూలుగా అయితే అక్కడికి చాలా అరుదుగా వెళ్తుంటారాయన. ముఖ్యమైన సమావేశాలుంటే రావడం, పని చూసుకుని వెళ్లడం వరకే పరిమితం అయ్యేవారు. ఇంకా గట్టిగా మాట్లాడుకుంటే.. అసలు కొన్ని జిల్లాలకు అధ్యక్షులెవరో తెలిసి ఉండకపోవచ్చంటున్నాయి పార్టీ వర్గాలు. అలాంటి వ్యక్తి ఇప్పుడు పూర్తిగా పార్టీ వ్యవహారాల పర్యవేక్షణలో మునిగిపోయారు. చంద్రబాబు అరెస్ట్ అవడం, లోకేష్ కూడా రాజమండ్రిలోనే ఉండటం లాంటి పరిణామాలతో? పార్టీకి అంతా తానై.. కేడర్‌లో భరోసా నింపే ప్రయత్నం చేస్తున్నారట బాలయ్య. ఇన్నేళ్ళలో తొలిసారి మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రెస్ మీట్ పెట్టారు. అది కూడా? సెంటర్ సీట్లో కూర్చుని మాట్లాడటం ఆసక్తి రేపుతోంది.ఎన్టీయార్ వారసుడిగా ఆయనకా ప్రివిలేజ్ ఉంటుందని అంటున్నాయి పార్టీ వర్గాలు. మరోవైపు లోకేష్‌ని కూడా అరెస్ట్ చేస్తారన్న ప్రచారం జోరుగా జరుగుతున్న సమయంలో.. బాలయ్య లీడ్ తీసుకునే అవకాశం ఉందంటున్నారు. బాలకృష్ణ చేసిన తాజా కామెంట్స్ కూడా ఇందుకు బలాన్నిస్తున్నాయి. పరామర్శ యాత్రను ప్రకటించడంతోపాటు అండగా నేను ఉంటానని కేడర్‌కు డైరెక్ట్‌గా సందేశం ఇచ్చారు. ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. దీంతో ఒకవేళ చంద్రబాబు, లోకేష్ అందుబాటులో లేకుంటే? ఇక టీడీపీ వ్యవహారాలను తానే చూసుకుంటాను? డోంట్‌వర్రీ అని కార్యకర్తలకు నైతిక స్థైర్యాన్ని ఇచ్చినట్టయిందని అంటున్నారు పరిశీలకులు. అంటే? ఎట్నుంచి ఎటు చూసినా? టీడీపీలో ఇక బాలయ్య కీలకం కాబోతున్నారన్నది క్లియర్ అంటున్నాయి రాజకీయ వర్గాలు. తొలి నుంచి పార్టీ తరపున ప్రచారం చేస్తున్నా?. 2009, 2014, 2019 ఎన్నికల్లో మాత్రం ఫుల్‌టైం, సీరియస్‌గా కేంపెయిన్ చేశారు బాలయ్య. అలాగే? 2014, 2019లో హిందూపురం నుంచి పోటీ చేసి గెలిచారు.అప్పుడెప్పుడూ పార్టీ పరంగా ఈ స్థాయిలో ఆయన జోక్యం లేదు. ఇప్పుడు చంద్రబాబు అరెస్ట్ తర్వాత టీడీపీ కేంద్ర కార్యాలయంలోనే సీనియర్స్‌తో వరుస మీటింగ్స్, సమీక్షలతో పూర్తిస్థాయి పొలిటీషియన్‌గా బిజీ అయ్యారాయన. మొత్తంగా చూస్తే? పరిస్థితులు ఎట్నుంచి ఎటు మారినా సరే? బాబు, లోకేష్ అందుబాటులో ఉన్నా? లేకున్నా? పార్టీకి నేనున్నానని భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని మాట్లాడుకుంటున్నారు టీడీపీ నాయకులు. వాళ్ళిద్దరి గైడెన్స్‌లోనే అంతా నడుస్తోందని చెప్పుకోవడం కొసమెరుపు.

# ఏకాంతంగా రోజుకు 16 గంటలు



## ఒకప్పుడు పదహారు గంటలు పనిలో .. ఆహార నియమాల్లో మార్పు ..... పలకరించేవారు లేకుండా ఏకాంత శిక్ష

తెలుగు ట్రాక్,రాజమండ్రి

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు జైలుకు వెళ్లి ఐదు రోజులు గడిచిపోయాయి. అరెస్ట్ జరిగిన గంటల వ్యవధిలో బయట పడిపోతారని భావించిన వారి నమ్మకాలు క్రమంగా సడలిపోతున్నాయి. సుదీర్ఘ రాజకీయ జీవితంలో చంద్రబాబు జోలికి వెళ్లడానికి ఏ వ్యవస్థలు సందేహించాయో ఆ పరిస్థితి ఇప్పుడు కనిపించడం లేదు.ఎన్ని ఆరోపణలు, విచారణలు జరిగినా వాటి నుంచి సురక్షితంగా బయటకొచ్చేసిన చంద్రబాబు 73ఏళ్ల వయసులో స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఏసీబీ ప్రత్యేక కోర్టు ఆదేశాలతో బాబును రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో చంద్రబాబు జైల్లోకి వెళ్లారు.చంద్రబాబు జైలుకెళ్లిన వెంటనే హైకోర్టును ఆశ్రయించి బయటకు వచ్చేస్తారని అంతా భావించారు. ఆ పార్టీ నాయకులు, క్యాడర్ బాబును ఏ కోర్టులు నిందితుడిగా నిరూపించలేవనే ధీమాతో ఉన్నాయి. రోజులు గడిచిపోతున్నా పరిస్థితిలో మార్పు రాకపోవడం వారిని ఆందోళనకు గురి చేస్తోంది. చంద్రబాబు పరిస్థితిపై పార్టీ శ్రేణుల్లో నెలకొన్న ఆందోళన ఓ ఎత్తైతే జైల్లో మరో రకమైన పరిస్థితి ఉంది.దాదాపు 48గంటల పాటు సాగిన సిట్ విచారణ, కోర్టులో వాదనల తర్వాత చంద్రబాబును జైలుకు తరలించారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో దాదాపు 200మంది ఉండే స్నేహ బ్లాక్‌ను పూర్తిగా చంద్రబాబు కోసం కేటాయించారు. చంద్రబాబుకు ప్రస్తుతం ఏకాంత వాసాన్ని అనుభవిస్తున్నారు. ఆయనకు నిబంధనల ప్రకారమే సేవలు అందుతున్నాయి. బాబు కోసం ప్రత్యేక బసను ఏర్పాటు చేసినా అందులో సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. 73ఏళ్ల వయసులో కూడా పూర్తి ఫిట్నెస్‌తో ఉండటానికి ఆయన తీసుకునే డైట్ కారణం. వ్యక్తిగత సహాయకులు ఆయన వెన్నంటి ఉంటూ కావాల్సిన ఆహారాన్ని ఎప్పటికప్పుడు అందించేవారు. జైల్లో అలాంటి పరిస్థితి లేదు. నిర్ణీత సమయాల్లో మాత్రమే ఆయనకు వైద్య పరీక్షల తర్వాత ఆహారాన్ని అందిస్తున్నారు. చంద్రబాబుకు ఇచ్చే డైట్‌ను బయట తయారు చేసి జైల్లోకి తీసుకువెళుతున్నా వాటిని క్షుణ్ణంగా పరీక్షించిన తర్వాతే బాబు తినడానికి అనుమతిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన డైట్ అందుకునే వేళల్లో కూడా మార్పు వచ్చినట్లు తెలుస్తోంది.సాధారణంగా చంద్రబాబు డైలీ షెడ్యూల్ తెల్లవారుజాము నుంచి ప్రారంభం అవుతుంది. కొన్నేళ్లుగా వారాంతాల్లో మాత్రమే విశ్రాంతి కోసం రోజువారి షెడ్యూల్‌లో మార్పులు చేసుకున్నారు. సాధారణ రోజుల్లో కనీసం 16 గంటలకు పైగా యాక్టివిటీ ఉంటుంది. పార్టీ నాయకులతో టెలీ కాన్ఫరెన్స్‌లు, సమీక్షలు, జిల్లా పర్యటనలు, బహిరంగ సభలు, ముఖ్యమైన సమావేశాలతో క్షణం తీరిక లేకుండా గడిపే వారు.జైల్లో ఇందుకు పూర్తి భిన్నమైన పరిస్థితిని చంద్రబాబు ఎదుర్కొంటున్నారు. ములాఖత్‌లో పరిమిత సమయంలో మాత్రమే కుటుంబ సభ్యులతో మాట్లాడే అవకాశం లభిస్తోంది. భోజనం అందించే సమయాన్ని మినహాయిస్తే మిగిలిన టైమ్ మొత్తం ఆయన ఏకాంత శిక్షను అనుభవిస్తున్నారు. కనీసం మాట్లాడే వారు కూడా కనుచూపు మేరలో ఎవరు కనిపించడం లేదు. చంద్రబాబును ఖైదు చేసిన గదిలో పనులు చేయడానికి వచ్చే వారిని కూడా ఎక్కువ సేపు అనుమతించరు. జైలు గది వెలుపల ఉండే ఇద్దరు గార్డులు తప్ప బాబు పిలిస్తే పలకడానికి మరో మనిషి కూడా లేని పరిస్థితి ఉంది.రోజులో కనీసం 16-18 గంటలు చంద్రబాబు ఏకాంతంగానే గడపాల్సి వస్తోందని చెబుతున్నారు. విశ్రాంతి తీసుకునే సమయం మినహా మెలకువ ఉండే సమయంలో ఏమి పాలుపోని పరిస్థితి జైల్లో బాబుకు ఎదురవుతోంది. చంద్రబాబును జైలు నుంచి బయటకు రాకుండా మరిన్ని కేసులు పెట్టే యోచనలో ప్రభుత్వం ఉందని ప్రచారం జరుగుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఏకాంత కరాగారమే చంద్రబాబుకు అసలైన శిక్షగా మారుతుంది. ఆయన ఉన్న బ్యారక్‌లో మినహా బయట ప్రపంచాన్ని చూసే అవకాశం కూడా లేదు. భద్రతా కారణాలతో చంద్రబాబును ఓపెన్ జైల్లోకి అనుమతించే పరిస్థితులు లేవు. జీవితంలో అత్యంత కఠినమైన రోజుల్ని చంద్రబాబును ఎదుర్కోవాల్సి వస్తోంది.







# జమిలీ జిందాతిలిస్మాతా...

జమిలి ఎన్నికలపై చర్చ సద్దుమణిగిందని అనుకున్నప్పుడల్లా అది మళ్లీ మళ్లీ రాజుకోవటం ఏడెనిమిదేళ్లుగా రివాజైంది. కానీ ఈసారి ఉన్నట్టుండి అందుకు సంబంధించి తొలి అడుగుపడింది. మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసినట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కమిటీ విధివిధానాలు, అందులో ఉండే నిపుణుల వివరాలు ఇంకా తెలియాల్సేవున్నా ఇండియా కూటమి సమావేశాల్లో తీరిక లేకుండా వున్న విపక్షాలకు ఇది ఊహించని పరిణామం.దేశంలో జమిలి ఎన్నికలు 1952 నుంచి 1967 వరకూ జరిగాయి. కానీ దానికి తూట్లు పొడిచింది కేంద్రంలోని పాలకులే. అప్పటి నెహ్రూ సర్కారు 1959 జూలైలో ఈఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలోని తొలి కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాన్ని 356వ అధికరణ ప్రయోగించి బర్తరఫ్ చేసింది. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని చక్కదిద్దేవరకూ ఆ అధికరణ దశాబ్దాలపాటు దుర్వినియోగం చేశారు. ఫిరాయింపులను ప్రోత్సహించే ధోరణి వెర్రితలలు వేసి ప్రభుత్వాలు కుప్పకూలాయి. అసెంబ్లీలు రద్దయ్యాయి. ఈ కారణాలన్నిటివల్లా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలది తలోదారీ అయింది. పాలక పార్టీలను చీల్చటం, చీలికవర్గంతో కొత్త ప్రభుత్వాలను ప్రతిష్టించటం రివాజైంది. పార్లమెంటుకూ, అసెంబ్లీలకూ ఏకకాలంలో ఎన్నికలు జరగాలనీ, అందువల్ల ఎంతో ప్రజాధనం ఆదా అవుతుందనీ ఆ విధానాన్ని సమర్థిస్తున్నవారు చెబుతున్నారు. అంతేకాదు, తరచు ఎన్నికలవల్ల అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతున్నదని కూడా వారి వాదన. కానీ ఈ రకమైన వాదనలను కొట్టి పారేస్తున్నవారు కూడా గణనీయంగానే ఉన్నారు. అభివృద్ధి పనులకు ఎక్కడ ఆటంకం ఏర్పడిందో చూపాలని సవాలు చేస్తున్నారు.ప్రకృతి విపత్తుల సమయంలోనో, మరే అత్యవసర సందర్భాల్లోనో ప్రభుత్వాలను ఎన్నికల సంఘం నిరోధించిన దాఖలాలు లేవు. కాకపోతే ఓటర్లను ప్రలోభపెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందటానికి ఉద్దేశించే పథకాలను మాత్రం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ప్రకటించకుండా ఆపుతున్నారు. అందువల్ల జనం నష్టపోయారని చెప్పడానికి ఎటువంటి దాఖలాలూ లేవు. దేశంలో ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికలతోపాటు అసెంబ్లీల ఎన్నికలు కూడా జరుగుతున్నాయి. మిగతా రాష్ట్రాలను కూడా ఈ చట్రంలోకి తీసుకు రావటమే కేంద్రం ఉద్దేశం.‘ఒకే దేశం?ఒకే ఎన్నికలు’ అన్న నినాదం కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచీ వినిపిస్తోంది. అంతక్రితం 2003లో అప్పటి ప్రధాని వాజ్‌పేయి ఈ విషయంలో కొంత ప్రయత్నం చేశారు. అప్పటి కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీతో ఆయన చర్చించారు. కానీ ఎందుకనో తదుపరి చర్యలేమీ లేవు. జస్టిస్ బీపీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలోని లా కమిషన్ సమర్పించిన 170వ నివేదిక సైతం చట్టసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించింది. 1983లో కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఈమాటే చెప్పింది. అయితే రాజ్యాంగ సవరణ, ప్రజాప్రాతినిధ్య చట్టం సవరణ, చట్టసభల నియమనిబంధనల సవరణ వగైరాలు చేయకుండా జమిలి ఎన్నికలు సాధ్యంకాదని 2018లో జస్టిస్ బీఎస్ చౌహాన్ నేతృత్వంలోని లా కమిషన్ తన ముసాయిదా నివేదికలో అభిప్రాయపడింది. ఒక ఏడాది వేర్వేరు నెలల్లో ఎన్నికలు జరిగే రాష్ట్రాలన్నిటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించటం ఉత్తమమని సూచించింది. తరచు ఎన్నికల వల్ల ఖజానాకు తడిసిమోపెడు ఖర్చు అవుతున్నదన్నది వాస్తవం. దీనికితోడు రాజమార్గాల్లో, దొంగదారుల్లో ఎన్నికల జాతరకు వచ్చిపడే వేల కోట్ల రూపాయలు ద్రవ్యోల్బణాన్ని పెంచుతున్నాయి. ఉదాహరణకు 2009 సార్వత్రిక ఎన్నికలకు ఖజానాకు రూ.1,115 కోట్లు ఖర్చ యితే, 2014 నాటికి ఇది రూ.3,870 కోట్లకు పడగలెత్తింది. ఇదంతా సర్కారుకయ్యే వ్యయం. పార్టీలూ, అభ్యర్థులూ చేసే ఖర్చు ఇందుకు ఎన్నో రెట్లు ఎక్కువుంటుంది.కానీ రోగం ఒకటైతే మందు మరొకటన్నట్టు ఈ సమస్యలకు జమిలి ఎన్నికలే పరిష్కారమని పాలకులు చేస్తున్న వాదన సరికాదు. ఎన్నికల్లో ధనప్రభావం అరికట్టడానికి ఎన్నికల సంస్కరణలు అవసరం. ఎన్నికల విశ్వసనీయత పెంచటానికి దొంగ ఓట్లను అరికట్టడం అవసరం. అలవిమాలిన వాగ్దానాలతో ప్రజలను ఆకర్షించి, అధికారంలోకొచ్చాక వంచించే పార్టీలపై చర్యలు తీసుకోవటం అవసరం.కానీ జరిగిందేమిటి? అసలే పార్టీలు వెచ్చించే కోట్లాది రూపాయల సొమ్ము ఎక్కడిదో తెలిసే అవకాశంలేని ప్రస్తుత పరిస్థితిని మరింత జటిలం చేసేలా ఎన్నికల బాండ్ల విధానానికి తెరలేపారు. ‘ఒకే దేశం?ఒకే ఎన్ని కలు’ గొప్ప ఆదర్శంగా కనిపించవచ్చు. చూడదల్చుకున్నవారికి ఇందులో జాతీయతా భావన కూడా దర్శనమీయొచ్చు. కానీ ఎన్నికల ప్రక్షాళనకు ఇది దోహదపడేదెంతఇంతకూ జమిలి ఎన్నికల విధానం అమలు చేయటం మొదలెట్టాక రాష్ట్రాల్లో గడువుకు ముందే అసెంబ్లీలు రద్దు చేయాల్సివస్తే ఏం చేస్తారు? 90వ దశకంలో మాదిరే కేంద్రంలోనే అస్థిరత ఏర్పడి లోక్‌సభ రద్దు చేయాల్సివస్తే మార్గం ఏమిటి? ఇవన్నీ కోవింద్ నేతృత్వంలోని కమిటీ ఎటూ పరిశీలిస్తుంది. ఇక రెండు చట్టసభలకూ ముడివేయటంవల్ల ఫెడరలిజం దెబ్బతింటుందనేవారూ... జాతీయ అంశాల ప్రాముఖ్యత పెరిగి స్థానిక అవసరాలు, ఆకాంక్షలు మరుగునపడతాయనేవారూ ఉన్నారు.అయితే 2019లో ఆంధ్రప్రదేశ్, ఒడిశా అసెంబ్లీల ఎన్నికలతోపాటు లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పుడు వెలువడిన ఫలితాలు గమనిస్తే ఇది అర్ధసత్యమే అనిపిస్తుంది. ఏదేమైనా జమిలి ఎన్నికల విధానంపై విస్తృతమైన చర్చకు చోటిచ్చి, అందులో వ్యక్తమయ్యే అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి అడుగులు వేయాలి. తొందరపాటు పనికిరాదు

**కిరణ్ కుమార్**

# మళ్లీ తెరపైకి గులాబీ సెంటిమెంట్

**తెలుగు ట్రాక్ ప్రత్యేక ప్రతినిధి దీప్తి.జి**

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల యుద్ధం మొదలుకాబోతుంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు... వ్యూహాలు, ప్రతివ్యూహాలను సిద్ధం చేస్తున్నాయి. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్?ఈసారి ఎలాగైనా తెలంగాణలో పాగా వేయాలని చూస్తోంది. అందుకు తగ్గట్టే కార్యాచరణను సిద్ధం చేయటంతో పాటు? ఆపరేషన్ ఆకర్ష్ తో నేతలను చేర్చుకుంటూ వేగం పెంచుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో? అధికార బీఆర్ఎస్ మరోసారి సెంటిమెంట్ అస్త్రాన్ని కూడా సంధించేందుకు రెడీ అవుతున్నట్లు కనిపిస్తోంది. ప్రధానంగా కాంగ్రెస్ ను ఇరుకున పెట్టేలా అస్త్రాలను సిద్ధం చేస్తున్నట్లు తాజా పరిస్థితులను బట్టి అర్థమవుతోంది. ఉద్యమం తర్వాత టీఆర్ఎస్? అంటే తెలంగాణ, తెలంగాణ అంటే టీఆర్ఎస్ అన్న పరిస్థితి ఉన్న సంగతి తెలిసిందే. సెంటిమెంట్ నినాదంతో సక్సెస్ అయిన పార్టీల్లో టీఆర్ఎస్ ఒకటి అని చెప్పొచ్చు. తెలంగాణ సాధనలో అగ్రభాగన ఉన్న టీఆర్ఎస్? రాష్ట్ర ఏర్పాటు తర్వాత రెండు సార్లు అధికారంలోకి వచ్చింది. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అనూహ్యంగా రూట్ ను మార్చేసింది. ఏకంగా టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్ గా మార్చేశారు అధినేత కేసీఆర్. తెలంగాణ పేరుతోనే రాజకీయం చేసే ప్రాంతీయ పార్టీ తెలంగాణ అనే పదమే లేకుండా పార్టీ పేరును మార్చటం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. అయితే పార్టీ పేరును భారత రాష్ట్ర సమితిగా మార్చినప్పటికీ తెలంగాణపై తమకే పేటెంట్ ఉందన్నట్లు అడుగులు వేస్తోంది బీఆర్ఎస్. సమయం, సందర్భాన్ని బట్టి? నాటి ఉద్యమ ఘట్టాలను గుర్తు చేస్తూ? ప్రత్యర్థులను ఇరుకునపెట్టే ప్రయత్నం చేస్తోంది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత తెలంగాణ సెంటిమెంట్ తో పెద్దగా పని ఉండదని అంతా భావించినప్పటికీ? 2014, 2018 ఎన్నికల్లో సెంటిమెంట్ అస్త్రాన్ని ఫర్ ఫెక్ట్ గా వాడేసేంది గులాబీ పార్టీ. ముఖ్యంగా 2018 ఎన్నికల వేళ టీడీపీ – కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవటం కేసీఆర్ కు అత్యంత కలిసివచ్చిన అంశమని చెప్పొచ్చు. మహాకూటమి పేరుతో చంద్రబాబు మళ్లీ తెలంగాణకు వస్తున్నారని, ప్రజలంతా గమనించాలంటూ ఓటర్లను ఆలోచనలో పడేశారు గులాబీ దళపతి. ఇలా ప్రతి సభలోనూ?. వీరి పొత్తును ప్రస్తావిస్తూ తనకు అనుకూలంగా మార్చేసుకున్నారు కేసీఆర్. దీంతో? కాంగ్రెస్ పార్టీ ఘోర ఓటమిని చవి చూడగా, గులాబీ పార్టీ 88 సీట్లు సాధించి తిరుగులేని శక్తిగా మారిపోయింది.ఇదిలా ఉంటే మరోకొద్దిరోజుల్లో తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. గతంలో చంద్రబాబుతో పొత్తు అంశం బెడిసికొట్టడంతో బోల్తా పడిపోయింది కాంగ్రెస్. ఈసారి మాత్రం పక్కాగా ప్లాన్ గా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. కట్ చేస్తే?తెలంగాణలో పార్టీని స్థాపించిన వైఎస్ షర్మిల? కాంగ్రెస్ లోకి ఎంట్రీ ఇస్తారనే చర్చ గట్టిగా జరుగుతోంది. ఇదే విషయాన్ని షర్మిల కూడా ధ్రువీకరించారు. ఇటీవలే ఢిల్లీలో సోనియా గాంధీతో భేటీ తర్వాత మీడియాతో మాట్లాడిన ఆమె? తెలంగాణలో కేసీఆర్ ను పడగొట్టడమే తమ లక్ష్యమని ప్రకటించారు. రేపోమాపో ఆమె పార్టీ కాంగ్రెస్ లో విలీనమయ్యే అవకాశం కనిపిస్తోంది. విలీనం జరగటంతో పాటు షర్మిల గతంలో ప్రకటించిన మాదిరిగా పాలేరులో పోటీ చేస్తే కాంగ్రెస్ గుర్తుపైనే బరిలో ఉండాల్సి వస్తుంది. అలా కాకుండా రాజ్యసభకు పంపినా? అదే గుర్తుపై వెళ్తోంది. దాదాపు ఆమె తెలంగాణ వేదికగానే రాజకీయాలు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నట్లు కనిపిస్తోంది. ఇక ఇటీవల కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు కీలక వ్యాఖ్యలు చేశారు. తాను నాలుగు దశాబ్దాల నుంచి తెలంగాణలోనే రాజకీయాలు చేస్తున్నానని.. ఏపీ పాలిటిక్స్ లో చొరవ చూపలేదని అన్నారు. తన భార్య, పిల్లలు అందరూ తెలంగాణలోనే ఉంటున్నారని అన్నారు. తాను ఇక్కడి మట్టిలోనే కలిసిపోతానని వ్యాఖ్యానించారు. తనను తెలంగాణ వ్యక్తి లాగా గుర్తించాలని తెలంగాణ కాంగ్రెస్ నేతలను కోరారు. ఈ వ్యాఖ్యలు కూడా తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారాయి. సరిగ్గా ఈ ఇద్దరు నేతలను టార్గెట్ చేసే పనిలో పడింది బీఆర్ఎస్. వీరిద్దరిని ప్రస్తావిస్తూ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ తెలంగాణ కాంగ్రెస్ ను ఇరకాటంలోకి నెట్టాలని చూస్తోంది.

# న్యూఢిల్లీ డిక్లరేషన్ కు ఏకగ్రీవ ఆమోదం

జీ20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా విడుదల చేసే జాయింట్ డిక్లరేషన్ కు సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. ఈ న్యూఢిల్లీ డిక్లరేషన్ లోని మొత్తం 83 పేరాలను ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా ఆమోదించాయి. జీ 20 సదస్సు సందర్భంగా భారత్ రూపొందించిన న్యూఢిల్లీ డిక్లరేషన్ కు సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. జీ 20 అధ్యక్ష దేశంగా భారత్ కు ఇది గొప్ప విజయంగా భావించవచ్చు. అంతకుముందు, రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించిన పేరాపై కొన్ని అభ్యంతరాలు రాగా, ఆ పేరాలో భారత్ పలు మార్పులు చేసింది.జీ 20 సదస్సు జరుగుతున్న భారత్ మండపం లో సభ్య దేశాల ప్రతినిధుల మధ్య రెండో సెషన్ చర్చ జరుగుతున్న సమయంలో న్యూఢిల్లీ డిక్లరేషన్ కు సభ్య దేశాల ఏకగ్రీవ ఆమోదం లభించిన విషయాన్ని భారత ప్రధాని మోదీ వెల్లడించారు. అందరి సహకారం, కృషితో ఇది సాధ్యమైందన్నారు. “ఇప్పుడే శుభవార్త తెలిసింది. మా టీమ్స్ కృషి, మీ సహకారంతో న్యూ ఢిల్లీ డిక్లరేషన్ కు ఏకగ్రీవ ఆమోదం లభించింది” అని మోదీ ప్రకటించారు. “ఇందుకు సహకరించిన, కృషి చేసిన భారత మంత్రులు, అధికారుల బృందానికి, షేర్పాలకు, ఇతర అధికారులకు ధన్యవాదాలు” అన్నారు.జీ 20 సదస్సులో సభ్య దేశాల అధినేతలు సంయుక్తంగా ప్రకటించాల్సిన న్యూఢిల్లీ డిక్లరేషన్ కు ఏకగ్రీవ ఆమోదం లభించడం కొంత సమస్యగా మారింది. రష్యా – ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించిన అంశంపై డిక్లరేషన్ లో పేర్కొన్న లైన్స్ ను కొన్ని సభ్య దేశాలు, ముఖ్యంగా అమెరికా, యూరోప్ దేశాలు వ్యతిరేకించాయి. దాంతో, ఆ పేరాలో భారత్ పలు మార్పులు చేసింది. “రెండు రోజుల ఈ సదస్సులో కీలక నేతలు కొన్ని విలువైన సూచనలు చేశారు. మరి కొన్ని ముఖ్యమైన ప్రతిపాదనలూ తీసుకొచ్చారు. వీటన్నింటినీ పున:సమీక్షించుకోవాల్సిన అవసరం, బాధ్యత మాపై ఉన్నాయి. ఈ సదస్సులో చర్చించిన అంశాలపై వర్చువల్‌గా రివ్యూ చేసుకోవాలని ప్రతిపాదిస్తున్నాను. నవంబర్‌లో ఈ వర్చువల్ భేటీ చేయాలని భారత్ ప్రతిపాదిస్తోంది” ఐక్యరాజ్య సమితి గురించి ప్రస్తావించారు. ఐరాస స్థాపించినప్పటికి ఇప్పటికి ప్రపంచం చాలా మారిపోయిందని, ఈ మార్పులకు అనుగుణంగా యూఎన్ లో సంస్కరణలు చేయాల్సిన అవసరముందని సూచించారు. “ఐక్యరాజ్య సమితి స్థాపించినప్పుడు ప్రపంచం వేరు. ఇప్పుడు పరిస్థితులు వేరు. అప్పట్లో కేవలం 51 దేశాలకే సభ్యత్వం ఉండేది. ఇప్పుడా సంఖ్య 200కి చేరుకుంది. కానీ శాశ్వత సభ్యత్వం ఉన్న దేశాల సంఖ్యలో మాత్రం మార్పు రాలేదు. అప్పటికి ఇప్పటికి ప్రపంచం చాలా మారిపోయింది. ఇప్పటికి పరిస్థితులకు అనుగుణంగా మార్పులు రావాల్సిన అవసరముందని ప్రధాని మోడీ తేల్చి చెప్పారు. జీ20 సదస్సులో కల్చర్ కారిడార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కల్చరల్ కారిడార్ జీ20 సభ్యులు, ఆహ్వానిత దేశాల భాగస్వామ్య వారసత్వాన్ని సూచిస్తుంది. ఇది జీ20 సభ్యులు, 9 ఆహ్వానిత దేశాల గుర్తింపు చిహ్నాలు.. గుర్తించదగిన సాంస్కృతిక వస్తువులు.. వారసత్వాన్ని కలిగి ఉంటుంది.ఈ కల్చర్ కారిడార్ విభిన్న సాంస్కృతిక వ్యక్తీకరణల అవగాహన.. వారసత్వాన్ని ప్రోత్సహించడానికి, జ్ఞానాన్ని పంచుకోవడం, చేరిక, సమానత్వం కోసం.. భాగస్వామ్య గుర్తింపు భావాన్ని పెంపొందించడానికి శక్తివంతమైన వేదికగా పనిచేస్తుంది. ఈ ప్రాజెక్ట్ భారతదేశం జీ20 థీమ్ ‘వసుధైవ కుటుంబం’, కల్చర్ వర్కింగ్ గ్రూప్ (అచిఉ) హాల్‌మార్క్ క్యాంపెయిన్ ‘కల్చర్ యూనైట్స్ ఆల్’ ఆధారంగా రూపొందించారు. జీ20 సదస్సు జరిగే భారత మండంపలో దీనిని ఆవిష్కరించి.. రెండు రోజుల పాటు ప్రదర్శించారు. దీనిలో దేశాల వారీగా జీ20 సభ్యులు, 9 ఆహ్వానిత దేశాల సాంస్కృతిక వస్తువులు, వారసత్వ వివరాలను ప్రతినిధులకు తెలిసేలా.. ఏర్పాట్లు చేశారు.ప్రధాని నరేంద్ర మోదీ బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాకోకి గ్యావెల్ కు జీ 20 అప్పగించారు. వచ్చే ఏడాది బ్రెజిల్‌లో జీ20 సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు ప్రధాని మోదీ. ఇందుకు సంకేతంగా గ్యావెల్ అప్పగించారు. తనకు ఎంతో సన్నిహితుడైన లూయిజ్‌కి గ్యావెల్ అందిస్తున్నట్టు ప్రకటించారు. దీనిపై బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాకియో స్పందించారు. గాంధీజీకి నివాళులర్పించడం ఎంతో భావోద్వేగానికి గురి చేసిందని వెల్లడించారు. అహింసా మార్గంలో దశాబ్దాల పాటు ముందుకు నడిచారని, అందరికీ ఆదర్శంగా నిలిచారని ప్రశంసలు కురిపించారు. అంత గొప్ప వ్యక్తికి ఇలా శ్రద్ధాంజలి ఘటించడం చాలా ఉద్వేగంగా అనిపించిందని వెల్లడించారు. తన రాజకీయ జీవితంలో మహాత్మా గాంధీజీ స్ఫూర్తి తప్పకుండా ఉంటుందని చెప్పారు.జీ20 2024 అధ్యక్ష బాధ్యతలు అప్పగించడంపై బ్రెజిల్ అధ్యక్షుడు సంతోషం వ్యక్తం చేశారు. అంచనాలకు అనుగుణంగానే చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించారు. జీ20 ని జియో పొలిటికల్ వివాదాలతో విడదీయటం సరికాదని తేల్చి చెప్పారు. కోట్లాది మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని, ఈ సమస్యపై దృష్టి సారించాలని సూచించారు. “బ్రెజిల్‌లో జరగనున్న జీ20 సదస్సులో మేం మూడు అంశాలకు ప్రాధాన్యతనివ్వనున్నాం. ఆకలిపై పోరాటం చేయడం, సుస్థిరాభివృద్ధి సాధించడం, అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు తీసుకొచ్చేలా ప్రయత్నించడం. వీటిపైనే దృష్టి సారిస్తాం. జీ20ని జియోపొలిటికల్ అంశాలతో విడదీయడం సరికాదు. కేవలం డబ్బుల గురించే కాదు. ప్రజల ఆకలి గురించీ పట్టించుకోవాలి. సుస్థిరాభివృద్ధి ప్రమాదంలో పడుతోంది. ఆదాయంలో అసమానతలు ఉన్నప్పుడే ఇలాంటి సమస్యలు ఎదురవుతాయి”

# స్కిల్ డెవలప్ మెంట్ కేసు అంతా బోగస్

తెలుగు ట్రాక్,హైదరాబాద్

స్కిల్ డెవలప్‌మెంట్ కేసు నిరాధారమైందని సీమెన్స్ కంపెనీ మాజీ ఎండీ సుమన్ బోస్ అన్నారు. తన జీవితంలో తాను ఎంతో గౌరవం సంపాదించుకున్నానని అన్నారు. ఒక హత్య జరిగితే విచారణ చేస్తారని.. కానీ, స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో విచిత్రంగా హత్యకు (స్కామ్) గురైనట్లుగా చెబుతున్న వ్యక్తి బతికే ఉన్నాడని అభివర్ణించారు. బతికుండగానే హత్య (స్కామ్) జరిగిందని విచారణ చేస్తామంటున్నారని అన్నారు. దీనికి సంబంధించి సీమెన్స్ కంపెనీ మాజీ ఎండీ సుమన్ బోస్ మీడియా సమావేశం నిర్వహించారు."ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఆధారిత రాష్ట్రం. రాష్ట్రంలో కంపెనీ విషయమై మీ ముందుకు తెస్తున్నా. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడమే ప్రాజెక్టు లక్ష్యం. 2014లో ఐటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. దేశంలో 200కు పైగా ల్యాబ్‌లను ప్రారంభించాం. సీమెన్స్ కంపెనీ, ఏపీఎస్ఎస్‌డీసీ మధ్య ఒప్పందం ఉంది. ఒక సాఫ్ట్ వేర్‌పై యువతకు అవగాహన కల్పిస్తే దానికి డిమాండ్ పెరుగుతుంది. మార్కెటింగ్ లో భాగంగానే ప్రభుత్వం, సీమెన్స్ మధ్య 90:10 ఒప్పందం జరిగింది. సిమెన్స్ తో అగ్రిమెంట్ జరగలేదు అని సీఐడీ ఆరోపణ అవాస్తవం. ఒఖూఆఅ ప్రభుత్వ సంస్థ కాదా? ఎండీగా నేను, మా కంపెనీ సీఎఫ్ఓ సంతకం చేశాం. ఈ తప్పుడు ఆరోపణలు వింటుంటే నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదు. తప్పుడు ఆరోపణలు చేయడం సులువు. రెండున్నర ఏళ్లుగా ఒక్క సాక్ష్యం చూపించలేకపోయారు.. నిజం ఎప్పటికి నిజమే "

నేను వెళ్లిపోయాకే అనూహ్య పరిణామాలు

ప్రపంచవ్యాప్తంగా ఐటీ కంపెనీలు ఒప్పందాలు చేసుకుంటున్నాయి. 2021 వరకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 2.32 లక్షల మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. 2.32 మందికి సర్టిఫికేషన్ ఇస్తే వారు ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. లక్ష బిల్ట్ ఆపరేటర్- ట్రాన్స్ ఫర్ ఆపరేట్ పద్ధతిలో ఈ ప్రాజెక్టు నడిచింది. 2021లో ప్రాజెక్టును ప్రభుత్వానికి అప్పగించేశాం. ప్రాజెక్టు విజయవంతమైందని ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ కూడా మెచ్చుకున్నారు. 2018లోనే ఈ ప్రాజెక్టు నుంచి నేను బయటకు వెళ్లిపోయాను. 2021 తర్వాత అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఏపీఎస్ఎస్‌డీసీలో ఏం జరిగిందో నాకు తెలియదు.

ఇది విజయవంతమైన ప్రాజెక్టు

గతంలో మెచ్చుకున్న ఏపీఎస్ఎస్‌డీసీనే ఈ ప్రాజెక్టు బోగస్ అని ఆరోపించింది. శిక్షణ కేంద్రాలు చూడకుండానే అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఒక్క కేంద్రం సందర్శించలేదు.. ఒక్క తనిఖీ జరగలేదు. ఇలా ఎందుకు జరిగిందన్నది పెద్ద మిస్టరీ. ఒక హత్య జరిగిందని విచారణ చేయాలంటున్నారు. విచిత్రంగా హత్యకు గురైనట్లు చెబుతున్న వ్యక్తి బతికే ఉన్నాడు. బతికుండగానే హత్య జరిగిందని విచారణ చేస్తామంటున్నారు. నాపై, ఇతరులపై తీవ్రమైన అభియోగాలు మోపుతున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్.. చాలా విజయవంతమైన ప్రాజెక్టు -2016లో కేంద్రం విజయవంతమైన నమూనాగా ప్రకటించింది. ప్రాజెక్టు అందించిన అంతిమ ఫలితాలు చూసి మాట్లాడాలి. స్కిల్ డెవలప్‌మెంట్ ఫలితాలు మన కళ్ల ముందే ఉన్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు నూరు శాతం విజయవంతమైంది. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో ఏమాత్రం అవినీతి జరగలేదు. అన్నీ అధ్యయనం చేశాకే ఈ ప్రాజెక్టు ప్రారంభించాం. ప్రాజెక్టులో అధిక భాగం సీమెన్స్ నుంచి డిస్కౌంట్స్ రూపంలో అందింది. డిస్కౌంట్స్ లో అవినీతి సాధ్యమని ఎలా చెబుతారు? సీమెన్స్ తో ఒప్పందం జరగలేదనడం పూర్తి అబద్ధం. ప్రాజెక్టుపై అవినీతి ఆరోపణలు చేయడం ఆశ్చర్యంగా ఉంది. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రభుత్వంలో భాగం కాదా? ఎలాంటి మనీలాండరింగ్ జరగలేదు. కోర్టుల పరిధిలో ఉన్నందున కోర్టులకు అన్ని విషయాలు చెబుతాం. ముగ్గురి మధ్య జరిగిన ట్రైపార్టీ ఒప్పందం ఇది. సీమెన్స్ పై చేస్తున్న ఆరోపణలు అన్నీ బోగస్. ఇదే తరహా ప్రాజెక్టు చాలా రాష్ట్రాల్లో అమలు చేశాం.. చేస్తున్నాం. కియా మోటర్స్ సంస్థ కోసం మానవ వనరులకు పూర్తి శిక్షణ ఇచ్చాం. గొప్పగా శిక్షణ ఇవ్వడంపై కియా సంస్థ ఆశ్చర్యం వ్యక్తం చేసింది. రూ.321 కోట్ల ప్రాజెక్టులో రూ.10 కోట్లే సీమెన్స్ కు వచ్చింది. ఒప్పందంలో పేర్కొన్న మొత్తం డిజైన్ టెక్ సంస్థ ఖాతాకు వెళ్లింది. డిజైన్ టెక్ సంస్థ అందరికీ నిధులు విడుదల చేసింది. సీమెన్స్ లో ప్రాజెక్టు అప్రూవల్‌కు అన్ని పత్రాలు ఉన్నాయి. ఈ ఒప్పందంలో తేదీల్లో మార్పులున్నాయి అనడంలో వాస్తవాలు లేవు. అందరం ఒకేసారి ఒప్పందంపై సంతకాలు చేశాం. ఆరోజు విద్యుత్ పోతే.. కొవ్వొత్తులు పెట్టుకుని చేశాం. ఇప్పటివరకు చేస్తున్న ఆరోపణలకు ఒక్క ఆధారం కూడా చూపలేదు. ఇలాంటి ఆరోపణలు పలువురి జీవితాలపై ప్రభావం చూపుతాయి" అని సీమెన్స్ కంపెనీ మాజీ ఎండీ సుమన్ బోస్ వివరించారు

# యశోభూమిని ప్రారంభించిన ప్రధాని

తెలుగు ట్రాక్,న్యూఢిల్లీ,

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పుట్టిన రోజున వేలాది కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా చేతి వృత్తుల వారి కోసం 13 వేల కోట్లతో 'పీఎం విశ్వకర్మ' పథకానికి శ్రీకారం చుట్టారు. ద్వారకా సెక్టార్ 21 నుంచి సెక్టార్ 25 వరకు పొడగించిన ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ లైన్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మెట్రో ఉద్యోగులతో ప్రధాని మోదీ ముచ్చటించారు. అనంతరం ప్రధాని మోదీ మెట్రోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీతో పిల్లలు, ప్రయాణికులు సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ వారితో సరదాగా మాట్లాడారు.

విశ్వకర్మ జయంతి సందర్భంగా ద్వారకలోని ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో సెంటర్‌లో 'పీఎం విశ్వకర్మ' అనే కొత్త స్కీమ్‌ను ప్రారంభించే ముందు ప్రధాని నరేంద్ర మోదీ విశ్వకర్మకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా చేతి వృత్తి కళాకారులతో ముచ్చటించారు మోదీ. వాళ్ల బాగోగులను, ఉపాధి, పని గురించి అడిగి తెలుసుకున్నారు.

ఢిల్లీ మెట్రోలో ప్రధాని మోదీ ప్రయాణిస్తున్న క్రమంలో ఓ యువతి ప్రధాని నరేంద్ర మోదీకి 73వ పుట్టినరోజు సందర్భంగా సంస్కృత భాషలో శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా సంస్కృత భాషలో పాట పాడుతూ



ఆమె మోదీకి స్పెషల్ విషెస్ తెలిపింది.అదే విధంగా ఢిల్లీలో 73 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ (ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో సెంటర్ -ఎఎఅఅ) యశోభూమిని ప్రధాని మోదీ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ద్వారకాలో యశోభూమి సమావేశ మందిరాన్ని అత్యాధునిక వసతులతో నిర్మించారు. ప్రపంచంలో అతిపెద్ద కన్వెన్షన్ సెంటర్ ఇదే కావడం విశేషం..

యశోభూమిలో 15 సమావేశ గదులను నిర్మించారు. వీటిలో ప్రధాన ఆడిటోరియంతో పాటు 13 ఇతర సమావేశ గదులు ఉన్నాయి. మొత్తం 11 వేల మంది ప్రతినిధులు సమావేశం అయ్యే విధంగా రూపొందించారు. ప్రధాన ఆడిటోరియంలో 6 వేల మంది కూర్చొనే వెసులుబాటు ఉంది. అంతేకాకుండా 1.07 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఎగ్జిబిషన్ ప్రాంతాన్ని కూడా ఏర్పాటు చేశారు.పటిష్టమైన భద్రతా చర్యలతో అత్యాధునిక హంగులతో కేంద్ర ప్రభుత్వం ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో సెంటర్ -ఎఎఅఅ ను నిర్మించింది.

# వారంలోగా ఇళ్లు ఖాళీ చేయండి..

తెలుగు ట్రాక్,విజయవాడ

సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నివాసానికి సమీపంలోని అమరారెడ్డి, మదర్ థెరిసా కాలనీల్లో నివాసం ఉండే పేదలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. వారంలోగా ఇళ్లు ఖాళీ చేసి వెళ్లాలని నోటీసుల్లో పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి- తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో సీఎం జగన్ ఇంటికి సమీపంలో కాలువకట్ట వెంబడి ఉన్న వెయ్యి మంది ఇళ్ల యజమానులకు నోటీసులు ఇచ్చారు. ఇళ్లు ఖాళీ చేయాలని, లేని పక్షంలో తామే బలవంతంగా తొలగిస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు. దీంతో అమరారెడ్డి నగర్, మదర్‌థెరిసా కాలనీ వాసులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యమంత్రి జగన్ భద్రత విషయంలో ఇబ్బందులొస్తాయని కారణంతో ఏడాది క్రితం ఇక్కడ ఉన్న వారు ఇళ్లు ఖాళీ చేయాలని అధికారులు కాలనీ వాసులకు సూచించారు. ఆ సమయంలో తమకు ప్రత్యామ్నాయం చూపిస్తే ఖాళీ చేస్తామని ఆయా కాలనీ వాసులు చెప్పారు. ఈ క్రమంలో వారందరికీ ఇటీవల అమరావతిలో సెంటు స్థలం కేటాయించారు. ప్రస్తుతం అమరావతిలో పేదల ఇళ్ల నిర్మాణ పనులు కోర్టు ఆదేశాలతో నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో గత రెండు రోజులుగా వార్డు సచివాలయ వాలంటీర్లు కాలనీ వాసుల ఇళ్లకు నోటీసులు అందజేశారు. వారంలోగా నివాసాలను ఖాళీ చేయాలని సూచించారు.దీంతో ఆ కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. తాము 30, 40 ఏళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నామని అన్నారు. తమకు ప్రత్యామ్నాయం చూపకుండా ఏడు రోజుల్లో చేయాలని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు ఇళ్లు ఖాళీ చేయమంటే ఎలా అని బాధితులు వాపోతున్నారు. ఇప్పుడు ఉన్న ఇళ్లు ఖాళీ చేసి ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. పేదల కోసం పేదలను ఖాళీ చేయించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నుంచి నోటీసులు అందుకున్న వారిలో ఎక్కువ శాతం దళిత వర్గాలకు చెందిన వారే ఉన్నారు. వీరంతా రోజువారి కూలీ పనులకు వెళ్లి కడుపు నింపుకునే వారే. ఇప్పుడు సీఎం భద్రత సాకుతో ఉన్న ఇళ్లను ఖాళీ చేయిస్తే తాము ఎక్కడ ఉండాలని, తమ జీవితాలు రోడ్డు మీద పడతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయం చూపిస్తే అక్కడికి వెళ్తామని అంటున్నారు. దీనిపై సీఎం జగన్‌కు వినతి పత్రం ఇవ్వాలని భావించినా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో చివరిగా వారికి ఉన్న ఒకే ఒక్క అవకాశం కూడా లేకుండా పోయిందని వాపోయారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాము నోటీసులు అందిస్తున్నట్లు సచివాలయ వలంటీర్లు చెప్పారు. నీటి పారుదల అధికారులు స్పందిస్తూ.. కాలువ కట్ట అంతా నీటి పారుదల శాఖకు చెందినదని, చట్టం ప్రకారం కాలువ కట్ట వెంబడి శాశ్వత నివాసాలు ఉండడానికి వీల్లేదని చెబుతున్నారు. కాలువ కట్టల వెంబడి నివసించడానికి వీల్లేదన్నారు. బాధితులకు వామపక్షాల నేతలు అండగా నిలిచారు. నిర్వాసితులకు ఎక్కడైనా ప్రత్యామ్నాయం చూపించాలని, ఆ తరువాతే ఖాళీ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ప్రభుత్వం తీరును ఎండగడుతూ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# మాకు ఏం అవసరం- దగ్గుబాటి

తెలుగు ట్రాక్,విజయవాడ

మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కేసులో ఏపీ సీఐడీ అరెస్ట్ చేయడం వెనుక కేంద్ర ప్రభుత్వ పాత్ర ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బీజేపీ అండదండలతోనే ఏపీ ప్రభుత్వం ఈ పని చేయగలిగిందనే ఆరోపణలు రాజకీయ వర్గాల నుంచి కూడా వినిపిస్తున్నాయి. దేశ రాజకీయాల్లోనే సీనియర్ నేతగా ఉండటంతో పాటు 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబును అరెస్ట్ చేయడమంటే ఆషామాషీ విషయం కాదని అంటున్నారు. కేంద్ర ప్రభుత్వ మద్దతు లేకుండా సీఎం జగన్ ఈ పని చేయలేరని, ఖచ్చితంగా బీజేపీ పెద్దల సపోర్ట్‌తో చంద్రబాబు అరెస్ట్ జరిగిందని ఆరోపిస్తున్నారు.టీడీపీ నేతలు, కార్యకర్తలు కూడా బీజేపీ పాత్రపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం దీనిపై ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి స్పందించారు. మీడియాతో మాట్లాడిన ఆమె.. చంద్రబాబు అరెస్ట్ వ్యవహారంపై స్పందించారు. ఈ సందర్భంగా ఇందులో బీజేపీ పాత్ర ఉందనే ఆరోపణలను పురందేశ్వరి తీవ్రంగా ఖండించారు. బాబు అరెస్ట్ వెనుక బీజేపీ పాత్ర ఉన్నట్లు జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని క్లారిటీ ఇచ్చారు. అందులో కొంచెం కూడా వాస్తవం లేదని, కొంతమంది కావాలనే బీజేపీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అదంతా ఫేక్ ప్రచారమని, కేంద్ర ప్రభుత్వం దీని వెనుక లేదని తెలిపారు. చంద్రబాబు అరెస్ట్‌పై మొదట స్పందించింది బీజేపీనేనని, ఆయనను అరెస్ట్ చేసిన విధానాన్ని తాము తీవ్రంగా ఖండించినట్లు స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణ బీజేపీ నేతలందరూ బాబు అరెస్ట్‌ను ఖండించారని పేర్కొన్నారు.వైసీపీ కనుసన్నల్లో సీఐడీ పనిచేస్తుందని పురందేశ్వరి ఆరోపించారు. సీఐడీ అనేది రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటుందని, కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. అలాగే వచ్చే ఎన్నికల్లో టీడీపీతో పొత్తు పెట్టుకుంటామని చంద్రబాబుతో ములాఖత్ తర్వాత రాజమండ్రి సెంట్రల్ జైలు వద్ద జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన ప్రకటనపై కూడా పురందేశ్వరి స్పందించారు. పవన్ వ్యాఖ్యలను తాము తప్పుగా చూడటం లేదన్నారు. బీజేపీ అధిష్టానానికి అన్నీ వివరిస్తామని పవన్ అన్నారని, అదే విధంగా ఏపీ పరిస్థితులను



కూడా చెబుతారని పురందేశ్వరి చెప్పారు. బీజేపీతో జనసేన పొత్తు కొనసాగుతూనే ఉందని తెలిపారు. పొత్తుల విషయంపై బీజేపీ పెద్దలతో మాట్లాడిన తర్వాత తమ అభిప్రాయలు చెబుతామన్నారు. పవన్ వ్యాఖ్యలను హైకమాండ్‌కు వివరిస్తామని, ఢిల్లీకి వెళ్లి తన అభిప్రాయాలు చెబుతానన్నారు. పొత్తుల గురించి తమతో చర్చించే సమయంలో బీజేపీ అధిష్టానానికి రాష్ట్ర నాయకత్వం తరపున అభిప్రాయాలు చెబుతానని పురందేశ్వరి తెలిపారు. కాగా వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కలిపి వెళతాయని ప్రకటించిన పవన్.. బీజేపీ కూడా కలిసొస్తే సంతోషకరమని వ్యాఖ్యానించారు. బీజేపీ కూడా తమతో నడిచేలా కేంద్ర పెద్దలతో చర్చిస్తానని అన్నారు. ప్రస్తుతం వైసీపీ, టీడీపీకి బీజేపీ సమదూరం పాటిస్తుంది. అలాగే టీడీపీ, వైసీపీ కూడా పార్లమెంట్‌లో ప్రతి అంశంపై బీజేపీకి మద్దతిస్తున్నాయి. దీంతో రెండు పార్టీలు బీజేపీ పట్ల సానుకూలతతో ఉన్నట్లు అర్థమవుతుంది. కానీ ఎన్నికల్లో ఏ పార్టీతో కలిసి వెళ్లాలనేది మాత్రం బీజేపీ ఇంకా తేల్చుకోలేకపోతోంది.

# జగనన్న ఆరోగ్య సురక్ష.. ప్రజలందరికీ రక్ష

## ఐదు దశల్లో కార్యక్రమం అమలు ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

తెలుగు ట్రాక్,అమరావతి:

జగనన్న ఆరోగ్య సురక్ష.. ప్రజలందరికీ రక్ష అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. మంగళగిరిలోని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ రోజు ఏకంగా 90 శాతం కుటుంబాలు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లబ్ధిపొందుతున్నాయి. అంటే తమ ప్రభుత్వం ఆరోగ్యశ్రీని ఎంతగా బలోపేతం చేసిందో , ఏ స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నదో అర్థం చేసుకోవచ్చు అని అన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం ద్వారా ఇప్పటి వరకు 2.30 కోట్ల ఓపీలు నమోదయ్యాయని, ఇది ఒక చరిత్ర అని మంత్రి తెలిపారు. తమ ప్రభుత్వం దాదాపు 8,500 కోట్ల రూపాయాల ఖర్చుతో రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను కొత్తగా నిర్మిస్తోందన్నారు. ఈనెల 15న జగనన్న ఐదు మెడికల్ కళాశాలలను విజయనగరం నుంచి పారంభించారని గుర్తు చేశారు. మరో రెండేళ్లలో మిగిలిన 12 కళాశాలలను కూడా పూర్తిచేసి ప్రారంభిస్తామన్నారు.

ఇంటింటికీ వాలంటీర్ల బృందం

జగనన్న సంక్షేమ రాడార్ నుంచి ఎవరూ తప్పించుకోకూడదనే లక్ష్యంతో ఆరోగ్య సురక్ష కార్యక్రమం రూపుదిద్దుకుందన్నారు. మొత్తం ఐదు దశల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మొదటి దశలో వాలంటీర్ల ఇంటింటి సర్వే ఈ నెల 15వ తేదీన ప్రారంభమైందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వాలంటీర్లు, ఎన్ ఎస్ ఎస్, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తల బృందం తొలి దశలో గ్రామాల్లో ఇంటింటికీ వెళుతుందని చెప్పారు. ఈ బృందం ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీహెచ్వో గాని, ఏఎన్ ఎంగాని అదే ఇంటికి ఎప్పుడు వస్తారో చెప్పి.. ఆ రోజు కచ్చితంగా ఇంటి వద్దనే ఉండాలని వాలంటీర్లు





సమాచారం ఇస్తున్నారని చెప్పారు.

ఆరోగ్యశ్రీ కి సంబంధించిన అవగాహనా పత్రాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లి ఈ పథకం గురించి పూర్తిస్థాయిలో చైతన్యం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్న ఆస్పత్రులు ఏంటి..? ఆ ఆస్పత్రులు అందించే సేవల వివరాలు.. ఇలా అన్ని విషయాలు వాలంటీర్ల బృందం అందరి ఇళ్లకు వెళ్లి ఇప్పటికే గ్రామాల్లో వివరిస్తున్నారని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ యాప్‌ను కూడా డౌన్‌లోడ్ చేసి అందరి సెల్‌ఫోన్లలో అందుబాటులో ఉండేలా వాలంటీర్లు ఈ క్యాంపెయిన్‌లో చొరవచూపుతున్నారని పేర్కొన్నారు. ఒక్కో వాలంటీర్ ఎంతమందితో ఆరోగ్యశ్రీ యాప్‌లు డౌన్ లోడ్ చేయించారనే దాన్ని బట్టి ఆ వాలంటీర్ పని మదింపు జరుగుతుందని వివరించారు.

ఏడు రకాల టెస్టులు

మంత్రి విడదల రజని మాట్లాడుతూ రెండో దశలో భాగంగా సీహెచ్ వో , ఏఎన్ ఎంలు రెండు బృందాలుగా ఏర్పడి అందరి ఇళ్లకు వెళతారని చెప్పారు. ఈ బృందంలో ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు కూడా ఉంటారని తెలిపారు. కార్యక్రమం ఇప్పటికే ఈ రోజు నుంచి ప్రారంభమైందని,ఆశాజనకంగా ఫలితాలు వస్తున్నాయని వెల్లడించారు. సీహెచ్వో బృందం సగం ఇళ్లను, మరో సగం ఇళ్లను ఎఎన్ ఎం బృందం వారి వారి గ్రామాల్లో పర్యటించేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు.

పలు విభాగాల సమన్వయంతో...

మూడో దశలో భాగంగా వాలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, సేవాభావం కలిగిన వ్యక్తుల బృందం మరోసారి ఇంటింటికీ వెళతారన్నారు. పలు విభాగాల అధికారులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతారన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో, తహశీల్దార్ మార్గదర్శకాల మేరకు వైద్య శిబిరాలను ఏర్పాటుచేస్తారన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు గ్రామంలోని బాలింతలు, గర్భిణులు, శిశువులు.. ఇలా అందరి వివరాలను ఎఎన్ ఎంలకు అందజేస్తారని, వీరంతా కచ్చితంగా వైద్య శిబిరానికి హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు

ఒక్కో వైద్య శిబిరంలో నలుగురేసి చొప్పున డాక్టర్లు

నాలుగో దశలో భాగంగా రాష్ట్రంలోని మొత్తం 10,032 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 542 అర్బన్ ప్రైమరీ హెల్త్ క్యాంపుల పరిధిలో వైద్య శిబిరాలను నిర్వహించబోతున్నామన్నారు. ఈ నెల 30 నుంచి శిబిరాలు మొదలుపెట్టి.. 45 రోజుల్లోగా పూర్తయ్యేలా పక్కా ప్రణాళిక రూపొందించామన్నారు. ఒకవేళ రోగులకు చికిత్స అవసరమైతే వారిని రాష్ట్రంలోని సెకండరీ ఆస్పత్రులకుగాని, టెర్షియరీ ఆస్పత్రులకు గాని, ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చే ఆస్పత్రులకు గాని రిఫర్ చేస్తారన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవో, తహశీల్దార్, పీహెచ్‌సీల వైద్యాధికారులు ఈ వైద్య శిబిరాల పూర్తి బాధ్యత తీసుకుంటారని, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ ఆరోగ్య అధికారులు, యూపీహెచ్‌సీల వైద్యాధికారులు ఈ వైద్య శిబిరాల బాధ్యత తీసుకుంటారని వివరించారు. ప్రతి వైద్య శిబిరంలో నలుగురు డాక్టర్లు వైద్య సేవలు అందజేస్తారన్నారు. వారిలో ఇద్దరు పీహెచ్‌సీ డాక్టర్లు అంటే పీహెచ్‌సీ పరిధిలోని ఫ్యామిలీ డాక్టర్, అదే పీహెచ్‌సీలో ని మరో వైద్యాధికారి ఈ శిబిరంలో ఉంటారని తెలిపారు. మరో ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు ఒకరు కచ్చితంగా మహిళా డాక్టర్ ఉంటారని తెలిపారు.

రోగి కోలుకునే వరకు..

ఐదో దశలో ఆ గ్రామానికి చెందిన ఫ్యామిలీ డాక్టర్, సీహెచ్‌వో, ఎఎన్‌ఎంలు రిఫరల్ కేసులకు సంబంధించిన రోగులకు ఫాలో అప్ వైద్యం అందిస్తారని తెలిపారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందేందుకు సిఫారసు చేసిన ప్రతి రోగి జబ్బు పూర్తిగా నయమయ్యాకే వారి కేసు ఆన్‌లైన్‌లో పూర్తయినట్లు లెక్క అని వివరించారు.

నకిలీ ఎల్వోపీలపై విచారణ

ఈ సందర్భంగా విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి రజని సమాధానం చెప్పారు. నకిలీ మందుల విషయంలో కఠినంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఎక్కడైనా ఇందుకు సంబంధించిన సంఘటనలు వెలుగులోకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పీజీ సీట్ల విషయంలో నకిలీ ఎల్వోపీలపై విచారణ కొనసాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, కార్యదర్శి డాక్టర్ మంజుల డీహెూస్మని, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ జె.నివాస్, ఆరోగ్యశ్రీ సీఈవో హరీంద్రప్రసాద్, డీహెచ్ డాక్టర్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఒకేసారి 9 మెడికల్ కాలేజీలు

తెలుగు ట్రాక్,హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ఏకకాలంలో 9 మెడికల్ కాలేజీలు ప్రారంభించుకోవడం రాష్ట్ర చరిత్రలో ఉజ్వలమైన దినం ఇది అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో ఒకేసారి తొమ్మిది వైద్య కళాశాలలు ప్రారంభించుకోవడం సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టం అని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రగతి భవన్ నుంచి వర్చువల్ విధానంలో ఒకేసారి 9 మెడికల్ కాలేజీలను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగాం జిల్లాల్లో ఈ కాలేజీలు ఏర్పాటు కాబోతున్నాయి. ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొంటామని, కానీ ఈ కార్యక్రమం ఎంతో ఆత్మసంతృప్తి కలిగిస్తుందని తెలిపారు. పరిపాలన చేతకాదు అని ఎగతాళి చేసిన పరిస్థితుల నుంచి ఇప్పుడు తెలంగాణలోని ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసుకుంటున్నామని కేసీఆర్ అన్నారు. గతంలో రాష్ట్రంలో 5 మెడికల్ కాలేజీలు ఉంటే, ఆ సంఖ్య 26కు చేరుకుందని తెలిపారు.

వచ్చే విద్యా సంవత్సరానికి 8 కాలేజీలు కొత్తగా ప్రారంభం కాబోతున్నట్లు తెలిపారు. ఈ కొత్త వైద్య కళాశాలలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం కూడా లభించినట్లు సీఎం కేసీఆర్ తెలిపారు.2014లో రాష్ట్రంలో 2,850 మెడికల్ సీట్లు ఉంటే 2023 నాటికి 8,515 మెడికల్ సీట్లు ఉన్నాయని కేసీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్యశాఖ మంత్రి, కార్యదర్శిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నట్లు కేసీఆర్ పేర్కొన్నారు. 85 శాతం మెడికల్ సీట్లు తెలంగాణ బిడ్డలకే దక్కాలని పటిష్టంగా పోరాటం చేసి హైకోర్టులో విజయం సాధించినట్లు తెలిపారు.

రాష్ట్రంలోని ప్రైవేటు, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ద్వారా ప్రతి సంవత్సరం 10 వేల మంది వైద్యులను ఉత్పత్తి చేయబోతున్నట్లు కేసీఆర్ పేర్కొన్నారు. ఎక్కడైతే వైద్యారోగ్య వ్యవస్థ పటిష్టంగా ఉంటుందో.. అక్కడ తక్కువ మరణాలు, నష్టాలు సంభవిస్తాయని కేసీఆర్ అన్నారు. దాన్ని స్ఫూర్తిగా తీసుకునే మెడికల్ కాలేజీలతో పాటు అద్భుతమైన ఆస్పత్రులను కూడా తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లు ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, ఇది తెలంగాణ రాష్ట్రం సాధించిన ఘనతగా తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఆస్పత్రులు నిర్మాణం కాబోతున్నాయని.. త్వరలోనే 50 వేల పడకలకు చేరుకోబోతున్నట్లు వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ పై కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కిట్ అంటే.. నాలుగు సబ్బులు, మూడు వస్తువులు కాదని.. వేజ్ లాస్ ను భర్తీ చేయడమే కేసీఆర్ కిట్ వెనక ఉన్న ఫిలాసఫీ అని కేసీఆర్ స్పష్టం చేశారు. నిరుపేద మహిళలు గర్భం దాల్చిన తర్వాత కూడా కూలీ పనులకు వెళ్తుంటారని.. వారి ఆరోగ్యాన్ని, శిశువు ఆరోగ్యాన్ని కాపాడే ఉద్దేశంతో మానవీయ కోణంలో తీసుకు వచ్చిందే కేసీఆర్ కిట్ అని తెలిపారు.

# విద్యార్థులు గొప్ప డాక్టర్లు కావాలి

### 5 మెడికల్ కాలేజీల ప్రారంభోత్సవంలో జగన్

తెలుగు ట్రాక్,విజయనగరం,

ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి విజయనగరం జిల్లాలో మెడికల్ కాలేజీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీలను కట్టే కార్యక్రమం మొదలు పెట్టామని చెప్పుకొచ్చారు. అందులో 5 మెడికల్ కాలేజీల్లో పిల్లలు అడ్మిషన్లు తీసుకొని డాక్టర్లుగా అడుగులు వేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. నిజంగా ఈ మెడికల్ కాలేజీల నుంచి నాణ్యమైన విద్య పొంది.. రాబోయే రోజుల్లో గొప్ప డాక్టర్లుగా, గొప్ప మనుషులుగా, గొప్ప వ్యక్తులుగా ఎదుగుతారని మనసారా ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు. ఈరోజు 5 మెడికల్ కాలేజీలు విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో ప్రారంభించామని చెప్పుకొచ్చారు. 5 చోట్ల ఫస్టియర్ అడ్మిషన్లకు కూడా ఈరోజు పిల్లలను తీసుకొనే పరిస్థితిలోకి అడుగులు వేగంగా ముందుకు వేయగలుగుతున్నామన్నారు. వచ్చే ఏడాది మరో 5 కాలేజీలను మళ్లీ అడ్మిషన్ స్థాయిలోకి తీసుకొచ్చే కార్యక్రమం చేస్తామన్నారు. దాని తర్వాత మళ్లీ మరుసటి ఏడాది మరో 7 కాలేజీలు అడ్మిషన్ స్థాయిలోకి తీసుకొస్తామని సీఎం జగన్ స్పష్టం చేశారు.

ఈ సంవత్సరం 5, వచ్చే ఏడాది 5, ఆ తర్వాత సంవత్సరం 7 మొత్తంగా 17 మెడికల్ కాలేజీలను తీసుకుని రాగలుగుతున్నాం అన్నారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా చేయడమే కాకుండా ప్రతి పార్లమెంటు స్థాయిలో ఒక మెడికల్ కాలేజీ పెట్టే కార్యక్రమం ఇనీషియేట్ చేస్తున్నామన్నారు. ఎప్పుడైతే మెడికల్ కాలేజీ అవైలబుల్‌గా ఉంటుందో అప్పుడు ఆ మెడికల్ కాలేజీతో పాటు ప్రొఫెసర్లుగానీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్లుగానీ వీళ్లందరూ అవైలబుల్‌గా ఉండటం కూడా ఒక గొప్ప మార్పు టెరిషరీ కేర్‌లో జరుగుతుందన్నారు. టెరిషరీ కేర్ పెరగడం వల్ల ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. ఇదంతా ఒక ఎత్తయితే వేలాది మంది పిల్లలను మంచి డాక్టర్లుగా తయారు చేసే గొప్ప ఇన్‌స్టిట్యూషన్స్‌ను కూడా రాష్ట్రంలో క్రియేట్ చేయగలగడం నిజంగా అద్భుతమన్నారు.స్వా తంత్ర్యం వచ్చిన తర్వాత నుంచి మన రాష్ట్రంలో గవర్నమెంట్ మెడికల్ కాలేజీలు 11 మాత్రమే ఉన్నాయని.. కేవలం ఈ నాలుగు సంవత్సరాల కాలంలో దేవుడి దయతో 13 జిల్లాలను 26 జిల్లాలుగా అధికారం డీసెంట్రలైజ్ చేయగలిగామన్నారు.

అవే కాకుండా మరో 17 మెడికల్ కాలేజీలను యాడ్ చేసి 28 మెడికల్ కాలేజీల దిశగా అడుగులు వేగంగా వేస్తున్నామన్నారు. 17 మెడికల్ కాలేజీలను కట్టడానికి దాదాపు రూ.8,480 కోట్లు ఖర్చు చేస్తున్నామని ముఖ్యమంత్రి జగన్ వివరించారు

# తెలుగు తమ్ముళ్లలో కొత్త టెన్షన్...

తెలుగు ట్రాక్,విజయవాడ

ఏపీలో స్కిల్ స్కాం కేసు హీటెక్కిస్తుంది. తాజాగా సీఐడీ చీఫ్ చూపించిన సంతకాలు, చెబుతున్న రహస్యాలు.. టీడీపీని కలవరానికి గురిచేస్తున్నాయి. లోకేష్ పాత్రపై విచారణ చేస్తామడంపై ఆపార్టీలో అలజడి నెలకొంది. బెయిల్ కోసం ఏసీబీ కోర్టులో వేర్వేరుగా రెండు పిటిషన్లను దాఖలు చేశారు చంద్రబాబు తరపు లాయర్లు. వాటికి కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయనుంది సీఐడీ. విచారణపై ఉత్కంఠ నెలకొంది.ఆంధ్రప్రదేశ్‌లో స్కిల్ డెవలప్మెంట్ స్కాం కేసు సంచలనం సృష్టిస్తుంది. నిందితునిగా మాజీ సీఎం చంద్రబాబు పేరును చేర్చారు. ఏసీబీ కోర్టుకు ఇచ్చిన 28 పేజీల రిమాండ్ రిపోర్ట్ లో నారా లోకేశ్ పేరును ప్రస్తావించారు. రిపోర్ట్ లో లోకేశ్ పేరు చేర్చుతూ.. స్కాంలో ఆయన పాత్రపై విచారణ చేస్తామని చెప్పారు ఏపీ సీఐడీ చీఫ్ సంజయ్. స్కిల్ కేసులో మొత్తం 10 కీలక అంశాలు ఉన్నాయని, అందులో ప్రమేయం ఉన్న వాళ్లందరికీ శిక్ష పడుతుందన్నారు. ఇప్పటికే రిమాండ్ రిపోర్ట్ లో లోకేశ్ పేరు ఉండగా.. తాజా లోకేశ్ ను విచారణకు పిలుస్తామని.. లోకేష్ పాత్రపై దర్యాప్తు చేస్తామని జరుపుతామన్నారు.రాజమండ్రి సెంట్రల్ జైలులో చంద్రబాబును కలిసిన పవన్ కల్యాణ్.. ఎక్కడైనా బాబు సంతకాలు ఉన్నాయా? ప్రూఫ్ లేకుండా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పవన్ చేసిన వ్యాఖ్యలకు సైతం సీఐడీ చీఫ్ కౌంటర్ ఇచ్చారు. చంద్రబాబు ఎక్కడెక్కడ సంతకాలు చేశారు, ఎప్పుడు పెట్టారన్న విషయాలను మీడియాకు వెల్లడించారు. మరోవైపు టీడీపీ అధినేత చంద్రబాబు తరపు న్యాయవాదులు ఏసీబీ కోర్టులో వేర్వేరుగా రెండు పిటిషన్లను దాఖలు చేశారు. బెయిల్,



మధ్యంతర బెయిల్ కోసం రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. సీఐడీకి నోటీసులు ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. దీంతో సీఐడీ ఇవాళ కౌంటర్ దాఖలు చేయనుంది.

ఈ పిటిషన్లు రేపు విచారణకు వచ్చే అవకాశముంది.ఇక ఏసీబీ రిమాండ్ ఆర్డర్లను కొట్టేయాలని ఏపీ హైకోర్టులో చంద్రబాబు ఇప్పటికే క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన హైకోర్టు.. ఇరువైపులా వాదనలు వినాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. సీఐడీని కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించిన న్యాయమూర్తి.. ఈ నెల 19కి విచారణను వాయిదా వేశారు. అలాగే చంద్రబాబును కస్టడీకి ఇవ్వాలంటూ ఏసీబీ కోర్టులో సీఐడీ దాఖలు చేసిన పిటిషన్ విషయంలోనూ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. సెప్టెంబరు 18 వరకు సీఐడీ కస్టడీ పిటిషన్‌పై విచారణ చేపట్టొద్దని ఏసీబీ కోర్టును ఆదేశించింది.

# పొత్తులతో మారనున్న రాజకీయ ముఖచిత్రం

తెలుగు ట్రాక్,విజయవాడ



సంక్షోభంలో అవకాశాలను వెదుక్కుంటానని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చెబుతూ ఉంటారు. ఇప్పుడు జనసేనతో పొత్తు ఖరారు విషయంలో చంద్రబాబు వ్యూహం చూస్తే అది నిజమేనని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ స్కీంలో స్కాం జరిగిందని చంద్రబాబును అరెస్ట్ చేశారు. ఆయనను రిమాండ్‌కు పంపారు. అదే సమయంలో అసలు డబ్బులు దుర్వినియోగం అయ్యాయని కానీ.. అవి చంద్రబాబుకు వచ్చాయని చిన్న ఆధారం కూడా లేదని టీడీపీ గట్టి వాదన వినిపిస్తోంది. జాతీయ స్థాయిలో చంద్రబాబుకు మద్దతు లభించింది. రాజకీయ కక్ష సాధింపుల కోసమే అరెస్ట్ చేశారని దాదాపుగా ఏకాభిప్రాయంతో నేతలు ఖండించారు. ఇలాంటి సమయంలో పవన్ కల్యాణ్.. రాజమండ్రిలో చంద్రబాబుతో ములాఖత్ అయి పొత్తులను ప్రకటించడం సంచలనంగా మారింది. టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తాయా లేదా అన్న సందిగ్ధం కొంత కాలం నుంచి ఉంది. చంద్రబాబు, పవన్ ఇద్దరూ రెండు, మూడు సార్లు సమావేశం అయ్యారు కానీ స్పష్టత రాలేదు. పొత్తుల ప్రకటనకు ఓ గట్టి సందర్భం అవసరం వచ్చింది. అది చంద్రబాబు అరెస్ట్ కన్నా గొప్ప టైమింగ్ ఉండదని డిసైడయ్యారు. హైకోర్టులో క్వాష్ పిటిషన్‌పై కౌంటర్ కు ప్రభుత్వం రెండు వారాల సమయం కావాలని అడగడం.. ఒక్క వారం హైకోర్టు గడువు ఇవ్వడంతో చురుగ్గా స్పందించారు. ములాఖత్ తర్వాత పొత్తుల ప్రకటన చేయాలని డిసైడయ్యారు. ఆ మేరకు అనుకున్న టెంపోను కొనసాగిస్తూ పొత్తుల ప్రకటన చేశఆరు. పవన్ కళ్యాణ్ సినిమాల్లో చెప్పిన ఈ డైలాగు పొలిటికల్ లైఫ్ లో కూడా వర్కవుట్ అవుతుందా. ఈ రోజు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతో రాజమండ్రిలో జైల్ లో ములాఖత్ తర్వాత జనసేన కీలక నిర్ణయం ప్రకటించింది. ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పై పొత్తులపై ప్రకటన చేశారు. చంద్రబాబు లాంటి సీనియర్ నాయకుడిని అలా జైల్లో పెట్టడం కేవలం వైసీపీ కక్ష సాధింపుకు నిదర్శనమంటూనే ఇన్నాళ్లుగా మనసులో ఉన్న మాటను బయటకు చెబుతున్నట్లు పవన్ కళ్యాణ్ పొత్తులపై క్లారిటీ ఇచ్చారు. ఈ నిర్ణయం కేవలం జనసేన, టీడీపీ భవిష్యత్తు కోసం కాకుండా రాష్ట్రం భవిష్యత్తు కోసం అని పవన్ చెబుతున్నారు.టీడీపీ ప్రస్తుతం కష్టాల్లో ఉంది. ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆయన నలభై ఐదేళ్ల పొలిటకల్ కెరీర్ లో ఎన్నడూ ఎదుర్కోని ఇబ్బందుల్లో ప్రస్తుతం ఉన్నారు. మరో వైపు ఆ పార్టీ భవిష్యత్ నాయకుడు నారా లోకేష్ విజయవంతంగా నడుస్తున్న యువగళాన్ని అర్ధాంతరంగా ఆపేయాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. ఇలాంటి టైమ్ లో పవన్ కళ్యాణ్ తీసుకున్న ఈ నిర్ణయం ఓ బలమైన ప్రతిపక్షాన్ని తయారు చేసి..రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమే లక్ష్యంగా పని చేయనుందా. లేదా సినిమా డైలాగులకు సంబంధం లేని పొలిటికల్ కెరీర్ లో ఈ నిర్ణయం అలజడి రేపనుందా..వేచి చూడాల్సిందే.

# నిర్వీర్యమవుతున్న కార్పొరేషన్లు

తెలుగు ట్రాక్,ఏలూరు

ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ఉపాధి భద్రత కల్పించి వెన్నుదన్నుగా నిలిచిన బిసి, ఎస్‌సి, కాపు, మైనార్టీ కార్పొరేషన్లు నిర్వీర్యమయ్యాయి. దీంతో వివిధ తరగతుల ప్రజలకు బ్యాంకు రుణాలతో ఉపాధి మార్గం ఎంచుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో ఆయా తరగతుల ప్రజల్లో తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వాల హాయాంలో బిసి, ఎస్‌సి, మైనార్టీ కార్పొరేషన్లకు ప్రత్యేక స్థానం ఉండేది. 2014లో టిడిపి ప్రభుత్వం వచ్చాక కాపు కార్పొరేషన్‌ను సైతం ఏర్పాటు చేసింది. చదువుకుని ఉపాధి లేని నిరుద్యోగులకు కార్పొరేషన్లు అండగా నిలిచేవి. ప్రతియేటా లక్ష్యాలు నిర్దేశించుకుని బిసి, ఎస్‌సి, మైనార్టీలకు బ్యాంకు రుణాలు ఇప్పించి ఉపాధి మార్గం చూపేవి. కిరాణా కొట్లు, ఫొటో స్టూడియోలు వంటి ఎన్నో వ్యాపారాలు పెట్టుకోవడంతోపాటు, కార్లు వంటివాటితో ఉపాధి పొందేందుకు కార్పొరేషన్లు సహాయ పడేవి. ప్రతి యూనిట్‌కూ రూ.లక్ష నుంచి రూ.పది లక్షలు వరకూ ఇచ్చిన పరిస్థితి కొనసాగేది. గత టిడిపి ప్రభుత్వ హాయాంలో కార్పొరేషన్ రుణాలు పెద్దఎత్తున ఇచ్చిన పరిస్థితి ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆర్థికంగా వెనుకబడిన బిసి తరగతికి చెందిన కుటుంబాలకు బిసి కార్పొరేషన్ ద్వారా దాదాపు పది వేలకుపైగా యూనిటీట్లు మంజూరయ్యాయి. కాపు కార్పొరేషన్ ద్వారా 15 వేల యూనిట్లు వరకూ ఇచ్చినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా తొమ్మిది వేలకుపైగా యూనిట్లు ఇచ్చారు. నిరుద్యోగులు, చదువుకోనివారు సైతం కార్పొరేషన్ ద్వారా బ్యాంకు రుణాలు పొంది లబ్ధి పొందారు. తీసుకున్న రుణంలో సగం సబ్సిడీ కింద ప్రభుత్వం భరించేది. రూ.లక్ష రుణం ఇస్తే రూ.50 వేలు సబ్సిడీ వర్తించేది. తీసుకున్న రుణంలో సగం సొమ్ము సబ్సిడీ కింద పోవడంతో లబ్ధిదారులకు ఎంతగానో మేలు జరిగేది. బ్యాంకు రుణాలు పొందిన కుటుంబాలకు ఏదోక ఉపాధి మార్గం దొరికేది. ఉపాధికి సంబంధించిన యూనిట్ ఏర్పాటు చేస్తేనే కార్పొరేషన్ ద్వారా బ్యాంకు రుణాలు మంజూరయ్యేవి. దీంతో లబ్ధి పొందిన ప్రతి కుటుంబమూ ఏదోక యూనిట్‌ను తప్పకుండా ఏర్పాటు చేసేవి. యూనిట్ ఏర్పాటుతో వచ్చే ఆదాయంతో ప్రతినెలా బ్యాంకు వాయిదాలు చెల్లించుకునేవారు. ఎంతోమంది కార్లు పొంది వాటిద్వారా ఉపాధి పొందారు. కార్పొరేషన్ రుణాల కింద కార్లు పొంది ఇప్పటికీ ఉపాధి పొందుతున్న కుటుంబాలు చాలా ఉన్నాయివైసిపి ప్రభుత్వం వచ్చాక బిసి, ఎస్‌సి, మైనార్టీ, కాపు కార్పొరేషన్లే కాకుండా, బిసి సామాజిక తరతగతుల్లో అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఛైర్మన్లను, డైరెక్టర్లను నియమించింది. అయితే నిధులు మాత్రం ఇవ్వలేదు. దీంతో ఛైర్మన్లుగా నియమితులైన వారు ఏం చేస్తున్నారో కూడా ఏఒక్కరికీ తెలియని పరిస్థితి ఉంది. కార్పొరేషన్ల పరిధిలో ఎటువంటి కార్యక్రమాలూ జరగడం లేదు. గతంలో రుణాల కోసం వచ్చే జనంతో కళకళలాడే కార్పొరేషన్లు నేడు వెలవెలబోతున్నాయి. పాత రుణాలకు సంబంధించిన వసూళ్లకు ఉద్యోగులు పరిమితమైన పరిస్థితి ఉంది. రాష్ట్రంలో అన్ని తరగతులకు ఇచ్చే సంక్షేమ పథకాల సొమ్మును బిసి, ఎస్‌సి, కాపు, మైనార్టీలకు ఇచ్చిన సొమ్ముగా చూపిస్తున్నారే తప్ప, ఉపాధి కల్పించే బ్యాంకు రుణాల గురించి మాత్రం ప్రభుత్వం మాట్లాడటం లేదు. కార్పొరేషన్ రుణాలు మంజూరు లేకపోవడంతో ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయి. కార్పొరేషన్ రుణాలను పునరుద్ధరించాలని ఆయా తరగతుల ప్రజలంతా ముక్తకంఠంతో కోరుతున్నారు.

# విపక్షాలను ఏకం చేస్తున్న జగన్



తెలుగు ట్రాక్,విజయవాడ

అక్టోబర్ 18, 2022 సరిగ్గా ఇక్కడే మొదలైంది పవన్ కళ్యాణ్– టీడీపీ కలిసి ఎన్నికలు వెళ్తున్నాయనే స్పష్టత వచ్చిన రోజు. దానికి రెండు రోజుల ముందు పవన్ కళ్యాణ్ విశాఖలో పర్యటించారు. అయితే ఆయన పర్యటనను పోలీసులు అడ్డుకున్నారు. కనీసం ప్రజల్లోకి వెళ్లే అవకాశం కూడా ఇవ్వకుండా వైసీపీ నాయకులు, సీఎం జగన్ అరాచక పాలన చేస్తున్నారంటూ పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. హోటల్ రూమ్ నుంచే జనసేన కార్యకర్తలకు అభివాదం చేసి తిరిగి వచ్చిన పవన్..ఆ తర్వాత అక్టోబర్ 18న మంగళగిరిలో జరిగిన పార్టీ కార్యకర్తల మీటింగ్ లో వైసీపీ శ్రేణులపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. అప్పటివరకూ పవన్ కళ్యాణ్ ఎప్పుడూ వాడని భాషతో వైసీపీ నాయకులను నానా బూతులు తిట్టారు.అదే రోజు సాయంత్రం పవన్ కళ్యాణ్ ను కలిసి సంఘీభావం ప్రకటించారు చంద్రబాబు. ప్రతిపక్షాలపై సీఎం జగన్ చూపిస్తున్న నియంతపూర్వక వైఖరిని ఖండించిన చంద్రబాబు..ఎన్నడూ పెద్దగా అరవని పవన్ కళ్యాణ్ నోట బూతులు వినటం ఫస్ట్ టైమ్ అంటూ ఛలోక్తులు విసిరారు. అప్పుడే పొత్తు ఉంటుందా కలిసి పోటీ చేస్తున్నారన్న ప్రశ్నలకు ఇది ప్రజాస్వామ్యం కోసం పోరాటం అంటూ తప్పించుకుంటూనే పరోక్ష సంకేతాలు పొత్తుపై ఇచ్చారుఆ తర్వాత జనసేన వారాహియాత్రకు ముందు పవన్ కళ్యాణ్– చంద్రబాబుల భేటీ జరిగింది. వారాహియాత్ర షెడ్యూల్ టీడీపీనే ఇచ్చిందని వైసీపీ నేతలు కామెంట్లు కూడా చేశారు. ఆ తర్వాత ఎన్డీయే దేశవ్యాప్తంగా తమ అనుకూల పార్టీలతో నిర్వహించిన సమావేశానికి పవన్ కళ్యాణ్ కు మాత్రమే తెలుగు రాష్ట్రాల నుంచి ఆహ్వానం అందింది. టీడీపీకి అలాంటి ఆహ్వానం లేకపోవటంతో చంద్రబాబుతో పొత్తుకు బీజేపీ సముఖంగా లేదా..కనుక జనసేన తో కూడా పొత్తు లేదా అనే అనుమానాలు మొదలయ్యాయి. కానీ చంద్రబాబు అరెస్ట్ తో సమీకరణాలు మారిపోయాయి. అదే రోజు మంగళగిరి వచ్చేందుకు ప్రయత్నించిన..పవన్ కళ్యాణ్ ను సరిహద్దుల్లో అడ్డుకోవటం..అక్కడ నుంచి పాదయాత్ర చేస్తానంటూ పవన్ కళ్యాణ్ పోలీసులతో వాగ్వాదానికి దిగటం..రోడ్డుపై పడుకోవటం పెద్ద రచ్చే జరిగింది ఆరోజు రాత్రి. చంద్రబాబు కోసమే పవన్ కళ్యాణ్ ఇలా ప్రవర్తిస్తున్నారని ఆయన అరెస్ట్ తోనే ఇంత ఆవేశానికి లోనయ్యారని వైసీపీ శ్రేణులు విమర్శించాయి. చంద్రబాబుతో రాజమండ్రి సెంట్రల్ జైల్ లో ములాఖత్ ఇక ఈ తరహా ఆరోపణలకు తెరదించేశారు పవన్ కళ్యాణ్. బీజేపీ సంగతి తనకు తెలియదు కానీ టీడీపీ మాత్రం వచ్చే ఎన్నికల్లో పొత్తు పెట్టుకుంటామని ప్రకటించేశారు జనసేనాని. జాయింట్ యాక్షన్ కమిటీ ద్వారా వైసీపీ ని ఎదుర్కోవాలో..ఎన్నికలకు ఎలా సమాయత్తం కావాలో నిర్ణయించుకుంటామని స్పష్టమైన ప్రకటన చేశారు. అలా విశాఖ అడ్డుకోవటాలతో మొదలైన జనసేన–టీడీపీ పొత్తుల చర్చ.. పవన్ ప్రకటనతో ఫుల్ క్లారిటీని సంతరించుకుంది.

# ఇక సిగ్నల్స్ వద్ద నో వెయిటింగ్

తెలుగు ట్రాక్,హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో రోజు రోజుకు ట్రాఫిక్ రద్దీ పెరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వం ఎన్ని ఫ్లైఓవర్లు కట్టినా.. ఎన్ని స్కైవేలు నిర్మించినా.. రద్దీ మాత్రం తగ్గటం లేదు. సిగ్నళ్ల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. వాహనాల రాకపోకల ఆధారంగా సిగ్నళ్లు మారే లేటెస్ట్ టెక్నాలజీ వినియోగంపై దృష్టిపెట్టాలని నిర్ణయం తీసుకుంది.ఇప్పటికే అందుబాటులో ఉన్న సాంకేతిక సిగ్నలింగ్ సిస్టంలో మరిన్ని మార్పులు చేయాలని భావిస్తోంది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఇఔఅ) జియావుద్దీన్, ట్రాఫిక్ పోలీస్ అదనపు కమి షనర్ సుధీర్ బాబు, ఎలక్ట్రిసిటీ విభాగం అధికారులతో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ మంగళవారం సమావేశమయ్యారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆటోమేటెడ్ ట్రాఫిక్ సిస్టమ్ కంట్రోల్ (యీఅ), పెలికాన్ సిగ్నళ్లు 404 ఉన్నాయి. ఏటీఎస్‌సీలో భాగంగా ప్రస్తుతం మూడు రకాలుగా సిగ్నళ్లు పని చేస్తున్నాయి. ఏ వైపు ఎన్ని సెకన్లు సిగ్నల్ వేయాలనేది (ఫిక్స్ మోడ్) ఒకటైతే.. వెహికల్ యాక్టివేటెడ్ కంట్రోల్ (ఎంఅ), మాన్యువల్ మోడల్‌లో సిగ్నలింగ్ వ్యవస్థ పని చేస్తుంది. నగరంలో ఆయా మార్గాల్లో ట్రాఫిక్ రద్దీని బట్టి పోలీసులు ఒక్కో మోడ్ వినియోగిస్తుంటారు.అయితే ఫిక్స్ మోడ్‌లో భాగంగా వాహనాల రాకపోకలతో సంబంధం లేకుండా నిర్ణీత సమయం రెడ్, గ్రీన్ సిగ్నళ్లు ఉంటాయి. ఒక్కో సారి ఆ మార్గంలో వాహనాల రద్దీ లేకపోయినా.. ఆ మార్గంలో గ్రీన్ సిగ్నల్ ఉంటుంది. దీంతో ఇతర వైపులా ఉన్న వాహనదారులు తమకు గ్రీన్ స్నిగల్ పడే వరకు వేచి చూడాల్సి వస్తుంది. ఇక నుంచి అలా వేచి చూడాల్సిన పని లేదు. వాహనాల రాకపోకల ఆధారంగా సిగ్నళ్లు మారే వీఏసీ మోడ్ వినియోగంపై దృష్టి సారించాలని అధికారులు



నిర్ణయం తీసుకున్నారు. ఈ విధానంలో నిర్ణీత సమయం గ్రీన్ సిగ్నల్ పడుతుంది. ఆ మార్గంలో ఎలాంటి వెహికల్స్ రానిపక్షంలో ఆటోమేటిక్‌గా రెడ్ సిగ్నల్ పడుతుంది. ఆ వెంటనే మిగిలిన వైపు గ్రీన్ సిగ్నల్ పడుతుంది. దీంతో సిగ్నళ్ల వద్ద ఎక్కువ సేపు వేచి చూడకుండా వెళ్లిపోవచ్చు. ఈ విధానం ద్వారా జర్నీ సమయం తగ్గడంతోపాటు.. ప్రమాదాలకూ ఆస్కారం ఉండదని అధికారులు చెబుతున్నారు.అదే విధంగా రోడ్డుదాటే పాదచారుల కోసం నగరంలో పెలికాన్ సిగ్నళు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు.

# బెజవాడలో మైండ్ కంట్రోల్ టెక్నాలజీ...

తెలుగు ట్రాక్,విజయవాడ

మైండ్ కంట్రోల్ టెక్నాలజీ గురించి మీకు తెలుసా? చాలా తక్కువ మందికి తెలుసు.. కానీ అమెరికాలో దీని బాధితులు ఎక్కువమందే ఉన్నారట.. పూర్వకాలం చేతబడి విద్య అనేది ఉండేది.. తాము ఎవరినైతే టార్గెట్ చేసేవారో.. ఆ వ్యక్తి తాలూకు వెంట్రుకలను తీసుకొని పిండి బొమ్మను తాయారు చేసి అందులోకి పంపి చంపాలనుకున్న వ్యక్తిని ఆవాహన చేసుకొని ఆ బొమ్మను హింసిస్తూ ఉంటె ఆ మనిషి హింసకు గురిఅవుతాడు అనేది కొందరి నమ్మకం.. అయితే మైండ్ కంట్రోల్ టెక్నాలజీ చేసేది కూడా ఇలాంటిదే.. ఎవరినైతే కంట్రోల్ చేయాలనుకుంటున్నారో వారిని టెక్నాలజీ ద్వారా తీసుకొని వారు ఏం ఆలోచిస్తున్నారో ఈ టెక్నాలజీ ద్వారా తెలుసుకుంటున్నారట.మానవ మెదడును కంట్రోల్ చేసే టెక్నాలజీ పరిశోధనలతో ప్రమాదం పొంచి ఉంటుందని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఎన్నారై తరుణ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మానవుల ఆలోచనలను చదివి మానవ మెదడులను ప్రభావితం చేసే టెక్నాలజీనీ కొన్ని గుర్తు తెలియని సంస్థలు అభివృద్ధి చేసి మనుషులను గిన్ని పిగ్స్ వలె ఉపయోగించుకుంటున్నారని ఔఖీఎ రావి తరుణ్ ఆరోపించారు. అయితే.. వినటానికి కాస్త విచిత్రంగా ఉన్నా ఇది వాస్తవమని అన్నారు తరుణ్. మనుషుల ఆలోచనలను చదివటం దగ్గర నుంచి మానవుల ఆలోచనలను దారి మళ్ళించే విధంగా పరిశోధనలు చేస్తూ గిన్ని పిగ్స్ గా వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనలాగే వైజాగ్ లో ఓ వ్యక్తిని టార్గెట్ చేశారని దీంతో అతను ఆ భాదలు భరించలేక అమెరికా వదిలి వైజాగ్ వచ్చేశారని తెలిపారు. మూడు నెలల క్రితం హవానా సింధ్రోమ్ వివరాలు తెలపాలంటూ కర్ణాటక హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసిందని అన్నారు.ఉదాహరణకు ఏదైనా ప్యాంట్, షర్టు గురించి గూగుల్ లో వెతికితే వెంటనే దానికి సంబంధించిన వివరాలు మొత్తం మొబైల్లో ప్రత్యక్షమవుతాయని అంతేకాకుండా అనేక కంపెనీల నుంచి తమ ప్రోడక్ట్ కొనమంటూ మెసేజ్ లు వస్తాయని ఆ విషయాలు ఆయా కంపెనీలకు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. అంటే.. మన డీటెయిల్స్ ని మనం వెతికిన సంస్థ లేదా ఆ సాఫ్ట్‌వేర్ ఫలానా వ్యక్తి షర్టు, ప్యాంట్లు కావాలని అడుగుతున్నారని మిగిలిన కంపెనీలకు పంపిస్తాయని అన్నారు. అంటే మన వివరాలను అమ్మేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు తరుణ్.. ఈ టెక్నాలజీని అభివృద్ధి చేసిన సైంటిస్టులు బహిరంగంగా చేసిన పరిశోధనల పట్ల విచారణ వ్యక్తం చేస్తున్నారని




అన్నారు. 1953లో అమెరికా ఎంకే ఆల్ట్రా పేరుతో ఈ ప్రాజెక్ట్ కు శ్రీకారం చుట్టారని ఆ పరిశోధనల ఫలితమే ఈ న్యూరో వెపన్స్, ఎనర్జీ వెపన్స్ అని అన్నారు.ఈ వెపన్స్ మానవ మెదల్లను ప్రభావితం చేస్తాయని తద్వారా ఆలోచనలను తెలుసుకొనటమే కాకుండా మనిషిలో అనేక రకమైన బాధలను కలిగిస్తాయని, దీనినే హావానా సింద్రోం అంటారని చెప్తున్నారు.. హావాన సింద్రోం బారిన పడిన వారిలో అనేకమంది ప్రఖ్యాతి చెందిన సైంటిస్టులు డాక్టర్లు సాఫ్ట్వేర్ ఇంజనీర్లు ఉన్నారని వారిలో అమెరికాకు చెందిన ప్రముఖ రాజకీయవేత కమల్ హారిస్ ఉన్నారని, డాక్టర్ లెన్ బెర్, డాక్టర్ రాబర్ట్ డంకన్, డాక్టర్ కేథరీన్ హోర్టన్, డాక్టర్ జాన్ హాల్ ఉన్నరని అన్నారు. నిద్ర లేకపోవడం రిమోట్ థాట్ రీడింగ్ ప్రసారం, మసక దృష్టి, డ్రీమ్ మానిప్యులేషన్, మూడ్ మార్పు మైక్రోవేవ్ వాయిస్ టూ స్కల్ ? మెదడులోకి ఎలక్ట్రానిక్‌గా బేసి శబ్దాల ప్రొజెక్షన్ చేస్తారని వివరించారు.అంతేకాక.. మనుషులు మెదళ్లను కంట్రోల్ చేసి.. బ్యాంక్ పాస్ వర్డ్ రీడ్ చేయడం, మర్చిపోయాలా చేస్తారని అన్నారు. తక్షణమే ప్రభుత్వాలు కలుగజేసుకొని మానవ మెదడుపై పరిశోధనలకు అడ్డుకట్ట వేయాలని లేనిపక్షంలో భవిష్యత్తరాలకు తీరం నష్టమే జరగటమే కాకుండా కార్పొరేట్ శక్తులకు బానిసలుగా మారే అవకాశం ఉందని అన్నారు. కాబట్టి భారత ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన హవానా సింద్రోంపై దృష్టి సారించాలని సాఫ్ట్ వేర్ ఉద్యోగి తరుణ్ కోరుతున్నారు..

# మనిషికి పంది కిడ్నీ

## అవయవ మార్పిడి విధానంలో ముందడుగు..

## మనిషి శరీరంలో 2 నెలలు సక్రమంగా పనిచేసిన పంది కిడ్నీ




తెలుగు ట్రాక్,న్యూ ఢిల్లీ

మనిషి శరీరంలో ఏదైనా అవయవం పనిచేయకపోతే.. వేరే వ్యక్తుల అవయవాన్ని అమరుస్తుంటారు. కుటుంబ సభ్యులు, లేదా ఇతర వ్యక్తులు తమ అవయవాలను దానం చేస్తే వాటిని అవసరమైన రోగులకు అమరుస్తుంటారు. అయితే కొన్ని సందర్భాల్లో ఇది సాధ్యం కాకపోవచ్చు. ఎందుకంటే అన్ని సందర్భాల్లోనూ అవయవాలు దొరకవు. అదృష్టవశాత్తూ దొరికినా రోగి శరీరానికి సరిపోవు. ఈ క్రమంలోనే చాలా మంది జీవితం అర్ధంతరంగా ఆగిపోతుంటుంది. దీంతో అవయవాల కొరతకు పరిష్కారం కనుగొనేందుకు శాస్త్రవేత్తలు, వైద్యులు కొన్ని ఏళ్లుగా పరిశోధనలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవలే జన్యుమార్పిడి చేసిన పంది కిడ్నీ ని మానవ శరీరానికి అమర్చారు. అది ఇప్పుడు సత్ఫలితాన్నిచ్చింది.అమెరికా లో బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తికి పంది కిడ్నీ అమర్చగా అది ఎన్నడూ లేని విధంగా ఏకంగా రెండు నెలలపాటు సక్రమంగా పనిచేసింది. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తికి అమెరికా వైద్యులు జులై 14వ తేదీన జన్యుమార్పిడి చేసిన పందికిడ్నీని విజయవంతంగా అమర్చారు. నెల రోజులకుపైగా ఆ మూత్రపిండం మనిషి శరీరంలో ఎలాంటి ఇబ్బందీ లేకుండా పనిచేసింది. అయితే, ఆ తర్వాత కిడ్నీ ఉత్పత్తి చేసే మూత్ర పరిణామం తగ్గడంతో.. వైద్యులు రోగనిరోధన ఔషధాలతో దాన్ని తిరిగి సాధారణ స్థితికి తీసుకొచ్చారు. రెండు నెలల అనంతరం అంటే బుధవారం నాడు ఆ కిడ్నీని మనిషి శరీరం నుంచి తొలగించారు. మృతదేహాన్ని అంత్యక్రియల కోసం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ట్రాన్స్‌ప్లాంట్ చేసిన పంది మూత్రపిండం మనిషి శరీరంలో గతంలో కంటే ఎక్కువ రోజులు పనిచేయటం ఇదే మొదటిసారి. ఈ ప్రయోగంతో వైద్య చరిత్రలోనే అవయవ మార్పిడి విధానంలో పెద్ద ముందడుగు పడినట్లైంది.ఈ ప్రయోగం సత్ఫలితాలు ఇవ్వడంతో బతికున్న వ్యక్తులపై కూడా ఈ తరహా ప్రయోగాలు చేసేందుకు వైద్యులు సిద్ధమవుతున్నారు. గతేడాది మేరీల్యాండ్ యూనివర్సిటీకి చెందిన వైద్యులు.. చనిపోతున్న ఓ వ్యక్తికి పంది గుండెతో కాపాడే ప్రయత్నం చేశారు. అయితే, అతను రెండునెలలు మాత్రమే ప్రాణాలతో ఉన్నాడు. ఆ తర్వాత పంది గుండె విఫలం కావటంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు

# ఆవులకు సరోగసి...

తెలుగు ట్రాక్,ఒంగోలు

ఒంగోలు జాతి ఆవుల పునరుజ్జీవం, సంరక్షణ కోసం చేసిన ప్రయోగం విజయవంతం అయ్యింది. ఆధునిక పరిజ్ఞానం ద్వారా ఒంగోలు జాతి ఆవులను పునరుజ్జీవం కోసం పశు వైద్యులు ప్రయోగాత్మకంగా చేసిన ప్రక్రియ సక్సెస్‌ను అందుకుంది. బాపట్ల జిల్లా మార్టూరు మండలం బొల్లాపల్లిలో ఓపీయూ, ఐవీఎఫ్ ఈటీ టెక్నాలజీతో ఒంగోలు జాతి ఆవు గర్భంలో ప్రవేశపెట్టిన పిండం రూపుదాల్చగా.. మేలు జాతి ఒంగోలు కోడె దూడకు ఆవు జన్మనిచ్చింది.ప్రకాశం జిల్లా చదలవాడ పశుఉత్పత్తి క్షేత్రం పశు వైద్యులు డాక్టర్ సోమశేఖర్ భద్రపరిచిన ఒంగోలు జాతి ఆవు పిండాన్ని.. గతేడాది నవంబరు 21న బొల్లాపల్లిలో ఉన్న శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవస్థానం గోశాలలోని ఆవులోకి ప్రవేశపెట్టారు. ఆ ఆవును కోలలపూడి పశువైద్యురాలు మాధవీలత ఎంపిక చేశారు. 9 నెలల 20 రోజులు తర్వాత ఈ ఆవుకు మేలు జాతి ఒంగోలు కోడె దూడ జన్మించింది. చదలవాడ పశుఉత్పత్తి క్షేత్రం నుంచి పశు వైద్యులు బొల్లాపల్లి గ్రామం వచ్చి దూడను పరిశీలించారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో.. రాబోయే రోజుల్లో ఒంగోలు జాతి ఆవుల పునరుజ్జీవం కోసం మరికొన్ని ఆవులలో కూడా పిండం ప్రవేశపెట్టి ఇలాగే ప్రయోగం చేయాలని భావిస్తున్నారు.దేశంలో తొలిసారిగా సరోగసి పద్ధతిలో తిరుపతిలోని ఎస్వీ గోశాలలో ఒంగోలు ఆవుకు సాహివాల్ దూడ జన్మించిన సంగతి తెలిసిందే. టీటీడీ, ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయం సంయుక్తంగా దేశావాళీ గోజాతులను అభివృద్ధి చేయాలని ఆలోచన చేసింది. గతేడాది ఎంవోయు కుదుర్చుకుని మేలు రకమైన దేశవాళీ గో జాతిని అభివృద్ధి చేసే క్రమంలో ఎస్వీ గో సంరక్షణ శాలలోని మేలు జాతి ఆవుల నుండి అండం సేకరించి.. ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయంలోని ఐవిఎఫ్ ల్యాబ్ లో కృత్రిమంగా పిండాలను అభివృద్ధి చేశారు . వీటిని టీటీడీ గోశాలలోని ఆవులలో ప్రవేశపెట్టి దేశంలోనే తొలిసారిగా విజయం సాధించారు. ఒంగోలు ఆవుకు జన్మించిన సాహివాల్ దూడకు పద్మావతి అని నామకరణం చేశారు.తిరుమల శ్రీవారి ఆలయంలో ధూప దీప నైవేద్యాలకు, నిత్య కైంకర్యాలకు అవసరమయ్యే పాలు, పెరుగు, వెన్న, నెయ్యిని దేశవాళీ ఆవుపాల నుండి ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ఇప్పటికే 200 దేశీయ గోవులను దాతలు సమకూర్చారు.. మరో 300 గోవులను సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆవుల ఆరోగ్య పరంగా, అధిక పాల దిగుబడి దిశగా నాణ్యత కలిగిన దాణా తయారీ చేసుకోవడానికి ఇటీవలే గోశాలలో ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ ప్రారంభించారు. గోశాలలో రోజుకు సుమారు 3 వేల నుండి 4 వేల లీటర్ల ఆవు పాలను ఉత్పత్తి చేయనున్నారను. రోజుకు 60 కేజీల స్వచ్ఛమైన నెయ్యిని సాంప్రదాయ పద్ధతిలో తయారు చేసి స్వామి వారి నిత్య కైంకర్యం, నైవేద్యాలకు వాడేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రైతులకు టీటీడీ ఉచితంగా గోవులను అందిస్తోంది. రానున్న ఐదేళ్లలో 324 మేలు రకమైన సాహివాల్ గోజాతి దూడలను ఉత్పత్తి చేయాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా పిండ మార్పిడి చేయబడిన ఆవులలో ఇప్పటి వరకు 11 గోవులు గర్భం దాల్చాయి. రానున్న రోజుల్లో ఇంకొన్ని సాహివాల్ దూడలు జన్మించనున్నాయి. లింగ నిర్ధారిత వీర్యాన్ని ఎస్వీ గోశాలలో ఉన్న సాహివాల్, గిర్ గోవులలో కృత్రిమ గర్భధారణ ద్వారా ప్రవేశపెట్టనున్నారు. దీనివల్ల సరోగసి చెందే ఆవు లక్షణాలు దూడకు రావంటున్నారు. ఈ కార్యక్రమం ద్వారా మేలు రకమైన దేశీయ జాతి గోవులను రైతులకు సబ్సిడీపై అందించవచ్చని భావిస్తున్నారు.

# ఇస్రో... సముద్రయాన్...

తెలుగు ట్రాక్,నెల్లూరు

చంద్రయాన్-3 ప్రాజెక్టు విజయవంతం కావడంతో ప్రపంచదేశాలన్ని భారత్‌ను ప్రశంసించిన సంగతి తెలిసిందే. ఇటీవల సూర్యుని రహస్యాలు తెలుసుకునేందుకు ఆదిత్య ఎల్1 ను కూడా విజయవంతంగా ప్రయోగించింది. అయితే ఇప్పుడు భారత్ మరో సరికొత్త ప్రాజెక్టుకు సిద్ధమవుతోంది. అదే సముద్రయాన్. ఈ నేపథ్యంలోనే ప్రాజెక్టులో కీలకమనటువంటి జలాంతర్గామి మత్స్య-6000 తుది మెరుగులు దిద్దుకుంటోంది. ఇందుకు సంబంధించిన ఆ సబ్ మెరైన్ ఫోటోలు, వీడియోలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అలాగే సముద్ర గర్భ అన్వేషణలో భాగంగా తోడ్పడే మానవ సహిత జలాంతర్గామి ఇదేనని పేర్కొన్నారు. అయితే ఈ నౌకను చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ అభివృద్ధి చేసింది. ఇక ఈ ప్రాజెక్టు మొదలైనట్లైతే భారతదేశంలో మొట్టమొదటి మానవ సహిత సముద్ర అన్వేషణ మిషన్‌గా దీనికి గుర్తింపు దక్కుతుంది.సముద్రంలోకి వెళ్లే ఆక్వానాట్‌లను ఆరు వేల మీటర్ల లోతు వరకు తీసుకువెళ్లడానికి ఓ గోళాకార నౌకను నిర్మించనున్నారు. ముందుగా ఇది 500 మీటర్ల లోతుకు మాత్రమే వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ మిషన్ కారణంగా సముద్ర గర్భంలోని పర్యావరణానికి ఎటువంటి నష్టం కలగలేదని కేంద్రమంత్రి పేర్కొన్నారు. ఇక తదుపరి ప్రయాణం సముద్రయాన్. ఇది చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీలో అభివృద్ధి అవుతున్న మత్స్య-6000 జలాంతర్గామి. ఇండియా చేపడుతున్నటువంటి తొలి మానవ సహిత డీప్ ఓషన్ సముదద్రయాన్‌లో భాగంగా దీన్ని తయారుచేస్తున్నారు. అయితే జలాంతర్గామిలో ముగ్గురు కూర్చోని.. సుమారు 6 కిలోమీటర్ల సముద్రపు లోతుకు చేరుకోవచ్చు. దీనివల్ల సముద్ర వనరులు, జీవ వైవిధ్యాన్ని సైతం అధ్యయనం చేయవచ్చు. అయితే ఈ వ్యవస్థ సముద్ర పర్యావరణానికి ఎటువంటి ముప్పు కలగించదని మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.ఇదిలా ఉండగా మరోవైపు.. బ్లూ ఎకనామిని ప్రోత్సహించడంలో భాగంగా భారత్ ఈ డీప్ ఓషన్ మిషన్ ప్రయోగాన్ని చేపట్టింది. అయితే ఈ సముద్ర గర్భంలో ఇప్పటికే అపారమైన ఖనిజ నిల్వలు ఉన్నాయి. మరో విషయం ఏంటంటే అరుదైన జీవజాలం ఇక్కడ నివాసం ఉంటోంది. వాటిని మనం సమర్థవంతంగా వినియోగించుకున్నట్లైతే.. ఆర్థికాభివృద్ధి, నూతన ఉద్యోగాలు సృష్టించేందుకు సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇక జలాంతర్గామిలో కూర్చొని పరిశీలనించనటువంటి కిరణ్ రిజిజు దాని విశేషాల గురించి అక్కడి నిపుణులు వివరించారు. మరో విషయం ఏంటంటే 2026వ సంవత్సరం నాటికి ఈ మిషన్ కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. ఈ విషయాన్ని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ గతంలోనే లోక్‌సభలో వెల్లడించారు. ఇక ప్రయోగం విజయవంతమైతే భారత్ మరో చరిత్ర సృష్టించనుంది.

# సోషల్ మీడియా స్టార్లకు గాలం



ఎన్నికల ప్రచారంలో కొత్త పోకడ మొదలైంది. ప్రత్యర్థులను డామినేట్ చేసేందుకు సోషల్ మీడియాను ప్రచార అస్త్రంగా మలుచుకుంటున్నారు నాయకులు. నిత్యం ప్రజలతో మమేకం అయ్యేందుకు సోషల్ ఫ్లాట్ ఫామ్స్ వేదికగా కొత్త ప్యాకేజీలకు తెరలేపారు. ఖర్చు తక్కువ, ప్రచారం ఎక్కువ కావడంతో సోషల్ మీడియాలో హల్చల్ చేసేందుకు నేతలు రెడీ అయ్యారు. ప్రతి ఒక్కరి చేతుల్లో ప్రజంట్ సెల్‌ఫోన్ కామన్ అయిపోయింది. లేచింది మొదలు పడుకునే వరకు ఫోన్ చూసే వారు లక్షల్లో ఉండడంతో ప్రచారానికి ఇది కరెక్ట్ వే అనుకుంటున్నారు నేతలు. చేసిన పనిని.. చేయబోయే పనులను.. తమ ప్రచార కార్యక్రమాల్ని పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల పాటల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యచరణ సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకోసం సోషల్ మీడియా సెలబ్రిటీలను తమ ప్రచార క్యాంపెనర్లుగా వినియోగించుకుంటున్నారు.ఎన్నికల ప్రచారంలో ప్రజల వద్దకు వెళ్లే విధానాలను వారితో మరింత చర్చించి ముందుకు వెళ్లాలనుకుంటున్నారు. ప్రచార అవసరానికి తమ ప్రధాన ఆయుధం సోషల్ మీడియా అని చాలామంది లీడర్స్ నమ్ముతున్నారు. అందరి వ్యూ ఒకటే అయినా తమదైన శైలిలో ప్రజల్లో ఉండేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఎన్నికలకు సోషల్ మీడియా టీంను రెడీ చేసుకుంటున్నారు. ఇందుకోసం ప్రతిభ ఉన్న, అనుభవజ్ఞులైన వారిని ఎంచుకునే పనిలో పడ్డారు. స్క్రిప్ట్ మొదలు ప్రచార శైలి భిన్నంగా ఉండాలనుకుంటున్నారు. ఎన్నికల ప్రచారంలో అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునేందుకు తమ ప్రచార మార్పును రెడీ చేసుకుంటున్నారు. అందుకోసం సోషల్ మీడియాకు ప్రత్యేక నిధులను కేటాయిస్తున్నారు. జనంలోకి వెళ్లేందుకు దగ్గరి మార్గం సులువైన మార్గం సోషల్ మీడియానే అన్నది ఇప్పుడు చాలామంది ఒపెనియన్. దీంతో పలువురు యూట్యూబ్ స్టార్స్, స్క్రిప్ట్ రైటర్లకు డిమాండ్ పెరిగింది. వారంతా ఇప్పుడు భారీ మొత్తంలో ప్యాకేజీ డిమాండ్ చేస్తున్నట్లు టాక్ నడుస్తుంది.ముఖ్యంగా మిలియన్లలో రీచ్, లక్షల్లో సబ్‌స్క్రైబర్స్ ఉన్న సోషల్ మీడియా స్టార్లకు గాలం వేస్తున్నారు నేతలు. మరి ఈ సోషల్ ప్రచారం లీడర్లకు ఎంతమేర సాయపడుతుందో చూడాలి.

# వచ్చేస్తున్న యూపీఐ ఏటీఎం

తెలుగు ట్రాక్,ముంబై

డిజిటల్ చెల్లింపు లావాదేవీల విధానాన్ని పూర్తిగా మార్చేసింది. ఎవరైనా షాపింగ్‌కి వెళ్లాలన్నా, మార్కెట్ నుంచి కూరగాయలు కొనాలన్నా జేబులో పర్స్ లేకపోయినా ఫోన్ ఉంటే సరిపోతుంది. మీ చేతిలోని ఫోన్ సహాయంతో యూపీఐ చెల్లింపు చేయడం ద్వారా క్రయవిక్రయాలు సులభతరం అయ్యింది. అందుకు ఏటీఎమ్ కార్డు కూడా వినియోగించాల్సిన అవసరం లేదు. అయితే ఇన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ కొన్ని సార్లు జేబులో సరిపడా డబ్బులేక ఇబ్బందులు పడుతున్నాం. అలాంటి పరిస్థితుల్లో ఇతరులకు యూపీఐ పేమెంట్ చేసి డబ్బు తీసుకుంటుంటారు. లేదంటే ఏటీఎమ్‌కి వెళ్లి డబ్బు డ్రా చేసుకుంటారు.యూపీఐ లేదా ఆన్‌లైన్ చెల్లింపులు అందుబాటులో లేని సందర్భాల్లో కొంత ఇబ్బంది తలెత్తుతుంది. ముఖ్యంగా టూరిస్ట్ స్పాట్‌ల వద్ద ఇలాంటి సమస్యలు చాలాసార్లు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పుడు ఈ సమస్యలను ఎదుర్కోవటానికి సులభమైన మార్గం మార్కెట్లోకి వచ్చింది.తాజాగా యూపీఐ ఏటీఎం అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే. దీని సహాయంతో మీరు కార్డు లేకుండా కూడా నగదు తీసుకోవచ్చు. ఐతే దీనిని ఎలా ఉపయోగించాలో చాలా మందికి తెలియదు. ఈ విధానానికి కూడా మీ దగ్గర ఏటీఎం ఉండాల్సిన అవసరం లేదు. ఫోన్ ఉంటే సరిపోతుంది.

# హైదరాబాద్ రోడ్లపై విద్యుత్ బస్సులు

తెలంగాణ ఆర్టీసీ అదిరిపోయే న్యూస్ చెప్పింది. బస్సుల్లో నగదు రహిత ప్రయాణం చేసే వెసులుబాటు కల్పిస్తోంది. ముఖ్యంగా డిజిటల్ చెల్లింపులు చేసే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ సహా ఆపైస్థాయి బస్సులు అన్నింట్లో ఐ-టిమ్స్ పరికరాలను అందుబాటులోకి తెస్తున్నారు. డెబిట్, క్రెడిట్ కార్డులతో పాటు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి వాటితో చెల్లింపులు చేయొచ్చని చెబుతోంది. ఈమేరకు బండ్లగూడ బస్ డిపోను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. డిపోలోని ఆర్డినరీ, మెట్రో సహా మొత్తం 145 బస్సుల్లో ఐ-టిమ్స్ ను వాడేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అనంతరం కంటోన్మెంట్ డిపోలో అమలు చేశాక రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 8,300 బస్సుల్లో దశలవారీగా ప్రవేశ పెట్టేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో టికెట్ తీసుకునేటప్పుడు చిల్లర సమస్యతో కండక్టర్లు, ప్రయాణికుల అనేక సమస్యలు వస్తుంటాయి. చిల్లర ఇవ్వమని కండక్టర్, లేవని ప్రయాణికులు గొడవలు పడిన సంఘటనలు కోకొల్లలు. అయితే ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టడానికి యాజమాన్య బట్ టికెట్లను రౌండ్ ఫిగర్లుగా మార్చింది. రూ.10, 15, 20, 25.. ఇలా రౌండ్ ఫిగర్ చేసేసింది. అయినప్పటికీ సమస్యలకు చెక్ పడలేదు. దీంతో దూర ప్రాంత, అధిక ఛార్జీలు ఉండే 700 బస్సుల్లో (సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లో) ఐ-టిమ్స్ ను ప్రవేశ పెట్టారు. మిగిలిన 8 వేల 300 బస్సుల్లో సాధారణ టిమ్స్ మాత్రమే ఉన్నాయి. కానీ ఇప్పుడు వీటిల్లో కూడా నగదు రహిత ప్రయాణాన్ని అందుబాటులోకి తెచ్చి.. ఇటు ఉద్యోగులతో పాటు ప్రయాణికుల సమస్యలను తీర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తెలంగాణలో ఆర్టీసీబస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు గుడ్ న్యూస్ చెప్పింది. బస్సుల్లో ఫ్రీ వైఫై సదుపాయం కల్పిస్తున్నట్టు ప్రకటించింది. ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చినట్టు ఆర్టీసీఎండీ సజ్జనార్ ట్వీట్ చేశారు. గ్రేటర్ జోన్ పరిధిలో వచ్చే నెల నుంచి విద్యుత్ బస్సులను నడిపాలని తెలంగాణ ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. కొత్తగా వచ్చే విద్యుత్ బస్సులను నగరంలో ఏయే మార్గాల్లో నడపాలనే దానిపై ఆర్టీసీ అధికారులు ఆన్ లైన్ సర్వే చేస్తున్నారు. ముఖ్యంగా ఏ మార్గంలో విద్యుత్ బస్సులు నడిపితే ఆక్యుపెన్సీ పెరుగుతుంది, పాత మార్గాల్లోనే వీటిని నడపాలా లేదా కొత్త మార్గాలను ఎంపిక చేయాలా అని ఆలోచిస్తుంది. అంతేకాకుండా మెట్రో రైళ్లు ఉన్న మార్గాల్లో నడిపితే లాభం ఉంటుందా అనే దానిపై ప్రజల స్పందన కోరుతున్నారు.



ఇందుకోసమే ఆన్ లైన్ లో సర్వే నిర్వహించి.. ఆపై నిర్ణయం తీసుకోనున్నారు. ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న నిర్ణయంతో వచ్చే ఆరు నుంచి ఏడాదిలోగా దాదాపు వెయ్యికి పైగా విద్యుత్ బస్సులను నడిపించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఒలెక్ట్రా కంపెనీతో కూడా ఆర్టీసీ యాజమాన్యం ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే అందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. నగరంలో నడిపించే విద్యుత్ బస్సులు నాన్ ఏసీగా ఉంటాయి. అందుకు సంబంధించిన నమూనా బస్సును ఇప్పటికే ఒలెక్ట్రా విడుదల చేసింది. అన్ని సక్రమంగా ఉంటే నగరంలో తొలి విడతగా 28 బస్సులను తీసుకురానున్నారు. నగరంలో వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు నగర ప్రజలకు ప్రాణవాయువు పెంచాలన్న లక్ష్యంతోనే ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులను తీసుకు వస్తోంది. అయితే ప్రస్తుతం నగరంలో తిరుగుతున్న కాలం చెల్లిన బస్సులను స్క్రాప్ కు పంపించి.. వాటి స్థానంలో విద్యుత్ బస్సులను ఏర్పాటు చేస్తోంది.




# బీజేపీ స్టాండ్ ఏంటీ...

తెలుగు ట్రాక్,విజయవాడ

చంద్రబాబు అరెస్ట్ అయ్యారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్నారు. నాలుగు రోజుల నుంచి హై డ్రామా నడుస్తూనే ఉంది. అరెస్ట్, అనంతర పరిణామాలపై ఏపీ విపక్షాలు స్పందిస్తున్నాయి. జనసేన, లెఫ్ట్ పార్టీలు చంద్రబాబు అరెస్ట్‌ని ఖండించాయి. కానీ? రాష్ట్ర బీజేపీ నేతలు మాత్రం సైలెంట్‌గా ఉన్నారు. ఇప్పుడు దీని మీదే ఆసక్తికర చర్చ జరుగుతోంది. నంద్యాలలో చంద్రబాబును అరెస్ట్ చేసిన వెంటనే?. పార్టీ స్టాండ్ తీసుకున్నాకే స్పందించాలని, అప్పటి వరకు ఏం మాట్లాడవద్దని శ్రేణులకు వాట్సాప్ గ్రూపులో సందేశాలు పంపారు అధ్యక్షురాలు పురంధేశ్వరి. తర్వాత కాసేపటికే? అరెస్ట్ చేసిన విధానం సరైంది కాదంటూ రియాక్ట్ అయ్యారామె. కానీ? దానికి కొనసాగింపు మాత్రం లేదు. పురంధేశ్వరి వైపు నుంచి ఆ ఒక్క ప్రకటన తప్ప వేరే ఏ రియాక్షన్ లేదు. రిమాండ్‌కు పంపినా.. పురంధేశ్వరే కాదు..ఏపీ బీజేపీ నుంచి ఒక్కరు కూడా స్పందించలేదు. ఒకే ఒక్క స్టేట్‌మెంట్ ఇచ్చి పురంధేశ్వరి సైతం సైలెంట్ మోడ్‌లోకి వెళ్లడం వెనక ఏం జరిగి ఉంటుందన్న చర్చ మొదలైంది. పార్టీ అధిష్టానమే ఆమెను తగ్గమందా? లేక మరే కారణం ఏదైనా ఉందా అన్న ప్రశ్నలు వస్తున్నాయి. . ఈ పరిస్థితుల్లో టీడీపీ-బీజేపీ మధ్య కూడా గ్యాప్ నెమ్మదిగా తగ్గుతోందని అందరూ అనుకున్నారు. దీనికి తగ్గట్టే చంద్రబాబును అరెస్ట్ చేసిన విధానాన్ని కూడా తప్పు పట్టారు పురంధేశ్వరి. కానీ చంద్రబాబును రిమాండ్‌కు పంపిన దగ్గర్నుంచి కనీసం మాట్లాడలేదు. పురంధేశ్వరే కాదు.. ఏపీ బీజేపీ నేతలెవ్వరూ మాట్లాడలేదు. ఓ వైపు తెలంగాణ బీజేపీ నేతలు ఒక్కొక్కరు మాట్లాడుతూనే ఉన్నారు. కానీ ఆంధ్రలో జరుగుతున్న పరిణామాలపై ఇక్కడి నేతలు మాట్లాడకపోవడం ఏంటన్న ప్రశ్నకు సమాధానం వెదుకుతున్నారు పొలిటికల్ పండిట్స్. ఇప్పటికే చంద్రబాబుకు వంతపాడుతూ.. ఆయనకు సహకరించేందుకు పురంధేశ్వరి శక్తి వంచన లేకుండా పని చేస్తున్నారని వైసీపీ నేతలు పెద్ద ఎత్తున విమర్శలు చేశారు. ఈ క్రమంలో తనపై మరింతగా టీడీపీ ముద్ర పడకూడదనే భావనతో ముందు జాగ్రత్తగానే ఆమె కామ్‌గా ఉన్నారనేది ప్రస్తుతం పార్టీ వర్గాల్లో జరుగుతున్న చర్చ. ఇదే సందర్భంలో మరో చర్చా ఉంది. అయితే పార్టీ తెలంగాణ నేతలకు లేని ఆదేశాలు ఏపీ లీడర్స్‌కు మాత్రమే ఎలా ఉంటాయన్న ప్రశ్నకు మాత్రం సమాధానం లేదు. మొత్తం మీద చంద్రబాబు ఎపిసోడ్‌లో బీజేపీ మౌనంపై రాజకీయవర్గాల్లో పెద్ద చర్చే జరుగుతోంది.

# టీటీడీపీకి దారేది...

తెలుగు ట్రాక్,హైదరాబాద్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక వెలుగు వెలిగి, పాతికేళ్ల పాటు రాష్ట్రాన్ని ఏలిన తెలుగుదేశం పార్టీ (టీడీపీ)కి ఉమ్మడి నల్లగొండ జిల్లా వెన్నుదన్నుగా నిలబడింది. జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 7 నియోజకవర్గాల్లో సుదీర్ఘ కాలం ప్రాతినిధ్యం వహించింది. తెలంగాణ టీడీపీ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో రెండు కళ్ల సిద్ధాంతంతో బొక్కాబోర్లా పడింది. ఇపుడు ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆ పార్టీ ఉనికి కూడా లేకుండా పోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక వెలుగు వెలిగి, పాతికేళ్ల పాటు రాష్ట్రాన్ని ఏలిన తెలుగుదేశం పార్టీ (టీడీపీ)కి ఉమ్మడి నల్లగొండ జిల్లా వెన్నుదన్నుగా నిలబడింది. జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 7 నియోజకవర్గాల్లో సుదీర్ఘ కాలం ప్రాతినిధ్యం వహించింది.ఈ ఏడాది చివరలో జరగనున్న తెలంగాణ శాసన సభ ఎన్నికల్లో కనీసం ఒక్క స్థానం నుంచైనా పోటీ చేయడం అనుమానంగానే ఉంది. జిల్లా నుంచి టీడీపీ పక్షాన వివిధ పదవులు అనుభవించిన నాయకులంతా ప్రస్తుతం బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీల్లో ఉన్నారు. ప్రస్తుతం ఆ పార్టీకి జిల్లాలో పెద్ద దిక్కు లేకుండా పోయింది.ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో.. నాగార్జున సాగర్, కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి, ఆలేరు, భువనగిరి, నల్లగొండ అసెంబ్లీ స్థానాల్లో ఆ పార్టీ నేతలు సుదీర్ఘ కాలమే ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా పనిచేశారు. భువనగిరి నుంచి ఎలిమినేటి మాధవరెడ్డి, ఆయన మరణానంతరం ఆయన భార్య ఉమా మాధవరెడ్డి, ఆలేరు నుంచి మోత్కుపల్లి నర్సింహులు ఎన్.టి.రామారావు, చంద్రబాబు నాయుడు కేబినెట్లలో మంత్రులుగా వ్యవహరించారు.నాగార్జున సాగర్ కుందూరు జానారెడ్డి రామారావు మంత్రివర్గంలో సభ్యుడు. తుంగతుర్తిలో సంకినేని వెంకటేశ్వరరావు, ఎస్సీ రిజర్వుడుగా మారిన తర్వాత మోత్కుపల్లి నర్సింహులు ఎమ్మెల్యేలుగా గెలిచారు. నల్లగొండ నుంచి రఘుమారెడ్డి, గడ్డం రుద్రమ దేవి ఎమ్మెల్యేలుగా కాగా, అప్పటి సీఎం ఎన్.టి.రామారావు సైతం నల్లగొండ నుంచి విజయం సాధించారు.సూర్యాపేట నుంచి ఆకారపు సుదర్శన్, కోదాడ నుంచి అయిదు పర్యాయాలు వేనేపల్లి చందర్ రావు, నాగార్జున సాగర్ లోజానారెడ్డి తర్వాత రామ్మూర్తి యాదవ్ లు టీడీపీ ఎమ్మెల్యేలుగా వెలిగారు. ప్రస్తుత తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి 1999 లో టీడీపీ నుంచి ఎంపీగా కూడా గెలిచారు. ఇపుడు బీఆర్ఎస్ నుంచి రాజ్యసభ సభ్యునిగా ఉన్న బడుగుల లింగయ్య యాదవ్ జిల్లా టీడీపీ అధ్యక్షునిగా అత్యధిక కాలం పనిచేశారు. టీడీపీతో పొత్తుతో సీపీఎం తుంగతుర్తి, నకిరేకల్, మిర్యాలగూడెం లో, సీపీఐ మునుగోడు, దేవరకొండ స్థానాల్లో ప్రాతినిధ్యం వహించింది. ఇపుడు ఇదంతా గత చరిత్ర.తెలంగాణ ఆవిర్భావం తర్వాత తుంగతుర్తి, నకిరేకల్, నాగార్జున సాగర్ వంటి స్థానాల్లో పోటీ చేసినా.. ఆ తర్వాత జిల్లాలో టీడీపీ ఉనికి కూడా కష్టంగానే కనిపిస్తోంది. ఆ పార్టీ యంత్రాంగమంతా ప్రస్తుతం వివిధ పార్టీల్లో సర్దుకుంది. ఉన్న నాయకులే టీడీపీని వీడి వెళ్లిపోయిన కారణంగా కొత్తగా వచ్చి పార్టీలో చేరే వారు లేకుండా పోయారు.రాష్ట్ర అధ్యక్షునిగా కాసాని బాధ్యతలు చేపట్టాక కూడా నల్లగొండ జిల్లాలో ఎలాంటి కార్యక్రమాలు జరగలేదు. దీంతో ఉన్న కొద్దిపాటి కేడర్ లో కూడా ఉత్సాహం లేకుండా పోయింది. భారీ పెట్టుబడులతో ఎన్నికల్లో పోటీ చేసేందుకు సాహసించే నాయకుడు లేకుండా పోయారు. చివరకు జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయాన్ని రోజూ తెరిచే నాథుడే లేకుండా పోయాడు

# ప్రజల్లోకి భువనేశ్వరి, బ్రాహ్మణి !

తెలుగు ట్రాక్,విజయవాడ



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలు ఊహించనంతగా మారిపోతున్నాయి. సాధారణంగా ప్రతిపక్ష నేతల అరెస్టులు, వారిపై కక్ష సాధిస్తున్నారని ప్రజలు అనుకునే వ్యవహారాలను ఎన్నికలకు ఏడాది ముందు ప్రభుత్వాలు చేయవు. తప్పని సరిగా అరెస్టులు లాంటివి చేయాల్సి వచ్చినా .. వారిపై ఉన్న అభియోగాలు, ఆధారాలు అన్నింటినీ ప్రజల్లోకి పెట్టి వీలైనంతగా చర్చ పెట్టి అప్పుడు అరెస్ట్ చేస్తారు. వేధిస్తున్నట్లుగా అరెస్ట్ చేస్తే మొదటికే మోసం వస్తుంది. ఇలాంటి పరిస్థితులు తమకు ఎదురైతే ఎలా ఎదుర్కోవాలో రాజకీయ పార్టీలకు ఓ పక్కా ప్రణాళిక ఉంటుంది. ఇప్పుడు టీడీపీ.. తమకు అలాంటి అవకాశం వచ్చినట్లుగా నిర్ణయానికి వచ్చామని ఇక ఉపయోగించుకోవాలని రంగంలోకి దిగాలని నిర్ణయించుకున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ప్రజల్లోకి నారా భువనేశ్వరి, బ్రాహ్మణిలు వెళ్లే అవకాశాలు ఉన్నాయని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రం కోసం, ప్రజల కోసం కష్టపడుతున్న చంద్రబాబు, లోకేష్‌లపై వేధింపులకు పాల్పడుతున్నారని.. తప్పుడు కేసులో వేధిస్తున్నారని న్యాయం మీరే చెప్పాలని వారు ప్రజల వద్దకు వెళ్లే ఆలోచన చేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఈ అంశంపై తెలుగుదేశం పార్టీ పెద్దల్లో ఇప్పటికే ఓ కార్యాచరణ సిద్ధమయిందని చెబుతున్నారు. నారా లోకేష్ పైనా సీఐడీ చీఫ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయనను కూడా అరెస్ట్ చేస్తామని పరోక్షంగా చెప్పారు. ఒక వేళ అదే జరిగితే పాదయాత్ర ఆపేయాల్సి ఉంటుంది. అందుకే.. వెంటనే.. విరుగుడుగా.. భువనేశ్వరి, బ్రాహ్మణిలు తెలుగుదేశం పార్టీ తరపున రంగంలోకి దిగుతారని.. లోకేష్ ఆపేసిన దగ్గర్నుంచి పాదయాత్ర చేయడమో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించడమో చేస్తారన్న వాదన వినిపిస్తోంది. రాజకీయాల్లో పండిపోయిన అందరికీ .. సానుభూతి ని మించిన అస్త్రం ఉండదని తెలిసి. వైఎస్ చనిపోయిన తర్వాత వచ్చిన సానుభూతి వెల్లువలో వైఎస్ జగన్ తడిచి ముద్దయ్యారు. ఉపఎన్నికల్లో భారీ విజయాలు సాధించారు. గత ఎన్నికల్లోనూ ఆయన ఒక్క చాన్స్ అని వేడుకున్నారని ఆ సానుభూతే కనిపించింది కానీ టీడీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత లేదన్న కొన్ని విశ్లేషణలు ఉన్నాయి. అదే ప్రభుత్వంపై వ్యతిరేకత ఉండి.. ఇక ప్రతిపక్ష నేతలపై వేధింపులు అంటూ వారి కుటుంబసభ్యులు రోడ్డెక్కితే.. వచ్చే సానుభూతి వెల్లువ ఊహించడం కష్టమనే అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే జగన్ మోహన్ రెడ్డి తన కోసం పని చేసిన , పాదయాత్రలు.. ప్రచారాలు చేసిన తల్లి విజయలక్ష్మి, సోదరి షర్మిలను దూరం చేసుకున్నారు. అది కూడా చర్చకు పెట్టే అంశాలపై టీడీపీ దృష్టి పెట్టే అవకాశం ఉంది.రాజకీయ అధికారం ఎవరికైనా ప్రజలు ఇచ్చేదే. రాజ్యాంగం ద్వారా వచ్చేదే. ఆ అధికారాన్ని దుర్వినియోగంచ చేస్తున్నారని అనిపిస్తే.. ప్రజలు మరోసారి అధికారం అప్పగించడానికి సంశయిస్తారు. వేధింపులకు గురైన వారికి బాసటగా నిలుస్తారు. అనాదిగా వస్తున్న రాజకీయం అది. అయితే కక్ష సాధింపు రాజకీయాలు ఎప్పుడూ ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నికల ఎజెండా కాలేదు. తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ఉండేది. ఇప్పుడు ఏపీలో ఆ తరహా రాజకీయాలు వచ్చాయి. అందుకే ఏపీ రాజకీయాల్లో రానున్న రోజుల్లో కీలక మార్పులు ఖాయమన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

### 19కి బెయిల్ పిటీషన్ వాయిదా

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టై రాజమండ్రి జైల్లో ఉన్న చంద్రబాబు రెండు పిటిషన్లు వేశారు. బెయిల్, మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోర్టులో అభ్యర్థన పెట్టుకున్నారు. ఈ రెండు పిటిషన్లను విచారణకు స్వీకరించిన ఏసీబీ కోర్టు.. వాదనలను 19వ తేదీకి వాయిదా వేసింది. కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఆదేశించింది. ఈ పిటిషన్ విచారణకు స్వీకరించిన టైంలో చంద్రబాబు హైకోర్టులో క్వాష్ పిటిషన్ అంశాన్ని న్యాయమూర్తి ప్రస్తావించారు. ఇప్పుడు మధ్యంతర బెయిల్ వస్తే క్వాష్ పిటిషన్‌పై ప్రభావం పడుతుందని అభిప్రాయపడ్డారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తనపై ఎలాంటి ఆరోపణలు లేకపోయినా కేసు నమోదు చేసి జైల్లో పెట్టారని బెయిల్ ఇవ్వాలని చంద్రబాబు పిటిషన్ వేశారు.

# మూడు జిల్లాల్లో బంగారు గనులు



తెలుగు ట్రాక్,తిరుపతి

ఏపీలో బంగారం, దాని అనుబంధ ఖనిజాల తవ్వకాల కోసం గనులు కేటాయించాలని ఎన్ఎండీసీ దరఖాస్తు చేసుకుంది. నెల్లూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఈ గనులు ఉన్నాయని గుర్తించారట.. అక్కడ గనుల బ్లాకుల్ని కేటాయించాలని కోరినట్లు తమ వార్షిక నివేదికలో తెలిపింది.కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని పెరవలి, బేతపల్లితో పాటుగా చిత్తూరు జిల్లా రాజగొల్లపల్లి, నెల్లూరు జిల్లా కోనేటిరాజుపాలెం గనుల బ్లాకులను కేటాయించాలని కోరారట. ఏపీలోని గనుల్లో బంగారంతో పాటుగా అనుబంధ ఖనిజాలను తవ్వుకునే అవకాశం కల్పించాలని కూడా కోరారట.గనులకు సంబంధించి ఎన్ఎండీసీ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. ఇప్పటికే మధ్యప్రదేశ్, కర్ణాటలో బంగారం, వజ్రాల గనుల్ని నిర్వహిస్తోంది.. తాజాగా ఏపీలో కూడా బంగారం గనులు తవ్వేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఎన్ఎండీసీ చిత్తూరు జిల్లాలో ఇప్పటికే బంగారం గనిని నిర్వహించేందుకు ఈ వేలంలో కూడా పాల్గొంది. చిగరగుంట-బైసంతానం బంగారం గనిని నిర్వహించేందుకు ప్రిఫర్డ్ బిడ్డర్‌గా రంగంలోకి దిగింది. ఇప్పటికే రెండు దఫాలుగా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.2.48 కోట్లు చెల్లించింది. అలాగే రూ.12.39 కోట్లకు బ్యాంక్ గ్యారెంటీలను సమర్పించింది.చిత్తూరు జిల్లా చిగరకుంట- బైసంతానం గనిలో త్వరలోనే తవ్వకాలు ప్రారంభించాలని భావిస్తున్నారట. ఇప్పుడు నెల్లూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో కొత్త గనులను దక్కించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారట. మరోవైపు ఎన్ఎండీసీ బంగారు గనుల తవ్వకాల కోసం దాదాపు రూ.500 కోట్లు పెట్టుబడి పెట్టాలని భావిస్తోందట. ఇప్పటికే చిత్తూరు జిల్లా చిగరకుంట- బైసంతానం గనిలో తవ్వకాలకు సిద్ధమవుతోందట.అంతేకాదు ఇనుప ఖనిజం ఉత్పత్తి, రవాణాను అధిక మొత్తంలో నిర్వహించేందుకు వీలుగా రవాణా, పంపిణీ సదుపాయాలను ఎన్ఎండీసీ లిమిటెడ్ విస్తరిస్తోంది. అందుకే బైలదిలా- నాగర్నార్ స్లర్రీ పైప్‌లైన్‌ను విశాఖపట్నం వరకూ పొడిగించాలని నిర్ణయించారు. చిత్తూరు జిల్లాలోని గనిలో 1.83 మిలియన్ టన్నుల ఖనిజం ఉన్నట్లు అంచనా వేస్తున్నారట. ప్రతి టన్నుకు 5.15 గ్రాముల బంగారం ఉన్నట్లు అంచనా వేశారట.

## మహిళా రిజర్వేషన్ కోసం

# ప్రధానికి బిఆర్ఎస్ లేఖ

తెలుగు ట్రాక్,హైదరాబాద్



సమాజంలో సగభాగమైన మహిళలు అన్ని రంగాల్లో పురుషునితో సమానంగా రాణించినప్పుడే ఏ దేశమైనా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని అధినేత సిఎం కేసీఆర్ అధ్యక్షతన సమావేశమైన బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సంయుక్త సమావేశం పునరుద్ఘాటించింది. మహిళల్లో దాగివున్న శక్తిని వెలికితీసి వారికి సహకరిస్తూ వారిని అభివృద్ధిలో భాగస్వాములను చేసినపుడు మాత్రమే ఏ సమాజమైనా కూడా ప్రగతి పథంలో పయనిస్తుందనే వాస్తవాన్నిస్పష్టం చేసింది. ఈ దిశగా అభివృద్ధి చెందుతున్న దేశాలను ప్రపంచవ్యాప్తంగా వున్న సోదాహరణలతో సహా విశ్లేషించింది.

బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో చర్చించి తీసుకున్న నిర్ణయాల మేరకు పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు భారత ప్రధాని నరేంద్ర మోడీకి మహిళా రిజర్వేషన్ల పై లేఖ రాసారు.

చట్ట సభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ కోసం బిల్లును ప్రవేశపెట్టాలని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం మొట్ట మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే ( 14 జూన్ 2014) ఏకగ్రీవ తీర్మానం చేసి పంపిన విషయాన్ని కేంద్రం ఇంతవరకు పట్టించుకోకపోవడం పై సంయుక్త సమావేశం అసంతృప్తిని వ్యక్తం చేసింది. మహిళాభ్యున్నతి పట్ల చిత్తశుద్ధిని ప్రదర్శిస్తూ పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బిల్లు ఆమోదం పొందే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని డిమాండు చేస్తూ బిఆర్ఎస్ పార్టీ సంయుక్త సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

# డ్రగ్స్ కేసులో పోలీసుల విచారణ

తెలుగు ట్రాక్,హైదరాబాద్

మాదాపూర్ డ్రగ్స్ కేసులో పోలీసుల విచారణ ముమ్మరంగా సాగుతోంది. సినీ ఫైనాన్షియర్ వెంకట్ డ్రగ్స్ కేసులో పోలీసులు మరికొందరిని అరెస్టు చేశారు. తాజాగా ఎనిమిది మంది నిందితులను నార్కోటిక్ విభాగం పోలీసు అధికారులు అరెస్టు చేశారు. ఇందులో ముగ్గురు నైజీరియన్లతో పాటు మాదక ద్రవ్యాలు వాడుతున్న మరో ఐదుగురిని అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు. తాజాగా అరెస్టు అయిన 8 మందిలో ఓ సినీ నిర్మాత కూడా ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా అదుపులోకి తీసుకున్న వారిలో పలువురు కీలక వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. దీంతో ఇప్పటి వరకు ఈ కేసులో 18 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో ఐదుగురు మాదక ద్రవ్యాలు వాడే వారు ఉన్నట్లు తెలుస్తోంది. వీరి నుంచి 50 గ్రాముల ఎండీఎంఏ, 8 గ్రాముల కొకైన్, 24 ఎక్టసీ పిల్స్ ను పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మీడియాకు వెల్లడించనున్నారు. గత నెల 31వ తేదీన నార్కోటిక్ విభాగం పోలీసులు గుడిమల్కాపూర్, మాదాపూర్ లో దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. మాదాపూర్ డ్రగ్స్ పార్టీని భగ్నం చేసి సినీ నిర్మాత వెంకట్‌తో పాటు మరో ఐదుగురు బాలాజీ, కె.వెంకటేశ్వర రెడ్డి, డి.మురళి,మధుబాల, మేహక్ అనే యువకుల్ని అదుపులోకి తీసుకున్నారు. బాలాజీ పై గతంలోనూ కేసులు ఉన్నట్లు గుర్తించారు. డమరుకం, పూల రంగుడు, లైఫ్లీ, ఆటో నగర్ సూర్య సినిమాకు ఫైనాన్సియర్ గా వెంకట్ పని చేసినట్లు గుర్తించారు. సినిమా ఫైనాన్సర్ వెంకట్ ఆధ్వర్యంలో డ్రగ్స్ పార్టీ నిర్వహణ జరగుతుందని గుర్తించి రెయిడ్ చేశారు. వెంకట్ కదిలికలపై గత మూడు నెలలుగా నార్కోటిక్ బ్యూరో నిఘా పెట్టారు. వెంకట్ కు డ్రగ్స్ మాఫియా పై సంబంధాలు పై ఆరా తీస్తున్నారు.సినీ ఫైనాన్షియర్ వెంకట్ రత్నారెడ్డిపై తెలుగు రాష్ట్రాల్లో కలిపి 25 కు పైగా కేసులు నమోదైనట్లుగా గుర్తించారు. గతంలో ఐఆర్ఎస్ అధికారినంటూ వెంకట్ మోసాలు చేశారు. నిర్మాతలు సి. కల్యాణ్, రమేష్‌ల నుంచి ఐఆర్ఎస్ అధికారినంటూ డబ్బులు వసూలు చేసినట్లుగా గుర్తించారు.



నిర్మాతల నుంచి రూ.30 లక్షలకుపైగా కొట్టేసిన వెంకటరత్నారెడ్డి.. పెళ్లి పేరుతోనూ యువతుల్ని మోసం చేసినట్లుగా గుర్తించారు. సినిమాలో అవకాశాల పేరిట అమ్మాయిలకు వల వేస్తూ.. ఇతర రాష్ట్రాల నుంచి అమ్మాయిలను రప్పించి వ్యభిచారం చేస్తున్నట్లుగా గుర్తించారు.పెళ్లి పేరుతో ఎన్ఆర్ఐ నంటూ విదేశీ యువతలను మోసం చేసిన వెంకట్ రత్నారెడ్డి.. తన అక్రమాలకు ఏపీకి చెందిన ఓ ఎంపీ పేరును ఉపయోగించుకుంటున్నారు. ఇప్పటికే సినిమా ఫైనాన్షియర్ వెంకట్, బాలాజీ కి డ్రగ్స్ మాఫియా తో లింకులు ఉన్నాయని పోలీసు విచారణలో బయటపడింది. తాజాగా ఈ కేసులో నార్కోటిక్స్ బ్యూరో విచారణ కొనసాగుతోంది. సినీ ఫైనాన్సర్ వెంకట్ రత్నా రెడ్డి వాట్సాప్ లో కీలక విషయాలు బట్టబయలయ్యాయి. బాలాజీ, వెంకట్ రత్నారెడ్డి కలిసి డ్రగ్స్ పార్టీలు చేసినట్లు గుర్తించారు. 18 మందికి డ్రగ్స్ ను అమ్మకాలు చేసినట్లు విచారణలో వెల్లడించారు బాలాజీ, వెంకట్. ఆ 18 మంది ఎవరు అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

**పరారీలో నవదీప్**

తాజాగా నేడు మరో సినీ నిర్మాత డ్రగ్స్ కేసులో అడ్డంగా బుక్కయ్యాడు. మాజీ ఎంపీ కూమారుడు దేవరకొండ సురేష్ రావు అరెస్ట్ చేశాం.. హీరో నవదీప్ కూడా డ్రగ్స్ వాడుతున్నట్లు గుర్తించాం.. ప్రస్తుతం అతను పరారీలో ఉన్నాడు. త్వరలోనే వారిని పట్టుకుంటాం" అని ఆయన తెలిపారు.

# కవితను అరెస్ట్ చేస్తారా?

### లిక్కర్ స్కామ్ లో కవితకు నోటీసులు

తెలుగు ట్రాక్,హైదరాబాద్

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు దేశంతోపాటు తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేపిన విషయం తెలిసిందే. మొదటనుంచి ఎన్నో మలుపులు తిరుగుతున్న లిక్కర్ స్కామ్ కేసు.. హైదరాబాద్‌కు చెందని వ్యాపారవేత్త అరుణ్ పిళ్లై అప్రూవర్‌గా మారడంతో మళ్లీ సెగలు పుట్టిస్తోంది. విచారణను వేగవంతం చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవితకు మళ్లీ నోటీసులు జారీ చేసింది. శుక్రవారం విచారణకు హాజరుకావాలంటూ ఢిల్లీ లిక్కర్ కేసులో ఈడీ నోటీసులు జారీ చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కవితకు వ్యాపారవేత్త అరుణ్ పిళ్లై బినామిగా ఈడీ అభియోగాలు మోపింది. ఈ మేరకు ఎఫ్ఐఆర్ కాపీలో కూడా ప్రస్తావించింది. ఇప్పటికే కవితను విచారించిన ఈడీ.. మరోసారి విచారణకు రావాలంటూ నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. అయితే, అరుణ్ పిళ్లై అప్రూవర్ గా మారి వాంగ్మూలం ఇచ్చిన నేపథ్యంలో కీలక ఆధారాలు సేకరించేందుకు కవితకు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై కవిత స్పందించాల్సి ఉంది. విచారణకు హాజరవుతారా.?? లేదా..? అనేది కూడా తెలియాల్సి ఉంది.



ఇక కవిత ఆడిటర్ గా పని చేసిన బుచ్చిబాబు కూడా అప్రూవర్ అయ్యారని చెబుతున్నారు. ఆయన దగ్గర నుంచి ఇటీవల స్టేట్ మెంట్లు కూడా మళ్లీ తీసుకున్నారు. ఇక సౌత్ లాబీలో మిగిలింది కవిత మాత్రమే. ఇప్పుడు విచారణకు పిలవడంతో ఎలాంటి పరిణామాలు ఉంటాయన్న చర్చ జరుగుతోంది. అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో 2021, 2022లో రూపొందించిన ప్రభుత్వ ఎక్సైజ్ పాలసీపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా జూలైలో సీబీఐ విచారణకు సిఫార్సు చేశారు. గతేడాది నవంబర్ 17న అమలులోకి వచ్చిన ఈ విధానంలో భాగంగా నగరాన్ని 32 జోన్‌లుగా విభజించి 849 షాపులకు సంబంధించి ప్రైవేట్ బిడ్డర్లకు రిటైల్ లైసెన్సులు ఇచ్చారు. ఈ విధానాన్ని బీజేపీ, కాంగ్రెస్‌లు వ్యతిరేకిస్తూ ఎల్‌జీకి ఫిర్యాదు చేశాయి. ఎల్‌జీ ఆదేశంతో మొదట సీబీఐ.. సీబీఐ కేసుల ఆధారంగా ఈడీ రంగంలోకి దిగాయి. వరుసగా అరెస్టులు చేశాయి. అరబిందో శరత్ చంద్రారెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాగుంట రాఘవరెడ్డి, అరుణ్ రామచంద్ర పిళ్లైను బినామీగా పెట్టుకుని కవిత ఢిల్లీలో మద్యం వ్యాపారం చేసినట్లుగా గుర్తించి కేసులు నమోదు చేసింది. విచారణ జరిపి దాఖలు చేసిన చార్జిషీట్‌లో కవిత బినామీ ఆస్తుల వివరాలనూ వెల్లడించింది. ఢిల్లీలో మద్యం వ్యాపారంలో సాధించిన లాభాలతో హైదరాబాద్‌లో కవిత భూములు కొనుగోలు చేశారని, ఇందులో సౌత్‌గ్రూపుదే కీలకపాత్ర అని ఈడీ కోర్టుకు తెలిపింది. భూముల కొనుగోలు వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత భర్త అనిల్‌కుమార్ ప్రమేయం ఉందని తెలిపింది. గౌతమ్ మల్హోత్రా, అమన్‌దీప్, మాగుంట రాఘవ, అరుణ్ పిళ్లై వాంగ్మూలాల ఆధారంగా రెండు చార్జిషీట్లను దాఖలు చేసింది. ఆప్ నేతలకు సౌత్‌గ్రూపు రూ.100 కోట్లు హవాలా రూపంలో ముడుపులిచ్చింది. తద్వారా మద్యం విధానం తమకు అనుకూలంగా ఉండేలా చూసుకుంది. తర్వాత అందర్నీ అంటే కవిత తరపున వ్యవహారాలు చక్క బెట్టినట్లుగా భావిస్తున్న అరుణ్ పిళ్లై, అభిషేక్ , బుచ్చిబాబు వంటి వారి వాంగ్మూలాలతో కవిత నేరం చేసినట్లుగా ఈడీ లెక్కలేసింది. వారందరూ దాదాపుగా అప్రూవర్లు అయ్యారు.

# కవితకు 10 రోజులు గడువు

తెలుగు ట్రాక్,న్యూఢిల్లీ

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పిటీషన్ సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈడీ అధికారాలను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటీషన్ ను ఈ నెల 26వ తేదీకి వాయిదా పడింది. సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా నోటీసులు ఎలా ఇస్తారంటూ కవిత ఈ పిటీషన్ ను దాఖలు చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ తనకు ఇచ్చిన సమన్లను రద్దు చేయాలని ఆమె పిటీషన్ లో కోరారు. నళిని చిదంబరానికి ఇచ్చిన వెసులుబాటు తనకు ఇవ్వాలని కవిత తన పిటీషన్ లో కోరారు. సుప్రీంకోర్టు ఇదివరకు కొన్ని ఆదేశాలు జారీ చేసిందని.. అందులో మహిళల్ని విచారణ కోసం ఒత్తిడి చేయవద్దని పేర్కొందని కవిత తరపు లాయర్ వాదించారు. ఈ మధ్యంతర ఉత్తర్వులు కొనసాగుతాయని కోర్టు చెప్పిందని తెలిపిదం?. నళిని చిదంబరం విషయంలో కోర్టు తుది తీర్పు ఇచ్చేవరకు విచారణ కోసం ఒత్తిడి చేయవద్దని కోర్టు చెప్పిందని.. ఇదే తరహా ఆదేశాలను కవితకు కూడా వర్తింప చేయాలన్నారు. మరో కేసులో కస్టమ్స్ యాక్ట్ అంశంలోనూ మహిళలపై కఠినంగా వ్యవహరించవద్దు అని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. మనీలాండరింగ్ చట్టంలో కూడా మహిళలకు రక్షణ కల్పించాలని చెబుతోందని.. బెయిల్ కోసం ఉద్దేశించిన సెక్షన్ 45లో కూడా మహిళలకు వెసులుబాటు కల్పించాలని ఉందని కవిత తరపు లాయర్ తెలిపారు. కాబట్టి మహిళలను ప్రత్యేక కేటగిరీగానే పరిగణించాల్సి ఉంటుందన్నారు. ఈ అంశంపై తుది ఉత్తర్వులు వెలువడాలి. ఫైనల్ హియరింగ్ కోసం డేట్ ఇవ్వాలని కోరారు. అప్పటి వరకు ఈ సమన్లను వాయిదా వేయాలని కోరారు. అయితే తాము 10 రోజులు ముందుగా చెబుతాం అన్నాం. ఆ మేరకు 10 రోజుల సమయం ఇచ్చామని ఈడీ తెలిపింది. కవిత ఇప్పటికే రెండు పర్యాయాలు విచారణకు హాజరయ్యారు. ఇప్పుడు ఆమె బిజీగా ఉంటే, మరో 10 రోజులు సమయం పొడిగిస్తామని ఈడీ తెలిపింది. అంతే తప్ప సమన్లను నిరవధికంగా వాయిదా వేయడం కుదరదని ఈడీ స్పష్టం చేసింది. అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు విజ్ఞప్తి మేరకు కేసు విచారణ సెప్టెంబర్ 26కు వాయిదా వేస్తున్నామని.. అప్పటి వరకు సమన్లు వాయిదా వేయాలని మేము రికార్డు చేయాలా అని ధర్మాసనం ఈడీని ప్రశ్నించింది. అవసరం లేదు. మేము వాయిదా వేస్తామని ఈడీ చెప్పింది. దీంతో కవితకు మరో పది రోజుల పాటు ఊరట లభించించినట్లయింది. లిక్కర్ స్కాం కేసులో ఈడీ కవితకు సెప్టెంబర్ 14న మరోసారి నోటీసులిచ్చింది. ఈడీ అధికారులు ఇప్పటికే మూడు సార్లు విచారించారు. మార్చి 16, 20, 21 తేదీల్లో మూడు సార్లు విచారించింది.

### ఈడీ నోటీసు కాదు..మోడీ నోటీసు : ఎమ్మెల్సీ కవిత

తనకు మోడీ నోటీసు వచ్చిందని, అది రాజకీయ కక్షతో పంపించిన నోటీసు కాబట్టి దానిపై పెద్దగా స్పందించాల్సిన అవసనం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈడీ నోటీసును తమ పార్టీ న్యాయ విభాగానికి ఇచ్చామని, ఆ విభాగం ఎలా చెబితే అలా ముందుకెళ్తామని తెలిపారు. గురువారం ఆమె నిజామాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈడీ నోటీసులు అందాయని కవిత తెలిపారు. నోటీసులను పార్టీ లీగల్ సెల్‌కు అందజేశాం. వారి సూచనల మేరకు ముందుకు వెళ్తాం. రాజకీయ కక్ష్యతోనే నోటీసులు ఇచ్చినట్లు బలంగా నమ్ముతున్నాం. తెలంగాణలో రాబోయే ఎన్నికల వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని తనకు నోటీసులు ఇచ్చారు. గత ఏడాది కాలం నుంచి ఆ కేసులో దర్యాప్తు జరుగుతోందని, ఇంకెన్నాళ్లు ఆ విచారణ ఉంటుందో తనకు తెలియదు. 2జీ కేసులో కూడా ఇంత కాలం విచారణ జరగలేదనుకుంటా. రాజకీయ ఉద్దేశంతోనే కేసు సాగుతోందని, తెలంగాణ ప్రజలు దీన్ని సీరియస్‌గా తీసుకోరు. పార్టీ లీగల్ బృందం ఇచ్చే సలహాల మేరకు ముందుకు వెళ్తామన్నారు.తాము ఏ పార్టీతోనూ కలవలేదని, కేవలం తెలంగాణ ప్రజలు, భారత దేశ ప్రజలతో మమేకం అయ్యామన్నారు. దేశ ప్రజలు సీఎం కేసీఆర్‌ను కావాలనుకుంటున్నారని, దీంతో ఆ రెండు పార్టీలకు ఆ భయం పట్టుకున్నట్లు ఆమె తెలిపారు. మేం ఎవరికీ బీ టీమ్ కాదన్నారు. అంతులేని టీవీ సీరియల్ తరహాలో విచారణ సాగుతున్నదని, అదేమీ పెద్ద విషయం కాదన్నారు. బీజేపీ ఎన్నికల స్టంట్‌లో భాగంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆమె ఆరోపించారు. ప్రజలే ఆ పార్టీకి బుద్ధి చెబుతారని కవిత పేర్కొన్నారు.

# జీ20 ఖర్చు 4100 కోట్లు

తెలుగు ట్రాక్,న్యూఢిల్లీ
జీ20 సమావేశాలకు 30 మంది దేశాధినేతలతో పాటు 14 మంది అంతర్జాతీయ సంస్థల అధినేతలు హాజరయ్యారు...గ్రాండ్ సక్సెస్ అయింది. భారత్ మండపాన్ని నిర్మించింది. మురికివాడలను తొలగించింది. ఎక్కడికక్కడ భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. భారతీయ సనాతన ధర్మాన్ని ప్రతిబింబించేలాగా చిత్రాలు రూపొందించింది. భారీ విగ్రహాలను ఏర్పాటు చేసింది. ఇక అతిథుల కోసం ప్రత్యేక విడిది గృహాలను కేటాయించింది. వారికి బస, భోజనాలు ఒక రేంజ్ లో ఏర్పాటు చేసింది. శనివారం మొదలైన సభలు ఆదివారంతో ముగుస్తాయి..ఇవీ జీ20 శిఖరాగ్ర సమావేశాల కోసం భారత్ చేసిన ఏర్పాట్లు.. ఇంతకీ ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి భారత్ ఎంత ఖర్చు చేసింది?జీ20 సమావేశాలకు 30 మంది దేశాధినేతలతో పాటు 14 మంది అంతర్జాతీయ సంస్థల అధినేతలు హాజరయ్యారు.. కొన్ని నివేదికల ప్రకారం ఈ శిఖరాగ్ర సదస్సు కోసం భారత్ 4100 కోట్ల కంటే ఎక్కువ ఖర్చు చేసినట్టు సమాచారం. రహదారులు, సెక్యూరిటీ, ఫుట్ పాత్ లు, లైటింగ్ ఇతర పనుల కోసం ఈ డబ్బును ఖర్చు చేసినట్టు తెలుస్తోంది. మేక్ ఓవర్ ప్రక్రియలో భాగంగా దేశ రాజధాని లోని వివిధ ప్రదేశాలలో శిల్పాలు కూడా ఏర్పాటు చేసింది. జీ20 శిఖరాగ్ర సమావేశాల కోసం గతంలో ఇతర దేశాలు కూడా పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేశాయి. 2018లో బ్యూనస్ ఎయిర్ సమ్మిట్ ఖర్చు 112 మిలి య్యన్ డాలర్లు.. 2010 టొరంటోలో జరిగిన సమ్మిట్ కోసం కెనడా 715 మిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. వరి శిఖరాగ్ర సమావేశం 2022 నవంబర్ లో జరిగింది. 2024 జీ20 సమావేశాలు బ్రెజిల్ లో జరుగుతాయి.జీ20 సదస్సు అనేది ఆర్థికపరమైన అంశాలతో ముడిపడి ఉంటుంది కాబట్టి.. ఈ శిఖరాగ్ర సమావేశాలను నిర్వహించే దేశం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. ఏర్పాట్ల విషయంలో ఎటువంటి తేడా రాకుండా చూసుకుంటుంది. భారీగా ఖర్చు పెడితే పెట్టుబడులు, వివిధ రకాల ఒప్పందాలు తమ దేశం ప్రాతిపదికగా జరుగుతాయని భావిస్తుంది. లో జరిగిన శిఖరాగ్ర సమావేశాల్లో ఇదే జరిగింది కాబట్టి.. భారత్ కూడా ఇదే విధానాన్ని అనుసరించింది. అయితే ఈ విధానాన్ని ప్రతిపక్ష పార్టీలు తప్పుపడుతున్నప్పటికీ.. అధికార భారతీయ జనతా పార్టీ మాత్రం ఏమాత్రం లెక్క చేయడం లేదు. ఢిల్లీలోని మురికివాడలను ప్రస్తుతం తొలగించిన నేపథ్యంలో.. వారికి పునరావాసాన్ని కల్పించే ఆలోచనను ప్రభుత్వం చేస్తోంది.

## ఉగ్రస్థావరాలను
# చుట్టుముట్టిన భారత సైనికులు

తెలుగు ట్రాక్,శ్రీనగర్
జమ్మూ కశ్మీర్ లోని అనంత్‌నాగ్‌లో జరిగిన ఉగ్రవాదులు దాడుల్లో ముగ్గురు ఆర్మీ అధికారులు ప్రాణాలు కోల్పోయారు. ఆర్మీ ఎదురు కాల్పులు చేస్తున్న క్రమంలో ఆర్మీ కల్నల్ మన్‌ప్రీత్ సింగ్, మేజర్ ఆశిష్ ధోన్‌చక్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ హుమాయున్ భట్ లు అమరులయ్యారు. లష్కరే తోయిబాకు చెందిన షాడో గ్రూప్ రెసిస్టెన్స్ ఫ్రంట్ ఈ దాడి చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ దాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమైంది ఇండియన్ ఆర్మీ. అనంత్‌నాగ్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు మొదలు పెట్టింది. ఈ క్రమంలోనే మరోసారి కాల్పులు, బాంబు పేలుళ్లు సంభవించాయి. అనంత్‌నాగ్‌లో తలదాచుకున్న ఇద్దరు ఉగ్రవాదులను చుట్టుముట్టినట్టు ఆర్మీ స్పష్టం చేసింది. జవాన్లను బలి తీసుకున్న ఆ టెర్రరిస్టులను మట్టుబెట్టేందుకు చూస్తోంది. ఉగ్రవాదుల కాల్పుల్లో అమరులయ్యారని, ఇందుకు కచ్చితంగా బదులు తీర్చుకుంటామని ఆర్మీ వెల్లడించింది. ఈ దాడులపై జమ్ములో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పాకిస్థాన్‌కి చెందిన ఉగ్రవాదులే ఈ పని చేశారని, పాక్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు ఆందోళనకారులు. జమ్ములో భారతీయ జనత యువ మోర్చ ఆందోళన చేపట్టింది. కల్నల్ మన్‌ప్రీత్ సింగ్‌పై దాడికి నిరసనగా నినాదాలు చేసింది. ఉగ్రవాదుల దిష్టిబొమ్మల్ని తగల బెట్టింది. అమరుల కుటుంబ సభ్యులు ఈ ఘటనను తట్టుకోలేకపోతున్నారు. ఉగ్రవాదుల కాల్పుల్లో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స అందిస్తుండగానే ప్రాణాలు కోల్పోయారు. కుటుంబ సభ్యులు కల్నల్ సింగ్‌ని తలుచుకుని భావోద్వేగానికి గురవుతున్నారు. ఉదయమే తాము కాల్ చేసి మాట్లాడామని, మళ్లీ కాల్ చేస్తా అని వెంటనే కాల్ కట్ చేశాడని చెప్పారు. గతేడాది సేనా మెడల్ అందుకున్నాడని కన్నీళ్లు పెట్టుకున్నారు. అమర జవాన్లకు ఆర్మీ అధికారులు నివాళులు అర్పించారు. లష్కరే తోయిబాకు చెందిన షాడో గ్రూప్ రెసిస్టెన్స్ ఫ్రంట్ ఈ దాడి చేసినట్లు అధికారులు వెల్లడించారు. రాజౌరిలోని నార్లాలో జరిగిన ఎన్‌కౌంటర్ లో భద్రతా సిబ్బంది ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చారు. ఈ ఎన్ కౌంటర్ రెండు రోజులు వరకు కొనసాగింది. అధికారులు, భద్రతా బలగాల పాకిస్థానీ గుర్తులతో ఉన్న మందులను, యుద్ధ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి భారత సైన్యం, జమ్మూ కశ్మీర్ పోలీసులు ఇద్దరు ఉగ్రవాదుల కదలికలను గుర్తించారని డిఫెన్స్ పీఆర్వో, లెఫ్టినెంట్ కల్నల్ సునీల్ బర్త్వాల్ తెలిపారు. సెప్టెంబర్ 12వ తేదీన భద్రతా దళాలు ఆ ఇద్దరు ఉగ్రవాదులను చుట్టుముట్టాయి. ఇరు వర్గాల మధ్య భీకర కాల్పులు జరిగాయి. ఆ కాల్పుల్లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. రెండో ఉగ్రవాదిని సెప్టెంబర్ 13వ తేదీన హతమార్చాయి భద్రతా బలగాలు.



# మరో వివాదంలో స్టాలిన్

## హిందీపై స్టాలిన్ విసుర్లు

తెలుగు ట్రాక్,చెన్నై,
సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు ఎంత వివాదాస్పదమయ్యాయో తెలిసిందే. ఇప్పటికీ ఈ వివాదం కొనసాగుతూనే ఉంది. అప్పటి నుంచి ఉదయనిధిని టార్గెట్ చేస్తూ బీజేపీ తీవ్ర విమర్శలు చేస్తోంది. అయితే...హిందీ దినోత్సవం సందర్భంగా కేంద్రహోం మంత్రి అమిత్‌షా చేసిన ట్వీట్‌పైనా ఉదయనిధి తీవ్రంగా స్పందించడం మరో వివాదానికి తెర తీసింది. దేశంలోని అన్ని భాషల్ని ఏకం చేసేది హిందీ అని, స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి ఇప్పటి వరకూ దేశ అభివృద్ధిలో హిందీ పాత్ర కీలకం అని ట్వీట్ చేశారు అమిత్ షా. అధికార భాష అయిన హిందీతో పాటు అన్ని భాషల్నీ కాపాడుకునేందుకు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు.దీనిపైనే ఉదయనిధి స్టాలిన్ మండి పడ్డారు. ట్విటర్‌లో తమిళంలో సుదీర్ఘమైన పోస్ట్ చేశారు. అన్ని భాషల్ని హిందీ ఎలా కలుపుతుందని, బలవంతంగా ఆ భాషను రుద్దడం ఆపేయాలని తేల్చి చెప్పారు. హిందీ మాత్రమే గొప్పదనే భావజాలం నుంచి బీజేపీ బయటపడాలని అన్నారు. హిందీ చదివితేనే అభివృద్ధి చెందొచ్చు అనే అర్థం వచ్చేలా మాట్లాడడం సరికాదని అసహనం వ్యక్తం చేశారు. “హిందీ దేశ ప్రజల్ని ఏకం చేస్తుందని, స్థానిక భాషల్ని బలోపేతం చేస్తుందని అమిత్‌షా చెప్పడమేంటి..? ఎప్పటిలాగే ఆయన మరోసారి హిందీపైన తనకున్న ప్రేమని చాటుకున్నారు. హిందీ చదివితే కానీ గొప్పవాళ్లం కాలేమన్న అర్థంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడమేంటి..? తమిళనాడులో తమిళం మాట్లాడతారు, కేరళలో మలయాళం మాట్లాడతారు. మరి ఈ రెండు రాష్ట్రాలను హిందీ ఎలా కలుపుతుంది..? సాధికారత ఎలా సాధిస్తారు..? కేవలం నాలుగైదు రాష్ట్రాల్లో మాట్లాడే హిందీ భాష...మొత్తం దేశ ప్రజల్ని ఒకటి చేస్తుందని చెప్పడం వింతగా ఉంది. మిగతా భాషల్ని తక్కువ చేసి మాట్లాడడం సరికాదని మంత్రి ఉదయనిధి అన్నారు..

## అదానీ-హిండెన్‌బర్గ్ కేసు..
# అక్టోబర్ 13న సుప్రీంకోర్టులో విచారణ

తెలుగు ట్రాక్,న్యూఢిల్లీ
హిండెన్‌బర్గ్ కేసు తదుపరి విచారణ అక్టోబర్ 13న సుప్రీంకోర్టులో జరగనుంది. మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ దాఖలు చేసిన తాజా స్టేటస్ రిపోర్టుపై వచ్చే నెలలో సుప్రీంకోర్టు విచారణ చేపట్టనుంది. ఈ విచారణలో అనేక కొత్త ప్రశ్నలు కూడా తలెత్తుతాయి. అదానీ-హిండెన్‌బర్గ్ వివాదంపై ఈ వారం ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఇందులో అదానీ కంపెనీల స్టాక్ మానిప్యులేషన్‌పై ఆరోపించిన రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ లేఖను సుప్రీం కోర్టు నుంచి ముఖ్యమైన వాస్తవాలను అణచివేసిందని సెబీ ఆరోపించింది. అదానీ గ్రూప్‌పై రెండు ఆరోపణలు మినహా మిగిలిన అన్ని ఆరోపణలపై దర్యాప్తును పూర్తి చేశామని, గ్రూప్‌లో పెట్టుబడులు పెట్టే విదేశీ సంస్థల నిజమైన యజమానులు ఇంకా ఐదు పన్ను స్వర్గధామాల్లో పెండింగ్‌లో ఉన్నారని ఆగస్టు 25న సెబీ సుప్రీంకోర్టుకు తెలియజేసింది.అదానీ గ్రూప్‌పై ఓవర్ ఇన్వాయిస్ కేసులో విచారణ జరుగుతున్నప్పుడు నలుగురు పిటిషనర్లలో ఒకరైన అనామికా జైస్వాల్ అన్నారు. ఆ తర్వాత డీఆర్ఐ 2014లో అప్పటి సెబీ ఛైర్మన్‌కు లేఖ పంపింది. దీంతో డీఆర్ఐ సెబీని అప్రమత్తం చేసింది. ఆ సమయంలో, ఎలక్ట్రికల్ కాంపోనెంట్‌లను దిగుమతి చేసుకోవడంలో గ్రూప్ అధిక వాల్యుయేషన్ పద్ధతులను ఉపయోగించవచ్చని డీఆర్ఐ సెబీకి రాసిన లేఖలో తెలిపింది. విత్‌డ్రా చేసిన సొమ్మును స్టాక్ మార్కెట్‌లో తారుమారు చేసేందుకు ఉపయోగించవచ్చని ఆరోపించారు. సెబీ కోర్టు ముందు ముఖ్యమైన వాస్తవాలను అటకెక్కించిందని పిటిషనర్ ఆరోపించారు. మిస్టర్ సిరిల్ ష్రాఫ్, మేనేజింగ్ పార్ట్‌నర్, సిరిల్ అమర్‌చంద్ మంగళదాస్ కార్పొరేట్ గవర్నెన్స్‌పై సెబీ కమిటీలో సభ్యుడిగా ఉన్నారని, ఇది ఇన్‌సైడర్ ట్రేడింగ్ వంటి నేరాలను పరిశీలిస్తుందని అఫిడవిట్ పేర్కొంది. గౌతమ్ అదానీ కుమారుడితో తన కుమార్తె వివాహం జరిగిందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. సెబీ 24 దర్యాప్తు నివేదికలలో ఐదు అదానీ గ్రూప్ కంపెనీలపై ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆరోపణలపై పిటిషనర్ తెలిపారుఅదనంగా, పిటిషనర్ జర్నలిస్టుల సంఘం 'ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్' కనుగొన్న పత్రాలను ఉదహరించారు. మారిషస్‌కు చెందిన రెండు కంపెనీలు ? ఎమర్జింగ్ ఇండియా ఫోకస్ ఫండ్ (ఇఎఈఈఅ), ఇఓ శ్రీవబీణీవనిబి ఈబీనిట (ఇఓశ్రీఈ) 2013, 2018 మధ్యకాలంలో నాలుగు అదానీ కంపెనీల షేర్లలో భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టి వ్యాపారం చేశాయని అఫిడవిట్ పేర్కొంది. సెబీ 13 అనుమానాస్పద విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు/విదేశీ సంస్థల జాబితాలో ఈ రెండు కంపెనీల పేర్లు ఉన్నాయని పిటిషనర్ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. సెబీ వారి అంతిమ ప్రయోజనకరమైన యజమానులను లేదా ఆర్థిక ఆసక్తితో వాటాదారులను కనుగొనలేకపోయింది.

# ఆర్టీసీ బిల్లుకు గవర్నర్ ఆమోదం వెనుక...

తెలుగు ట్రాక్,హైదరాబాద్
ఆర్టీసీ ఉద్యోగుల నెల రోజుల ఉత్కంఠకు తెర పడింది. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన ఆర్టీసీ విలీనం బిల్లుకు ఎట్టకేలకు గవర్నర్ తమిళిసై ఆమోద ముద్ర వేసింది. న్యాయశాఖ పరిశీలన తర్వాత బిల్లులోని అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. అనంతరం బిల్లును ఆమోదిస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేసింది.ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనానికి సంబంధించి ఇటీవల అసెంబ్లీలో ఆమోదం పొందిన బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. ఈ మేరకు ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలతో ఇటీవల గవర్నర్ రెండు రోజుల క్రితం సమావేశమయ్యారు. కార్మికుల సమస్యలు, విలీన ప్రక్రియకు సంబంధించి పలు సూచనలను గవర్నర్‌కు చేసినట్లు వారు తెలిపారు. బిల్లుపై తగిన సూచనలు తీసుకుని రెండ్రోజుల్లో ఆమోదం తెలుపనున్నట్లు గవర్నర్ చెప్పారని ఆర్టీసీ జేఏసీ నేతలు సమావేశం అనంతరం వెల్లడించారు. సరిగ్గా వారికి హామీ ఇచ్చిన విధంగానే రెండ్రోజులకు గవర్నర్ ఆమోద ముద్ర వేశారు.ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ అశ్వత్థామరెడ్డి, కన్వీనర్ హనుమంతు, ముదిరాజ్, నరేందర్, ఇతర నేతలు రాజ్ భవన్‌లో గవర్నర్ తమిళిసైని మంగళవారం కలిశారు. ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన 33 సమస్యలతో గవర్నర్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం అశ్వత్థామరెడ్డి మీడియాతో మాట్లాడారు. కార్మికులకు 2 పీఆర్సీలు, 2012 పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు రూ.750 కోట్లు, సీసీఎస్ కు రూ.1,050 కోట్లు, పీఎఫ్ ట్రస్ట్ కు రూ. 1,235 కోట్లు, ఎస్బీటీ రూ.140 కోట్లు, ఎస్ఆర్బీఎస్ రూ.500 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. వీటిపై విలీనానికి ముందే ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రిటైర్ అయిన, వీఆర్ఎస్ తీసుకున్న ఉద్యోగులకూ పీఆర్సీలు వర్తింప చేయాలన్నారు. కారుణ్య నియామకాల కోసం వెయిట్ చేస్తున్న 970 మందిని ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కోరారు. ఇంతకుముందు కారుణ్య నియామకాల కింద 160 మందిని తీసుకుని కాంట్రాక్ట్ పద్ధతిన నియమించారని, వారిని వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. ఈ సమస్యలన్నింటిపై గవర్నర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. రెండేళ్లుగా ప్రగతిభవన్, రాజ్‌భవన్ మధ్య దూరం పెరిగింది. ప్రోటోకాల్ విషయంతోపాటు అనేక అంశాల్లో కేసీఆర్ సర్కార్ గవర్నర్‌తో విభేదించింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గవర్నర్‌పై ఆరోపణలు కూడా చేశారు. గవర్నర్ కూడా కేంద్రానికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను తప్పు పట్టారు. లోపాలను ఎత్తి చూపారు. ఇదిలా ఉండగా ఒక్కసారిగా అటు సీఎం కేసీఆర్, ఇటు గవర్నర్‌లో ఒక్కసారిగా మార్పు వచ్చింది. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి మంత్రిపదవి ఇవ్వడంతో ఆయన ప్రమాణ స్వీకారం కోసం కేసీఆర్ రాజ్‌భవన్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా గవర్నర్‌తో అరగంటపాటు చర్చలు జరిపారు. ఈ చర్చలతో ప్రగతిభవన్ రాజ్‌భవన్ మధ్య గ్యాప్ తగ్గిపోయింది.

# నగరం మాయమయ్యింది





## వరదలకు నగరం మొత్తం కొట్టుకుపోయింది
## 5300 మంది మృతి
## పదివేల మంది గల్లంతు

భారీ వరదలతో ఒక నగరం మొత్తం కొట్టుకు పోయింది. విపరీతమైన వరద తాకిడికి అక్కడి రెండు డ్యామ్ లు తెగిపోవడంతో పట్టణమంతా నీటి మట్ట మయ్యింది.డ్యాములకు సమీపంలో ఉన్న భారీ భవంతులు సహా కూలిపోయి ఆ నీటి తాకిడికి దగ్గర్లోని మధ్యధరా సముద్రంలోకి కొట్టుకెళ్ళిపోయారు. ఆఫ్రికా లోని లిబియా లో వరదలు కనీ వినీ ఎరుగని రీతిలో ప్రాణ నష్టాన్ని కలిగిస్తున్నాయి. డేనియల్ తుఫాన్ తాకిడికి ఆఫ్రికా దేశం లిబియా అతలాకుతలమయ్యింది. డెర్నీ నగరం మొత్తం నీటిలో కొట్టుకు పోయి మాయమైపోయింది. రోడ్లపై ఎక్కడ చూసినా గుట్టలు గుట్టలుగా శవాలే పది ఉన్నాయి. వరద నీటి తాకిడికి చల్లాచెదురుగా పడి ఉన్న వాహనాలు,శిధిలాలు దర్శనమిస్తున్నాయి ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి వరదలు సంభవించాయి. ఆకస్మిక వదరల కారణం తూర్పు లిబియాలో జల ప్రళయం సంభవించింది. ముఖ్యంగా డెర్నా పట్టణం ఈ వరదలకు ఊడ్చిపెట్టుకుపోయింది. ఆ నగరంలో పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. రోడ్లపై ఎక్కడ చూసినా గుట్టలు గుట్టలుగా శవాలే కనిపిస్తున్నాయి. వాహనాలు చల్లాచెదురుగా పడి ఉన్నాయి.అంతర్జాతీయ విరీడియా కథనాల ప్రకారం.. ఇప్పటి వరకూ ఈ జల ప్రళయంలో సుమారు 5,300 మంది ప్రాణాలు కోల్పోయారు. 10 వేల మందికిపైగా ప్రజలు గల్లంతయ్యారు. ఇప్పటి వరకూ 1,500 మృతదేహాలను గుర్తించి ఖననం చేసినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఈ జల ప్రళయానికి అనేక ప్రాంతాలు పూర్తిగా అతలాకుతలమయ్యాయని.. ముఖ్యంగా డెర్నా నగరంలోనే ఎక్కువగా నష్టం వాటిల్లినట్లు వెల్లడిరచారు.డేనియల్ తుఫాన్ ఆదివారం రాత్రి లిబియా తీర ప్రాంతాన్ని తాకింది. కొన్ని గంటల వ్యవధిలోనే తుఫాన్ తీవ్ర రూపం దాల్చింది. వరదల తాకిడికి రెండు డ్యాములు కొట్టుకుపోయాయంటే జల విలయం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. డ్యాములు ధ్వంసం కాగా అక్కడ్నుంచి పోటెత్తిన వరద నీటిలో అనేకమంది మధ్యధరా సముద్రంలోకి కొట్టుకుపోయారని అంతర్జాతీయ విరీడియాలో వార్తలు వెలువడ్డాయి.

# రాజ్యాంగ సవరణ దిశగా అడుగులు

తెలుగు ట్రాక్,విజయవాడ




ఏపీ సీఎం జగన్ అధ్యక్షతన ఈ నెల 20న ఏపీ క్యాబినెట్ సమావేశం జరగనుంది. సెప్టెంబరు 21 నుంచి ఐదు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయన్న నేపథ్యంలో, ఒకరోజు ముందు క్యాబినెట్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర క్యాబినెట్ పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనుంది. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపైనా ఈ భేటీలో చర్చించనున్నారు. కాగా, అసెంబ్లీ సమావేశాలు 5 రోజులు జరుగుతాయని ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ, మరో రెండు రోజులు పొడిగించే అవకాశమున్నట్టు తెలుస్తోంది. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ బిల్లు, కొన్ని ఆర్డినెన్స్ లకు సంబంధించిన బిల్లులు, మరికొన్ని కొత్త బిల్లులను అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. అమిత్ షా, మోదీ అపాయింట్‌మెంట్లు ఖరారు కాగానే ఢిల్లీ వెళ్లనున్నారు. ఇంకా వారి వైపు నుంచి స్పందన రాలేదు. ఈ నెల 18 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో కీలక బిల్లులు ప్రవేశపెట్టాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భావిస్తోంది. జమిలి ఎన్నికల బిల్లు, యూసీసీ, మహిళా బిల్లులను ఆమోదం పొందేలా కేంద్రం ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ బిల్లుల ఆమోదం కోసం కేంద్రం ఔఅం పక్షాలతో పాటుగా తటస్థంగా ఉన్న పార్టీల మద్దతు కోరుకుంటోంది. పార్లమెంట్‌లో వన్ నేషన్ ? వన్ ఎలక్షన్ బిల్లు ఆమోదం పొందాలంటే లోక్‌సభలోని 543 స్థానాల్లో 67 శాతం మద్దతు దక్కాలి. దీంతో పాటుగా రాజ్యసభలో 245 సీట్లలో 67 శాతం దీనిని సమర్థించాలి. దీంతో పాటుగా దేశంలోని కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీలు దీనికి ఆమోదముద్ర వేయాలి. లోక్‌సభలో బీజేపీకి 333 సీట్ల ఉన్నందున 61 శాతం మద్దతు ఉన్నట్టే. కానీ.. బిల్లు ఆమోదానికి మరో 5 శాతం ఓటింగ్ అవసరం. లోక్‌సభలో వైసీపీకి 22 మంది సభ్యులు ఉన్నారు. రాజ్యసభలో చూసుకున్నా... 38 శాతం ఎన్డీఏ కూటమికి మద్దతు ఉంది. అక్కడా వైసీపీ మద్దతు అవసరం. రాజ్యసభలో వైసీపీకి ఉన్న తొమ్మిది మంది సభ్యులు బిల్లుల ఆమోదానికి కీలకంగా మారారు. బీజేపీ పది రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. ఈ బిల్లులు ఆమోదం పొందాంటే 14 రాష్ట్రాలు ఆమోదించాల్సి ఉంది. ఆ సమయంలోనూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం కీలకం కానుంది. పార్లమెంట్‌లో ఇప్పటివరకు ఎన్టీయే సర్కార్ తీసుకొచ్చిన బిల్లులకు వైఆర్ఎస్‌సీపీ మద్దతు ఇచ్చింది. వర్షాకాల సమావేశాల్లో ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లుకు కూడా వైసీపీ అండగా నిలిచింది. అయితే.. ప్రత్యేక సమావేశాల్లో బీజేపీ సర్కార్ ప్రవేశపెట్టబోతున్న కీలక బిల్లులకు మద్దతు ఇచ్చే అంశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వైఖరి ఏంటి అన్నది ఆసక్తికరంగా మారింది.

# ద్వైపాక్షిక బంధంపై చర్చించా : జోబైడెన్

తెలుగు ట్రాక్,హనోయ్

మానవ హక్కుల పరిరక్షణ, స్వేచ్ఛాయుత మీడియా సహా పలు అంశాలపై జీ20 వేదికగా ప్రధాని నరేంద్ర మోదీతో చర్చించానని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వెల్లడించారు. ఢిల్లీలో జీ20 (ఉ20) సదస్సులో పాల్గొన్న అనంతరం వియత్నాంలో పర్యటిస్తున్న బైడెన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మానవ హక్కులను గౌరవించడం, పౌర సమాజం పోషించాల్సిన పాత్ర, మీడియా స్వేచ్ఛ వంటి పలు అంశాలపై మోదీతో తాను విస్తృతంగా చర్చించానని చెప్పారు.భారత్‌-అమెరికా భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే చర్యలపై తాము సంప్రదింపులు జరిపామని అన్నారు. రక్షణ భాగస్వామ్యంలో ద్వైపాక్షిక బంధాన్ని మరింత పటిష్టపరిచేందుకు కట్టుబడి ఉండాలని ఇరు నేతల సమావేశంలో చర్చలు జరిగాయి. ఈ ఏడాది జూన్‌లో మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య నెలకొన్న భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలపై తాము చర్చించామని బైడెన్ చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను పరిష్కరించడంలో తమ చొరవ, నాయకత్వ పటిమను చాటేందుకు అమెరికాకు ఇది అందివచ్చిన అవకాశమని అన్నారు. సమ్మిళిత వృద్ధి, నిలకడతో కూడిన అభివృద్ధికి పెట్టుబడులు వెచ్చించడం సహా వాతావరణ మార్పులు, సవాళ్లు, ఆహార భద్రత బలోపేతం, విద్యా, వైద్య రంగాల్లో వినూత్న మార్పులు వంటివి కీలక అంశాలుగా ముందుకొచ్చాయని బైడెన్ పేర్కొన్నారు.

# మోడీతో సౌదీ యువరాజు భేటీ

తెలుగు ట్రాక్,న్యూఢిల్లీ,

ప్రధాని నరేంద్ర మోదీ సౌదీ యువరాజు మహమ్మద్ బిల్ సల్మాన్‌తో భేటీ అయ్యారు. ఢిల్లీలోని హైదరాబాద్ హౌజ్‌లో ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు. ఉ20 సదస్సు ముగిసిన మరుసటి రోజే ఈ సమావేశం జరగటం ప్రాధాన్యత సంతరించుకుంది. భారత్‌కి మూడు రోజుల పర్యటనకు వచ్చిన మహమ్మద్ బిల్ సల్మాన్ సమావేశంలోనూ పాల్గొననున్నారు. సల్మాన్‌కి ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఘన స్వాగతం పలికారు.. చైనాకు దీటుగా ఈ కారిడార్‌ని నిర్మించేందుకు తీర్మానం చేశారు. ఈ అంశంపైనా సౌదీ యువరాజుతో చర్చించేందుకు ప్రధాని స్వాగతించారు. భారత్, మధ్యప్రాచ్యం, ఐరోపాలను కలిపే ఈ కారిడార్‌పై ప్రపంచ దేశాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు మోదీ, సల్మాన్. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలతో పాటు రక్షణ రంగానికి సంబంధించిన సహకారంపైనా చర్చలు జరిగినట్టు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మహమ్మద్ బిన్ సల్మాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇండియా ఆతిథ్యం ఇచ్చిన తీరు ఎంతో నచ్చిందని చెప్పారు. మెరుగైన భవిష్యత్ కోసం సౌదీ అరేబియా, భారత్ కలిసి పని చేస్తాయని స్పష్టం చేశారు. "భారత్‌కు రావాడం చాలా సంతోషంగా ఉంది. ఉ20 సదస్సుని విజయవంతంగా నిర్వహించిన భారత్‌కి అభినందనలు. ఈ సమావేశాల ద్వారా కీలక ప్రకటనలు చేసే అవకాశం దక్కింది. రెండు దేశాల భవిష్యత్ మెరుగ్గా ఉండేలా భారత్‌తో కలిసి పని చేసేందుకు సౌదీ అరేబియా ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందికీలక ఒప్పందాలు..ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఈ సందర్భంగా కీలక ప్రసంగం చేశారు. 2019లో తాను సౌదీ అరేబియాకి వెళ్లినప్పుడే ఈ కౌన్సిల్ సమావేశంపై చర్చ జరిగిందని వెల్లడించారు. ఈ భేటీ సందర్భంగా రెండు దేశాల మధ్య పలు కీలక ఒప్పందాలు జరిగాయి.

# గేమ్ ఛేంజర్ కానున్న ఆసియా కారిడార్


తెలుగు ట్రాక్,న్యూఢిల్లీ,

జీ20 సమావేశాల చరిత్రలోనే ఇన్ని నిర్దిష్ట ఫలితాలు సాధించిన సమావేశం మరొకటి లేదు. అద్భుత రికార్డ్ ఇదీ. దీన్ని విజయవంతం చేసిన ఘనత మాత్రం ఖచ్చితంగా ప్రధాని మోడీదే అనడంలో ఎలాంటి సందేహం లేదు. శశిథరూర్ కూడా జీ20 సమావేశాలను దెప్పిపొడిచాడు. షో టప్ అన్నాడు. ఇంత పకడ్బందీగా నిర్వహించినందుకు మోడీని అందరూ పొగుడుతుంటే కాంగ్రెస్ మాత్రం జీర్ణించుకోవడం లేదు. వీరిని ఏమనాలి.. నిజంగా ఈ సమావేశాల ఫలితాలు భారత్ పై ప్రపంచం ఉంచిన భరోసాగా చెప్పొచ్చు.ప్రపంచంలో రెండు కూటములు రెండు విధాలుగా ఉన్నాయి. రెండో చైనా, రష్యా డామినేటెడ్ కూటమి. జీ7 ప్రాశ్చాత్య కూటమి. క్వాడ్ కాకుండా బ్రిక్స్, చైనా సపరేట్ కూటములు షాంఘై లాంటివి పెట్టుకున్నారు. చైనా కూటముల్లోనూ భారత్ ఉంది. రెండూ కూటములకు సభ్యురాలిగా ఉన్న దేశం భారత్. అదే మనకు ఉపయోగపడింది. న్యూఢిల్లీ లీడర్ షిప్ సమ్మిట్ డిక్లరేషన్ జరిగింది. ఈసారి కష్టం డిక్లరేషన్ జరగడం సాధ్యం కాదు అనుకున్నారు. పోయిన సారి బాలిలో రష్యా వ్యతిరేకించింది. కానీ మోడీ మాత్రం దీన్ని సక్సెస్ చేసి నిరూపించారు. ఈసారి ఎలాంటి అభ్యంతరాలు లేకుండా 83 పేజీల తీర్మానాన్ని 20 దేశాలు ఏకగ్రీవంగా ఆమోదించడం విశేషం.భారత్, పశ్చిమాసియా, యూరప్ మధ్య ఆర్థిక ఏకీకరణకు ఈ కారిడార్ నిర్మిస్తున్నట్టు తెలుస్తోంది. మానవ నాగరికత అభివృద్ధికి మౌలిక సదుపాయాలే బలమైన పునాదులు. సరిగ్గా వీటినే తమకు అనుకూలంగా మార్చుకోవాలని జిబి20 లోని ప్రభావవంత దేశాలు భావిస్తున్నాయి. ఇందులో భాగంగానే ఈ కారిడార్ నిర్మాణానికి ముందుకు వచ్చాయి. వాస్తవానికి మౌలిక వసతులు మెరుగుపడితేనే సుస్థిర అభివృద్ధి అనేది సాధ్యమవుతుంది. గత కొన్ని సంవత్సరాలుగా ప్రపంచంలోని పలు పరిణామాలు ఇదే విషయాన్ని వెల్లడించాయి. అందుకే సభలు ప్రారంభమైన మొదటి రోజే కారిడార్ విషయం చర్చకు వచ్చింది. అయితే చాలామంది ఇది చర్చల దశలోనే ముగిసిపోతుంది అనుకున్నారు. అయితే పలు దేశాలు దీనిపై ముందుకే అడుగులు వేయడంతో అతి త్వరలో నిర్మాణం జరుగుతుందని సంకేతాలు కనిపిస్తున్నాయి. దీని ఆధారంగానే ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలు పురుడు పోసుకుంటాయని భారత్, గల్ఫ్, యూరప్ భావిస్తున్నాయి.

# వైసీపీకి మరో ఆరు నెలలే సమయం

మరో ఆరు నెలల్లో ప్రభుత్వం మారబోతోంది. వైసీపీ పోయి... బీజేపీ ఆశీస్సులతో జనసేన, తెలుగుదేశం ప్రభుత్వం రాబోతుందని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. జగన్ పాలనకు చరమాకం పాడాలి... ఆంధ్ర పదేశ్ రాష్ట్రాన్ని జగన్ చెర నుంచి విముక్తి చేయాలనే బలమైన సంకల్పంతో రాజమండ్రిలో ప్రత్యేక పరిస్థితుల్లో పొత్తుల నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. నా నిర్ణయానికి పార్టీ నాయకులు మద్దతు తెలపడం చాలా ఆనందం కలిగించిందని చెప్పారు. స్వార్ధానికి పోకుండా, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మీరు తీసుకున్న నిర్ణయం చాలా ఆనందం కలిగించిందని తటస్థ ఓటర్లు మెసెజ్ లు చేయడం సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు.

మంగళగిరి పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "మాజీ ముఖ్యమంత్రిని అరెస్టు చేసే పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయంటే అది సంతోషించే విషయం కాదన్నారు. . కుత్సితమైన మనస్తత్వం ఉన్న వాళ్లు మాత్రమే ఆనందపడతారు. ప్రత్యర్థి పార్టీ బలహీనపడితే ఎవరికైనా ఆనందంగానే ఉంటుందన్నారు. అయితే అది మనకు మేలు చేస్తుంది.. తర్వాత మనమే అధికారంలోకి వస్తామని గ్యారెంటీ ఏంటి? మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అయితే ఈ రాష్ట్రం, ప్రజలు భరించగలరా? వైసీపీ, జగన్ బలాన్ని తక్కువ అంచనా వేయకూడదు. దాని బలం దానికుంది. పవన్ కళ్యాణ్ కు వ్యక్తిగతంగా బలం ఉందన్నారు. రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లిన లక్షలాది జనాలు తరలివస్తారు. అందులో ఎలాంటి సందేహం లేదు. అయితే అది ఎన్నికల్లో గెలవడానికి సరిపోదన్నారు. జనసేనకు బలమైన నాయకత్వపు సమూహాలు కావాలి. ఆ ప్రయత్నంలోనే మనం ఉన్నామన్నారు. .



### నాకు కావాల్సింది రాష్ట్ర క్షేమం

తెలంగాణలో బీఆర్ఎస్ ఈ రోజు అధికారంలోకి ఉంది. ఆ పార్టీ టీఆర్ఎస్ గా ఉన్నప్పుడు తొలినాళ్లలో మన మద్దతు కోరింది. ఈ రోజు తెలంగాణలో బలమైన పార్టీగా అవతరించింది. సుదీర్ఘకాలం ఏ పార్టీనైనా నిలబెట్టడం అంత తేలికైన విషయం కాదు. కొన్నిసార్లు ఇతర పార్టీల ఆసరా తీసుకోవాలి. ఇంకొన్ని సార్లు ఇతర పార్టీలకు సహకారం అందించాలి. మరి కొన్నిసార్లు ఒంటరిగా పోటీ చేయాల్సి ఉంటుందన్నారు

మనకు లక్షలాది మంది జనం వస్తున్నారని పొత్తులో ఉన్న ఇతర పార్టీలను చులకనగా చూడటం సరికాదు. కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలబడినంత మాత్రాన మనకు కొమ్ములు రావు. పొత్తులకు తూట్లు పొడిచేలా ఎవరూ మాట్లాడొద్దు. తెలుగుదేశం బలం దానికి ఉంది. జనసేనకు పోరాట స్ఫూర్తిగల యువత, వీరమహిళలు ఉన్నారు. రెండు సమష్టిగా కలిసి పని చేస్తేనే నియంత లాంటి వైసీపీని ఎదుర్కొగలం. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఈగోలను పక్కన పెట్టి పనిచేద్దామన్నారు. .

### జగన్ మానసిక స్థితి సరిగా లేదు

జగన్ కు మానసిక స్థితి సరిగ్గా ఉందా? లేదా? అనే అనుమానం కలుగుతుంది. రోడ్డు మీద పర్యటిస్తే చెట్లు కొట్టిస్తాడు. పరదాలు కట్టిస్తాడు. ప్రాణాప్రాయం ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు గారే మామూలుగా పర్యటిస్తే. ఈయన మాత్రం ఏదో ప్రమాదం ఉన్నట్లు పరదాలు కట్టుకొని తిరుగుతాడు. చిన్నపాటి పిచ్చ ఉంటేనే ఇలాంటి పనులు చేస్తారన్నారు.

కరెంటు కొనుగోళ్ల ఒప్పందాలు రద్దు చేసి జపనీస్ ప్రభుత్వాన్ని కూడా ఇరిటేట్ చేసిన మహానుభావుడు జగన్. తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు రాడు. ఒక్కటంటే ఒక్క ప్రెస్ మీట్ పెట్టలేదు. నన్ను తిట్టాలి అన్నా చూసి చదవుతాడు. మానసిక స్థితి సరిగా లేని వ్యక్తులే ఇలా ప్రవర్తిస్తారన్నారు. జగన్ ను ఎవరికైనా మానసిక నిపుణులకు చూపిస్తే కచ్చితంగా మానసిక స్థితి సరిగా లేదని చెబుతారు. ఢిల్లీ నుంచి ఎయిమ్స్ వైద్యులను తీసుకొచ్చి ఈయన్ను చెక్ చేయాలని కేంద్రాన్ని చాలాసార్లు అడగాలి అనిపించిందన్నారు నియంతలైన గడాఫీ, సద్దాం హుస్సేన్ వంటివారు ఇలానే ప్రవర్తించేవారు. మానసిక స్థితి సరిగా లేని జగన్ చేతిలో రాష్ట్రం పెట్టడం సరికాదన్నారు. జగన్ దాష్టీకం, అరాచకాలు భరించలేకే వరంగల్ లో తన్ని తరిమేశారు. జగన్ మానసిక పరిస్థితి గురించి ఆయన సన్నిహితులు చాలా మంది నాకు చెప్పారు. ఆయన క్రూరుడు, విపరీతమైన దురాశ ఉన్న వ్యక్తి అని చెప్పారన్నారు

### వైసీపీ రాష్ట్రానికి పట్టిన చీడ.. పీడ

విజన్ 2020 అని చంద్రబాబు గారు చెబితే అప్పుడు నాకు సరిగా అర్ధం కాలేదు. ఇప్పుడు సైబరాబాద్ వైపు వెళ్తే అప్పుడు ఆయన చెప్పిన మాటలకు అర్ధం తెలుస్తుందన్నారు. రాళ్లు రప్పలతో ఉన్న హైదరాబాద్ సిటీని ఐటీకి కేరాఫ్ గా మార్చారు. ఈ రోజు ఆయన జైల్లో ఉన్నపుడు, చేయి కింద ఉంది అని తక్కువ అంచనా వేయకూడదన్నారు. ఒకప్పుడు జగన్ కూడా జైల్లో ఉండి వచ్చి ఇప్పుడు రాష్ట్రానికి ఏకు మేకయ్యాడు. ఒక వ్యక్తిని ఏ అనుభవం ఎలా మారుస్తుందో ఎవరికీ తెలియదు. రాహుల్ గాంధీని దేశం అంతా పప్పు పప్పు అని పిలిచింది. ఈ రోజు ఆయన కాశ్మీర్ టూ కన్యాకుమారి పాదయాత్ర చేశాడు. ఎవరి సామర్ధ్యాన్ని తక్కువ చేసి మాట్లాడకూడదు. ఈ రోజు మనం ఎన్డీఏలో ఉన్నామని కొత్తగా ఏర్పాటైన ప్రతిపక్షాల కూటమిని తక్కువ అంచనా వేయకూడదన్నారు. అలాగే వైసీపీని తక్కువ అంచనా వేయకూడదు. రాష్ట్రానికి పట్టిన చీడ, పీడ ఆ పార్టీ. మనందరం కలిసీ ఆ చీడను తొలగించాలన్నారు

### బలంగా అసెంబ్లీలో అడుగుపెడతాం

ఇసుక కొరత సృష్టించి 46 మంది భవన నిర్మాణ కార్మికులు చనిపోయేలా చేశారు. 35 లక్షల మంది అనుబంధ కార్మికులు కకావికలం అయిపోయారు. మద్యపాన నిషేధమని చెప్పి వేల కోట్లు దోచుకున్నారు. రాష్ట్ర యువతకు పిరికితనం, ఉదాసీనత అవహించింది. జనసేన పార్టీ చాలా బలమైన స్థానాలతో అసెంబ్లీలో అడుగుపెట్టబోతోంది. ఒక్కసారి జనసేన అసెంబ్లీలో అడుగుపెడితే రాష్ట్రం దశదిశ మర్చేస్తాం. రాజకీయ స్థిరత్వం, లా అండ్ అర్డర్ సక్రమంగా అమలయ్యేలా చూస్తాం. విశాఖ స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు కేటాయించేలా అడుగుతాం. ఉత్తరాంధ్ర వలసలు నిరోధిస్తాం. పోర్టులు ఏర్పాటు చేసి మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తాం. కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తాం. వైసీపీని ఆంధ్ర నుంచి తరిమేసిన తర్వాత అప్పుడు రాజు ఎవరు? మంత్రి ఎవరు అన్నదానిపై ఆలోచిస్తామన్నారు.

### నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన కమిటీ

జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్ గారి అధ్యక్షతన మిత్రపక్ష సమన్వయ కమిటీ ఏర్పాటు చేస్తున్నాం. ఢిల్లీలో బీజేపీ నాయకులను, రాష్ట్రంలోని తెలుగుదేశం పార్టీ నాయకులను సమన్వయపరుస్తారు. ఇందులో ఎవరూ ఎక్కువ కాదు... తక్కువ కాదు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకోవడం కోసం అందరం కలిసి పనిచేద్దాం. 2009లో సాధించాలి అనుకున్నది. 2024లో సాధిద్దాం. వైసీపీ నాయకులు ఎంత రెచ్చగొట్టినా పట్టించుకోవద్దు. తెలంగాణలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కలిసి పనిచేయాలో లేదో అన్నది భవిష్యత్తులో మాట్లాడదాం.

### ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దలను కలుస్తాను

భారతీయ జనతాపార్టీతో పొత్తులో ఉన్నప్పుడు చాలా విలువైన సమయం ఉండేది. రకరకాల కారణాల వల్ల ఆ సమయాన్ని వినియోగించుకోలేకపోయాం. జగన్ పిచ్చి వేషాలు వేయకుండా నిలువరించగలిగేవాళ్లం. రాజమండ్రిలో పొత్తు నిర్ణయం తీసుకోవడానికిగల కారణాలను ఢిల్లీ వెళ్లి శ్రీ అమిత్ షా, శ్రీ నడ్డా గారికి వివరిస్తాను. దేశంలో కీలకమైన జీ- 20 సదస్సు జరుగుతున్న సమయంలో అరాచకాలు సృష్టించడానికి వైసీపీ పూనుకుంది. నన్ను రాష్ట్రానికి రాకుండా అడ్డుకుంది. చంద్రబాబు గారిని అరెస్టు చేసింది. రాజకీయ కక్షతోనే చంద్రబాబు గారి అరెస్టు చేశారని బీజేపీ నాయకులు కూడా మాట్లాడారు. ఇవన్ని వాళ్లకు వివరిస్తాను.

### రాజకీయ నాయకులే ద్వంద్వ విధానం అలవాటు చేశారు

ఈ మధ్య దేశానికి పేరు ఇండియానా.. భారత్ నా అన్న చర్చ మొదలయ్యింది. నేను సైరా ఫంక్షన్ లో మాట్లాడినప్పుడు భారత్ అనే పేరుండాలని ఊహించి మాట్లాడలేదు. పైడిమర్రి వెంకట సుబ్బారావు గారి ప్రతిజ్ఞ లో భారతదేశం నా మాతృభూమి అంటే... అదే ఆంగ్లంలో ఇండియా ఈజ్ మై కంట్రీ అంటున్నాం. నాకు అది అర్ధం అయ్యేది కాదు. క్రికెట్ లోనూ అలాగే మాట్లాడేవారు. రాజకీయ నాయకులు ఈ ద్వంద్వ విధానాన్ని అలవాటు చేశారు. బ్రిటీష్ వాళ్లకి నోరు తిరగక వాళ్లు పెట్టుకున్న పేరు ఇండియా. జీ- 20 సదస్సుకు ప్రధాని శ్రీ మోదీ గారు భారత్ అని వ్యవహ్రించడం చాలా నచ్చింది. ఒక్కోసారి సోషలిస్టులా.. ఒక్కోసారి కమ్యునిస్టులా.. ఒక్కోసారి సనాతనవాదిలా మాట్లాడుతానంటారు. నా మటుకు నేను ఒక భారతీయుడిలా మాట్లాడుతా. మన దేశంలో భిన్నత్వంలో ఏకత్వం ఉండడానికి కారణం సనాతన ధర్మమే. కాలాన్ని, పరిస్థితులను, అవసరాన్ని బట్టి అది మారుతూ వస్తోంది.

### అధికారులూ... మీరంతా రాజ్యాంగ ప్రతినిధులని గుర్తుంచుకోండి

అడ్డగోలుగా చేసిన రాష్ట్ర విభజనతో వేదన వచ్చింది. కాంగ్రెస్ హటావో.. దేశ్ బచావో నినాదం వెనుక నాకు కాంగ్రెస్ మీద వ్యక్తిగత ద్వేషం లేదు. వైసీపీకి అండగా ఉన్న అధికార యంత్రాంగానికి కనువిప్పు కలిగించడానికే రాజ్యాంగం గురించి వివరించాం. వైసీపీకి కొమ్ము కాస్తున్న అధికారులంతా రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పాలనలోకి వచ్చారని గుర్తుంచుకోవాలి. మీరు కులాలకీ, పార్టీలకీ కొమ్ముకాయడానికి అధికారంలో ఉన్నారా? మేము రోడ్డు మీదకు వస్తామంటే ఆపుతారేంటి? మీరు ఏమైనా దిగివచ్చామనుకుంటున్నారా?

తలలు ఎగరేస్తే వీరభద్రుడు దక్షుడి తల తీసి విసిరికొట్టినట్టు విసిరికొట్టగలం గుర్తు పెట్టుకోండి. అహంకారంతో ఎగిరికొట్టుకుంటే ఆ అహంకారాన్ని తీసి వినమ్రతతో ఉండే తలలు పెట్టగలం గుర్తుంచుకోండి. ప్రజలు తలచుకుంటే ఒక్కొక్కరు ఒక్కో వీరభద్రుడు కాగలరు.

### జాతిని జాగృతం చేయడానికి నా ప్రయత్నం

2014లో అన్నింటికీ సిద్ధపడి పార్టీ పెట్టాను. ఈ రోజు ఒక సత్యాన్ని ఆవిష్కరింప చేస్తాను. ఆ క్రమంలో నన్ను చంపేసినా సిద్ధం. చైతన్యం లేకుండా ఉన్న తెలుగు జాతిని కుదిపి లేపడానికి అంత తెగింపు చేయాల్సి వచ్చింది. ఆ పవన్ కళ్యాణ్ ఇంకా బతికే ఉన్నాడు. ఎప్పుడూ చావడానికి సిద్ధంగానే ఉంటాడు. నా ప్రశాంతత నా చేతకానితనం కాదు. మీరు యుద్ధమే కావాలంటే కురుక్షేత్రం ఇస్తా. ఎవరు రాజు ఎవరు మంత్రో తేలిపోతుంది. తగ్గి మాట్లాడుతాం. బతిమలాడతాం. వైసీపీని చాలా మర్యాదగా మాట్లాడా.. ముఖ్యమంత్రిని సర్ అంటే.. ఆయన హా పవన్ అన్నా సరే నేను తగ్గే ఉన్నాను. అమ్మా ఆలి బూతులు తిట్టినా భరించా. ఇష్టారాజ్యంగా నెలల తరబడి తిట్టినా భరించా. ఇప్పుడు చూస్తే రోడ్డు మీదకు రానివ్వరు. హోటల్ లో ఉండనివ్వరు. నా నేలకు నేను వస్తానంటే రానివ్వరు.. ఒకప్పుడు నంద్యాలలో శ్రీ వై.ఎస్.రాజశేఖర రెడ్డి ఎన్నికల సభలో మాట్లాడుతూ.. తెలంగాణ వెళ్లాలంటే పాస్ పోర్టు, వీసా అడుగుతారని చెప్పాడు. తెలంగాణ రాజకీయ నాయకులు అలా చేయలేదు గాని వాళ్లబ్బాయి మాత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి అడుగుపెట్టాలంటే పాస్ పోర్టు, వీసా దరఖాస్తు చేసేలా రూల్స్ పెట్టాడు. మీ నాన్న గారి కలలు అలా నెరవేర్చావ్ జగన్.

### పోలీసులు మీరు అర్ధం చేసుకోండి

ఒక దేశ భక్తుడు సర్వస్వం అర్పించుకుపోవడానికి, దహించుకుపోవడానికి ఎలా ఉంటాడో అదే నేను సాధన చేశా. అది జగన్ అతనికి వత్తాసు పలికే పోలీస్ అధికారులు అర్ధం చేసుకోవాలి. మీరు చేస్తుంది సబబే అనిపిస్తుందా? మా నాయకుల మీద ఎన్ని కేసులు పెడతారు. భయపడిపోతామనుకుంటున్నారా. మేము భయపడం. అది మీరు అర్ధం చేసుకోండి. నేను ముఖ్యమంత్రిని ఏమైనా చేయగలను అనుకోవద్దు. నువ్వు ప్రజల ఆస్తులకి పర్యవేక్షకుడివి మాత్రమే. అది నీ సొంత ఆస్తి అనుకోవద్దు. ప్రజలకి కోపం వస్తే కొట్టి కొట్టి చంపేస్తారు. ప్రజల తాలూకు ఆగ్రహం నేను మొన్న చూశాను. తెలంగాణ బోర్డర్ లో నన్ను ఆపి వెనక్కి వెళ్లమన్నారు. నేనెందుకు వెళ్లాలని అడిగా? మీరు మర్డర్లు, దోపిడీలు చేస్తే నేనెందుకు వెనక్కి వెళ్లాలి? అమెరికా రాజ్యాంగం వాళ్ల అధ్యక్షుడిని మగ్ షాట్ తీయగలదు. ముఖ్యమంత్రిగా ఉంటే కొమ్ములు వచ్చేస్తాయా? మిగతావారి హక్కులు పోతాయా? ఖచ్చితంగా ఆయన చేసే డ్యూటీకి ప్రాముఖ్యత భద్రత ఇస్తాం. అలా అని మమ్మల్ని చావగొట్టమని చెప్పలేదు.

### లండన్ నుంచి ఆదేశం వస్తే అరెస్టు చేస్తారా..?

శాంతియుతంగా రాష్ట్రంలోకి వాహనంలో వస్తే మమ్మల్ని అరెస్టు చేస్తామంటారు. జాతీయ రహదారిపై 87 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ ఆగిపోయింది. దానికి జగన్ బాధ్యత వహించాలి. గాడ్ ఫాదర్ సినిమాలో మాఫియా లీడర్ మాదిరి జగన్ లండన్ వెళ్లి అక్కడి నుంచి వీళ్లని ఇబ్బంది పెట్టండి.. వాళ్లని జూ లో పెట్టమని చెబుతూ కలలుగంటున్నాడు. ఓడలు బళ్లవుతాయి. జగన్ నువ్వెంత? ప్యాలెస్ లో ఉన్న వారిని కిందికి లాగేందుకు ఎంతోసేపు పట్టదు. నువ్వేమైనా పైనుంచి దిగి వచ్చావా? నువ్వెంత? నీ బతుకెంత? నీ స్థాయెంత? 30 వేల కోట్ల రూపాయిలు కేవలం మద్యం మీద సంపాదించాడు. ఇసుక మాఫియా, మడ అడవులు నరికేశాడు. దివీస్ ల్యాబ్ ని బంగాళాఖాతంలో కలిపేస్తానన్న వ్యక్తి అరబిందో ఫార్మాకి అనుమతులు ఇచ్చేశాడు. అడ్డగోలుగా అడవులు నరికేశాడు. విశాఖ కాలుష్యం మీద ఆడిట్ ఉండదు. గంజాయి సాగు లో రాష్ట్రం అగ్రగామి అయింది. 4.92 లక్షల కేజీల గంజాయి వైసీపీ పాలనలో దొరికింది. దొరకనిది దానికి పది రెట్లు ఉంటుంది. నేను ఎన్డీఏతో ఉన్నాను. 70 శాతం బీజేపీ నిర్ణయాలతో ఏకీభవిస్తాను. దీన్ని ఆబ్జెక్టివ్ గా చూస్తాను. మాదకద్రవ్యాలు ఉన్నాయిని షారుఖ్ ఖాన్ కొడుకు మీద కేసు పెట్టారు.

# మీ పేరు ఉందో లేదో చెక్ చేసుకోండి

తెలుగు ట్రాక్,హైదరాబాద్
18 ఏళ్లు నిండిన పౌరులందరూ ఇప్పటి వరకు ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకోని పక్షంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్ రోనాల్డ్ రోస్ కోరారు. భారత ఎన్నికల సంఘం ఇచ్చిన అవకాశాన్ని పౌరులు ఉపయోగించుకోవాలని కోరుతూ.. ముందుగా అధికారిక వెబ్‌సైట్ ని సందర్శించడం ద్వారా లేదా ఫారం-6ని పూరించడానికి ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయడం ద్వారా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని రోనాల్డ్ రోస్ కోరారు.ఫారమ్‌ను పూర్తి చేసిన తర్వాత వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కోసం అవసరమైన డాక్యుమెంటరీ రుజువులతో పాటు దరఖాస్తును సమర్పించాలి. అక్టోబర్ 1, 2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు కూడా ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్నవారు మరిన్ని వివరాల కోసం ఓటరు హెల్ప్‌లైన్ నంబర్ 1950కి కాల్ చేయవచ్చు.ఓటరు నమోదు, అభ్యంతరాలు..రెండవ ప్రత్యేక సమ్మరీ రివిజన్ 2023 కార్యక్రమంలో భాగంగా ఓటరు నమోదు, అభ్యంతరాలు, సవరణకు ఈ నెల 19వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితా విడుదలైన నేపథ్యంలో ఓటరు జాబితాలో ముందు గా మీ పేరు ఉందో లేదో ఈసీఐ వెబ్ సైట్ చేసుకొని సరి చూసుకోవాలని తెలిపారు. ఓటరు జాబితాలో పేరు లేని పక్షంలో పైన తెలిపిన ఈసీఐ, వెబ్ సైట్ గానీ ఓటరు హెల్ప్ లైన్ ద్వారా తిరిగి నమోదు చేసుకోవాలన్నారు.ఫారం-6..18 సంవత్సరాల వయస్సు దాటిన వారు, అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండబోయేవారు, ఇప్పటి వరకు ఓటరు జాబితాలో పేరు లేని వారు ఫారం-6 ద్వారా నమోదు చేసుకోవాలి.ఫారం-6బి..ఓటరు జాబితాలో ఆధార్ ను అనుసంధానం/ అప్‌డేట్‌ఫారం-7ముసాయిదా ఓటరు జాబితా పేరు తొలగింపు, అభ్యంతరాలుఫారం-8 (సవరణలు)ముసాయిదా ఓటరు జాబితాలో పేరులో తప్పులు..ఇంటి నెంబర్ తప్పుగా ఉన్నప్పుడు.ప్రామాణికంగా లేని ఇంటి నెంబర్,అడ్రస్ మారినపుడు.ఓటరు జాబితాలో మిస్ మ్యాచ్ ఫోటోలు.సక్రమంగా లేని ఫోటోలు.కుటుంబ సభ్యుల రిలేషన్ తప్పుగా నమోదైన చో (తల్లి, తండ్రి, భార్య, భర్త, కూతురు)ఒకే కుటుంబ సభ్యులు అదే నియోజకవర్గంలో వేర్వేరు పోలింగ్ స్టేషన్ లో ఉన్నట్లైతే..మీ కుటుంబ సభ్యుల పేర్లు వేర్వేరు నియోజకవర్గంలో నమోదు అయినట్లైతే..మొబైల్ నెంబర్ అప్ డేట్ఈ నెల 19 లోపు ఫారం-8 ద్వారా..ఇంకా తదితర తప్పులు సవరించుకోవడానికి ఈ నెల 19 లోపు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకొనగలరు. ఓటరు జాబితాలో మీ ఓటరు సరి చూసుకొనుటకు, సవరణలు, కొత్త ఓటరు నమోదు, అభ్యంతరాల కొరకు మీ దగ్గరలో ఉన్న ఈఆర్ఓ, ఏ ఈ అర్ ఓ లు గా వ్యవహరిస్తున్న డిప్యూటీ కమిషనర్ లను సంప్రదించగలరు. లేదా ఈసీఐ వెబ్ సైట్ ద్వారా గాని ఓటరు హెల్ప్‌లైన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని.. ఓటరు నమోదు చేసుకోవచ్చని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు

# నిర్దోషిగా చంద్రబాబు బయటకు వస్తారు



క్యాండిల్ లైట్ ర్యాలీలో పాల్గొన్న భువనేశ్వరి, బ్రాహ్మణి

తెలుగు ట్రాక్,రాజమండ్రి: మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ మహిళలు భారీగా వచ్చి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. రాజమహేంద్రవరం తిలక్ రోడ్డులోని సాయిబాబా ఆలయం నుండి శ్యామలానగర్ రామాలయం జంక్షన్ వరకు నిర్వహించిన ప్రదర్శనకు నగరం నలుమూలల నుంచి వేలాది మహిళలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. నగరానికి చెందిన మహిళలు, అభివృద్ధి చేయడమే చంద్రబాబు చేసిన నేరమా?
ప్రముఖులు, సామాన్య ప్రజలు పెద్ద ఎత్తున హాజరై చంద్రబాబునాయుడుకు సంఘీభావం తెలిపారు. చంద్రబాబునాయుడు తక్షణం విడుదల చేయాలంటూ నినాదాలతో నగర వీధులు హోరెత్తాయి. ర్యాలీ అనంతరం శ్యామలానగర్ రామాలయం వద్ద నారా బ్రాహ్మణి విలేకరులతో మాట్లాడుతూ%%%చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేసిన రోజు భారతదేశ ప్రజాస్వామ్యానికి చీకటి రోజు. ఆయన 42 సంవత్సరాల రాజకీయ చరిత్ర కలిగిన తెలుగు రాష్ట్రాలను అభివృద్ధి చేసిన విజనరీ, భారతదేశానికి ఐటీని తెచ్చిన దార్శనికుడు, నీతి నిజాయితీగా రాష్ట్రప్రజల కోసం కష్టపడిన చంద్రబాబుగారి లాంటి సీనియర్ నాయకుడిని ఎలాంటి ఆధారాలు లేకుండా అరెస్టు చేయడం అక్రమం అన్నారు. ఇలాంటి పరిణామం చూసి ఓ యువతిగా నేను చాలా బాధపడుతున్నానన్నారు. చంద్రబాబు వంటి సీనియర్ నాయకుడికే రాష్ట్రంలో ఇంత అన్యాయం జరుగుతుంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటో రాష్ట్ర ప్రజలంతా ఆలోచించాలన్నారు. . చంద్రబాబు వంటి నాయకుడు లేకపోతే యువతీ యువకులకు నైపుణ్యం, ఉద్యోగాలు వచ్చేవా? అభివృద్ధి చేయడం, సంక్షేమం అందించడం, ఉద్యోగాలు ఇవ్వడమే చంద్రబాబు చేసిన నేరమా? అని ప్రశ్నించారు.
మేం ఎప్పుడూ ఒంటరి వాళ్లం కాదు..
రాష్ట్రప్రజలు, తెలుగుదేశంపార్టీ కుటుంబ సభ్యులు మాకు అండగా ఉన్నారు. చంద్రబాబులాంటి వ్యక్తిని అరెస్టు చేస్తారని, మేం ఇలా రోడ్డుపైకి వచ్చి పోరాడాల్సి వస్తుందని ఊహించలేదన్నారు. . చంద్రబాబు జైల్లో, లోకేష్ ఢిల్లీలో, మేం రాజమండ్రిలో, మా కుమారుడు దేవాన్ష్ హైదరాబాద్ లో ఉండాల్సిన పరిస్థితులు కల్పించారన్నారు. . చంద్రబాబు ఐటిని తెచ్చి, రాష్ట్ర ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించినందుకు ఇచ్చే ప్రతిఫలం ఇదేనా?అని ప్రశ్నించారు. . చంద్రబాబు పర్యటనలకు రాష్ట్రవ్యాప్తంగా విపరీతమైన స్పందన వస్తోంది. దీన్ని ఓర్చుకోలేక మాపై కక్ష సాధిస్తున్నారని ఆరోపించారు. . మరో 6నెలల్లో ఎన్నికలు రాబోతున్నందున ప్రభుత్వంపై ప్రజల్లో పెల్లుబుకుతున్న వ్యతిరేకత తట్టుకోలేక చంద్రబాబును నిరాధార ఆరోపణలు చేసి అరెస్టు చేశారన్నారు.
. లోకేష్ యువగళం పాదయాత్రకు యువత పెద్దఎత్తున స్పందన రావడం కూడా ప్రభుత్వ కక్షసాధింపునకు ఒక కారణం అన్నారు.
లోకేష్ ను కూడా నేడో రేపో అరెస్టు చేయాలని చూస్తున్నారు. తప్పుచేయని మేం ఎవరికీ భయపడం. మా వెనుక 5కోట్లమంది ఆంధ్రప్రదేశ్ ప్రజలు, బలమైన టీడీపీ కుటుంబం ఉందన్నారు. . మాలో పోరాట స్ఫూర్తి ఉంది. మాకు న్యాయ వ్యవస్థపై అపారమైన నమ్మకం ఉందన్నారు.చంద్రబాబు నిర్దోషిగా బయటకు వస్తారని నాకు నమ్మకం ఉంది. చంద్రబాబు బయటకు రావాలి, ఏపీకి న్యాయం జరగాలి. దీనికోసం మా పోరాటం కొనసాగుతుందన్నారు. చంద్రబాబునాయుడు కియా, జోహో వంటి అనేక పరిశ్రమలు, కంపెనీలు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారు. చంద్రబాబు తప్పు చేయలేదని యావత్ దేశం నమ్ముతోందన్నారు. . అందుకే ప్రపంచవ్యాప్తంగా తెలుగుప్రజలు రోడ్ల మీదకు వచ్చి చంద్రబాబుకు మద్దతుగా నిలుస్తున్నారని బ్రాహ్మణి అన్నారు. మీడియాతో మాట్లాడిన అనంతరం శ్యామలాపురం రామాలయం జంక్షన్ వద్దనున్న సీతారాములవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసి ర్యాలీని ముగించారు. కార్యక్రమంలో మాజీమంత్రి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, గన్ని కృష్ణ, ఆదిరెడ్డి వాసు, ఆదిరెడ్డి అప్పారావు, రాజమహేంద్రవరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ స్పందించకపోవడంపై గుసగుసలు

తెలుగు ట్రాక్,విజయవాడ
చంద్రబాబునాయుడు అరెస్టుపై జూనియర్ ఎన్టీఆర్ స్పందించకపోవడం చర్చనీయాంశమయింది. ఈ అంశంపై తెలుగుదేశం పార్టీ క్లారిటీ ఇచ్చింది. ఎన్టీఆర్ ఎందుకు స్పందించలేదో ఆయననే అడగాలని ఆ పార్టీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. స్పందించాలని తాము ఎవరినీ అడగడం లేదన్నారు. తనను అడిగితే తాను ఏం చెపుతానని అన్నారు. జనసేనతో రాబోయే రోజుల్లో జనసేనతో కలిసి కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. చంద్రబాబు అరెస్ట్ ను జనసేన నేతలు, కార్యకర్తలు ఖండిస్తున్నారని చెప్పారు. టీడీపీ చేపట్టిన దీక్షల్లో జనసేన శ్రేణులు స్వచ్ఛందంగా పాల్గొంటున్నాయని తెలిపారు.చంద్రబాబును అరెస్టు చేయడంపై అందరూ స్పందిస్తున్నారు కానీ.. జూనియర్ ఎన్టీఆర్ స్పందించకపోవడం చర్చనీయాంశమయింది. ఇది రాజకీయంగా మద్దతు ప్రకటించడం కాదని.. కష్టకాలంలో కుటుంబసభ్యునికి అండగా నిలవడం అని.. చాలా మంది విశ్లేషిస్తున్నారు. అయితే ఎన్టీఆర్ వైపు నుంచి ఎలాంటి స్పందన లేదు. చంద్రబాబును అరెస్ట్ చేసిన తర్వాత ఓ అవార్డు ఫంక్షన్ కు ఆయన దుబాయ్ వెళ్లారు. సోషల్ మీడియాలో జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ , టీడీపీ ఫ్యాన్స్ మధ్య తరచూ ఫ్యాన్ వార్స్ జరుగుతూ ఉంటాయి. అయితే ఎన్టీఆర్ చాలా కాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నరని అలాంటి ప్రకటనలు కూడా చేయలేదంటున్నారు. జూనియర్ ఎన్టీఆర్ మామ నార్నే శ్రీనివాసరావు గత ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. అయితే ఆ తర్వాత వైసీపీలో పెద్దగా ఎక్కడా కనిపించలేదు. కానీ అంతకు ముందు నుంచే టీడీపీతో జూనియర్ ఎన్టీఆర్ అంటీ ముట్టనట్లుగా ఉంటున్నారు. కుటుంబ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కలిసినప్పుడల్లా ఆప్యాయంగా మాట్లాడుకుంటూ ఉంటున్న దృశ్యాలు వెలుగులోకి వస్తూంటాయి. అయితే రాజకీయ పరమైన సందర్భాల్లో అందరూ స్పందిస్తున్నా జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్ రామ్ మాత్రం స్పందించడం లేదు. ఇది టీడీపీ నేతలకు ఇబ్బందికరంగా మారింది. చంద్రబాబు, లోకేష్, బాలకృష్ణల విషయంలో ఎన్టీఆర్ అంత సానుకూలంగా లేరని అంటున్నారు. జూనియర్ ఎన్టీఆర్ మౌనాన్ని వైఎస్ఆర్‌సీపీకి చెందిన కొంత మంది నేతలు.. టీడీపీపై ఎదురుదాడికి ఉపయోగించుకుంటున్నారు. ఆర్ఆర్ఆర్ విజయం తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జూనియర్ ఎన్టీఆర్ ఓ సారి సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఏం చర్చించారో ఎవరికీ తెలియదు కానీ.. ఆయన మాత్రం ఎలాంటి ప్రకటనలు చేయలేదు. బీజేపీలో చేరుతారనే ప్రచారం కూడా జరిగింది. అన్ని రాజకీయ అంశాలకూ జూనియర్ ఎన్టీఆర్ దూరంగానే ఉంటున్నారు.

# అగ్రిగోల్డ్ ఆందోళనపై ఉక్కుపాదం

## జగన్ మోసం చేశారని బాధితుల ఆగ్రహం !

తెలుగు ట్రాక్,విజయవాడ
అగ్రిగోల్డ్ బాధితుల సంఘం ఇచ్చిన 'చలో విజయవాడ'పై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఎక్కడికక్కడ పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి ఏపీ నలుమూలల నుంచి విజయవాడకు వస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. రైళ్లలో వస్తున్న వారిని స్టేషన్‌లోనే అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజెంట్ల సంఘం నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, కోరాడ రాంబాబు, షరీఫ్ తదితరులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. విజయవాడలోని జింఖానా మైదానంలో శంఖారావం సభకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే బడ్జెట్‌లో రూ. 1150 కోట్లు ఇస్తామని సీఎం జగన్ పాదయాత్రలో హామీ ఇచ్చారు. మేనిఫెస్టోలనూ పెట్టారు. ప్రభుత్వం ప్రకటించిన మొదటి బడ్జెట్‌లో రూ. 1150 కోట్లు కేటాయించారు కానీ రూపాయి కూడా విడుదల చేయలేదు. తర్వాత బడ్జెట్‌లో రూ. 200 కోట్లు కేటాయించారు కానీ ఖర్చు చేయలేదు. ఆ తర్వాత అగ్రిగోల్డ్ బాధితులకు ఎలాంటి కేటాయింపులు లేవు. అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునే చర్యలను ప్రభుత్వం నిలిపివేసిందనే ఆందోళన వ్యక్తమవుతోంది. మళ్లీ ఎన్నికలు వస్తున్నా సీఎం జగన్ అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదని విమర్శిస్తున్నారు. అగ్రిగోల్డ్‌లో రాష్ట్రానికి చెందిన 19.52 లక్షల మంది డిపాజిటర్లు, పెట్టుబడులు పెట్టగా, దేశంలోని ఏడు రాష్ట్రాలలో 32 లక్షల మంది బాధితులు ఉన్నారు. రాష్ట్రానికి చెందిన బాధితులకు న్యాయం చేస్తామని గత టిడిపి ప్రభుత్వం, ప్రస్తుత వైసిపి సర్కార్ ఇచ్చిన హామీలు నెరవేరలేదు. అయినప్పటికీ బాధితులు న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారు. బాధితులకు రూ.3,964 కోట్లను చెల్లించాలని సిఐడి తేల్చింది. అగ్రిగోల్డ్ సంస్థ 2015 జనవరిలో బోర్డు తిప్పేయడంతో డిపాజిట్‌దారులు, ఏజెంట్లు గుండెపోటుతో ఇప్పటి వరకు 300 మందిపైనే మృతి చెందారు. వారిలో 144 మందికి గత ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించింది. తాము వస్తే రూ. పది లక్షలు చెల్లిస్తామని జగన్ హామీ ఇచ్చారు. కానీ నేటి వరకు ఒక్క పైసా ఇవ్వలేదు. మొత్తం బాధితులలో రూ.20 వేలలోపు డిపాజిట్లున్న వారు 10 లక్షల మంది ఉన్నారని అంచనా వేయగా, వారిలో ఆరు లక్షల మందికి ప్రభుత్వం రూ.964 కోట్లను చెల్లించింది. మిగిలిన వారి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమకాలేదు. వీరిలో ఒక్కొక్కరికి రెండు మూడు బాండ్లు ఉన్నప్పటికీ ఒక్క బాండ్‌కే చెల్లింపు చేశారు. రూ.20 వేలపైబడి డిపాజిట్ చేసిన బాధితులు 13.52 లక్షల మంది ఉన్నారు. అగ్రిగోల్డ్ సంస్థకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.35 వేల కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు అప్పటి హోంమంత్రి హోంశాఖ మంత్రి మేకతోటి సుచరిత ప్రకటించారు. ఇప్పటికే వాటన్నింటినీ కోర్టుకు అటాచ్ చేశారు. ఆస్తులను వేలం వేసి బాధితులందరికీ డిపాజిట్‌లను చెల్లిస్తామన్న గత, ప్రస్తుత ప్రభుత్వాల హామీలు నెరవేరడంలేదు

# మాయ చేసే డెవిల్ పాట



వైవిధ్యమైన సినిమాలను చేస్తూ తనదైన గుర్తింపు సంపాదించుకున్న టాలీవుడ్ హీరో నందమూరి కళ్యాణ్ రామ్. ఆయన కథానాయకుడిగా నటిస్తోన్న లేటెస్ట్ పీరియాడిక్ స్పై థ్రిల్లర్ 'డెవిల్'. 'ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' ట్యాగ్ లైన్. టైటిల్ వింటుంటేనే కథానాయకుడు సినిమాలో విలన్స్‌ను ఏ రేంజ్‌లో ఓ ఆటాడుకుంటాడనే విషయం స్పష్టమవుతుంది. యాక్టర్‌గా నందమూరి కళ్యాణ్ రామ్‌లోని ఓ కొత్త కోణాన్ని ఎలివేట్ చేయనుందనే విషయం స్పష్టమవుతుంది.

రీసెంట్‌గా విడుదలైన 'డెవిల్' టీజర్‌తో ఈ సినిమాపై అప్పటికే ఉన్న అంచనాలు మరింతగా పెరిగాయి. నవంబర్ 24న ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'మాయే చేసే..' అనే పాటను సెప్టెంబర్ 19న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలియజేశారు. ఐకాన్ మ్యూజిక్ నుంచి ఈ సినిమా పాటలను విడుదల చేస్తున్నారు.

అభిషేక్ నామా 'డెవిల్' మూవీని డైరెక్ట్ చేస్తూ నిర్మించారు. సినిమా కోసం అందరూ ఎంత ఆసక్తిగా ఎదురు చూస్తున్నారో తెలుసు. ఈ చిత్రంలోని పాటలు ప్రేక్షకులను మంత్ర ముగ్ధలను చేస్తుంది. అందులో నుంచి 'మాయే చేసే..' పాటను సెప్టెంబర్ 19న విడుదల చేస్తున్నాం. ఇది ప్రారంభం మాత్రమేనని, ప్రేక్షకులకు ఈ మూవీ మంచి మ్యూజికల్ జర్నీని మరుపురాని అనుభూతినిస్తుందని మేకర్స్ తెలిపారు. ప్రముఖ సింగర్ సిద్ శ్రీరామ్ పాడిన ఈ పాటకు హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతాన్ని అందించారు. సత్య ఆర్.వి పాటను రాశారు.

నందమూరి కళ్యాణ్ రామ్, సంయుక్త అద్భుతమైన పెర్ఫామెన్స్ చేశారు. ఇద్దరి మధ్య కెమిస్ట్రీ, సినిమా కథ, కథనం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఎన్నో మంచి చిత్రాను మనకు అందించిన అభిషేక్ పిక్చర్స్ సంస్థ ఈ సినిమాను రూపొందిస్తోంది. శ్రీకాంత్ విస్సా ఈ చిత్రానికి మాటలు, స్క్రీన్ ప్లే, కథను అందించారు. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత సారథ్యం వహిస్తుండగా సౌందర్ రాజన్ సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేశారు. గాంధీ నడికుడికర్ ఈ సినిమాకు ప్రొడక్షన్ డిజైనర్‌గా బాధ్యతలను నిర్వహించారు. తమ్మిరాజు ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు.

ఏ ఫిల్మ్ బై అభిషేక్ పిక్చర్స్

నటీనటులు: నందమూరి కళ్యాణ్ రామ్, సంయుక్త తదితరులు

# 'ఓటు' పవర్ ఫుల్ ట్రైలర్ విడుదల




హృతిక్ శౌర్య హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'ఓటు'. 'చాలా విలువైనది' అనేది ట్యాగ్ లైన్. ఫ్లిక్ నైన్ స్టూడియోస్ నిర్మాణంలో రవి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో తన్వీ నేగి హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్, టీజర్, సిరిమల్లె పువ్వా రీమిక్స్ పాటకు మంచి రెస్పాన్స్ వచ్చింది.తాజాగా మేకర్స్ ఓటు ట్రైలర్ ని విడుదల చేశారు. 'విద్య వైద్యం వాక్ స్వాతంత్ర్యం ఎలాగైతే మన ప్రాథమిక హక్కులో, మన సమస్యల కోసం పోరాడటం, వాటిని ప్రశ్నించడం కూడా మన ప్రాథమిక హక్కే" అనే వాయిస్ తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా వుంది. ట్రైలర్ లో సోషల్ ఎలిమెంట్స్ తో పాటు లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా వున్నాయి.'ఎప్పుడైతే మనం మన ఓటుని అమ్ముకుంటున్నామో ప్రశ్నించే హక్కుని కోల్పోతున్నాం."పది రోజుల ముందు మందు పోసేవాడికి ప్రచారం చేస్తారు. చివరి గ్లాసు పోసేవాడికి ఓటు వేస్తారు"ఒక్కసారి డబ్బు తీసుకోకుండా ఓటు వేసి చూడండి. అప్పుడు మీకే తెలుస్తుంది రాజు ఎవడో సేవకుడు ఎవరో" అనే డైలాగ్స్ అలోచింపచేసేలా వున్నాయి. ట్రైలర్ లో హృతిక్ శౌర్య ఇంటెన్స్ రోల్ లో మంచి పెర్ ఫార్మెన్స్ కనబరిచారు. గోపరాజు రమణ కీలక పాత్రలో కనిపించారు. నేపథ్య సంగీతం, కెమరాపనితనం ఆకట్టుకునాయి. ట్రైలర్ బలమైన కంటెంట్ తో సినిమాపై క్యురియాసిటీని పెంచింది.ఫ్లిక్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అగస్త్య సంగీతం అందిస్తున్నారు. ఎస్ రాజశేఖర్ డీవోపీ గా పని చేస్తున్న ఈ చిత్రానికి ప్రసాద్ ఎడిటర్. మోహన్ తాళ్లూరి ఆర్ట్ డైరెక్టర్ గా పని చేస్తున్న ఈ చిత్రానికి రామకృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యుసర్.

తారాగణం: హృతిక్ శౌర్య, తన్వినేగి

## రీరిలీజ్‌లో కూడా పెద్ద విజయం

'7/జీ' పార్ట్ 2 వచ్చే నెల నుంచి



ప్రముఖ నిర్మాత ఏయం రత్నం నిర్మాణంలో, క్రియేటివ్ డైరెక్టర్ సెల్వ రాఘవన్ వెండితెరపై ఆవిష్కరించిన ఆల్ టైమ్ కల్ట్ క్లాసిక్ '7/జీ బృందావన్ కాలనీ'. రవికృష్ణ, సోనియా అగర్వాల్ జంటగా నటించిన ఈ చిత్రం ఎవర్ గ్రీన్ బ్లాక్ బస్టర్ గా సంచలన సాధించి ప్రేక్షకుల మనసులో నిలిచిపోయింది. ఇప్పుడు ఈ సినిమా మరోసారి ప్రేక్షకులని అలరింబోతుంది. నిర్మాతలు ఉదయ్, యతి ఏయు సినిమాస్ ఉ వివై ఎంటర్‌టైన్‌మెంట్స్ ద్వారా సెప్టెంబర్ 22న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా రీరిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా రీరిలీజ్ ట్రైలర్ ని లాంచ్ చేసిన మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు.

ప్రెస్ మీట్ లో నిర్మాత ఏయం రత్నం మాట్లాడుతూ.. నేను చేసిన ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో '7/జీ బృందావన్ కాలనీ' కల్ట్ మూవీ. ఈ సినిమాకి చాలా మంచి పేరు వచ్చింది. తెలుగు తమిళ్ రెండూ భాషల్లో పెద్ద విజయం సాధించింది. ఇదొక పోయిటిక్ సినిమా. సినిమా ప్రారంభం ముగింపు పొయిటిక్ గా వుంటాయి. ఉదయ, యతి చాలా శ్రద్ధ తీసుకొని ఈ సినిమాని రిరిలీజ్ చేస్తున్నారు. రీరిలీజ్ లో కూడా ఈ సినిమా పెద్ద సక్సెస్ అవుతుందని నమ్మకం వుంది. రవితో మళ్ళీ రీఎంట్రీలా '7/జీ బృందావన్ కాలనీ' పార్ట్ 2 ని వచ్చే నెల నుంచి మొదలుపెడుతున్నాం. సెల్వరాఘవన్ దర్శకత్వం వహిస్తారు. స్క్రిప్ట్ అద్భుతంగా వచ్చింది." అన్నారు.

రవికృష్ణ మాట్లాడుతూ..ట్రైలర్ చూసిన తర్వాత మళ్ళీ రవి పాత్రలోకి వెళ్ళిపోయాను చాలా రోజులు గా రీరిలీజ్ చేయాలనీ నాన్న గారు అనుకున్నారు. సెకండ్ పార్ట్ ని కూడా ప్లాన్ చేస్తున్నాం. పార్ట్ 2కి ముందు మరోసారి 7/జీ మ్యాజిక్ చూపించేలా చిత్రం రీరిలీజ్ జరుగుతోంది. అందరూ థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేయండి" అన్నారు.

సోనియా అగర్వాల్ మాట్లాడుతూ.. '7/జీ బృందావన్ కాలనీ' చిత్రాన్ని మరోసారి బిగ్ స్క్రీన్ పై చూసే అవకాశం రావడం నిజంగా చాలా ఆనందంగా వుంది. మీ అందరి ప్రోత్సాహానికి కృతజ్ఞతలు. అందరూ తప్పకుండా ఈ సినిమా థియేటర్స్ లో చూడండి" అని కోరారు.

# ఉపేంద్ర 50వ చిత్రం 'డిటెక్టివ్ తీక్షణ' ట్రైలర్



యాక్షన్ క్వీన్ డా॥ ప్రియాంక ఉపేంద్ర 50వ చిత్రం, 'డిటెక్టివ్ తీక్షణ' ట్రైలర్, బెంగళూరు లోని ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆడిటోరియం లో గ్రాండ్ ఈవెంట్ లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో లహరివేలు మాట్లాడుతూ ఉపేంద్ర తొలినాళ్లలో ఎదుర్కొన్న కష్టాలను గుర్తు చేసుకున్నారు, చిత్రం మంచి విజయాన్ని సాధించాలని టీమ్ కి బెస్ట్ విషెస్ తెలిపారు. నిర్మాతలు గుత్తా ముని ప్రసన్న, ముని వెంకట చరణ్, పురుషోత్తం.బి.కోయురు తమ ఆనందాన్ని పంచుకున్నారు. రియల్ స్టార్ ఉపేంద్ర 'డిటెక్టివ్ తీక్షణ' ట్రైలర్ ను పలు భాషల్లో విడుదల చేశారు.

భయంకరమైన హత్యల నేపథ్యంలో ట్రైలర్ ప్రారంభమవుతుంది. ఈ హత్యలు ఎవరు, ఎందుకు చేస్తున్నారు అనే ఆసక్తిని రేకెత్తించడంతోపాటు, హత్యకి గురైన వారి కుటుంబ సభ్యుల మనోవేదనను కూడా ఎంతో హృద్యంగా ఆవిష్కరించారు. కోర్టులు కూడా ఈ హత్యలకు అడ్డుకట్ట వేయలేకపోతాయి. అటువంటి పరిస్థితుల్లో డిటెక్టివ్ తీక్షణగా ప్రియాంక ఉపేంద్ర ఈ కేసును సాల్వ్ చేయడానికి ఎంట్రీ ఇస్తుంది. ట్రైలర్ ఆద్యంతం హైటెక్నికల్ వాల్యూస్ తో ,రిచ్ ఫోటోగ్రఫీ, టెర్రిఫిక్ బ్యాగ్రౌండ్ మ్యూజిక్ తో ఆకట్టుకునేలా సాగింది. యాక్షన్ సన్నివేశాలలో కూడా ప్రియాంక ఉపేంద్ర తన స్టంట్స్ తో మెప్పించారు. ఈ ట్రైలర్ చిత్రం మీద అంచనాలను మరింతగా పెంచింది.

దర్శకుడు త్రివిక్రమ్ రఘు మాట్లాడుతూ, "ప్రియాంక మేడం నా టాలెంట్ ని గుర్తించి నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు థాంక్స్. ఈ చిత్రం ప్రారంభించినప్పటి నుంచి ఆవిడ అందించిన సహాయ సహకారాలు మర్చిపోలేనివి. నా ఐడియాస్ కు తెరమీద ప్రాణం పోయడానికి ఆర్టిస్టులు మరియు టెక్నీషియన్స్ ఎంతో కష్టపడ్డారు. మరో రెండు నెలల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం"

రియల్ స్టార్ ఉపేంద్ర మాట్లాడుతూ, "ప్రతి మహిళలోనూ ఒక డిటెక్టివ్ ఉంటారు ప్రత్యేకంగా నా ఇంట్లో మరీ ఎక్కువ. ప్రతి భర్తకు తన భార్య డిటెక్టివే. డిటెక్టివ్ పాత్రలను సరిగ్గా మలిచినప్పుడు అవి తెరమీద అద్భుతంగా వస్తాయి. ట్రైలర్ లో మ్యూజిక్ రోమంచితంగా ఉంది. ప్రియాంక 50 చిత్రాలు పూర్తి చేశారు. నేను ఇంకా 46వ చిత్రం దగ్గరే ఉన్నాను. మా వందో చిత్రానికి మేమిద్దరం కలిసి పని చేస్తామని ఆశిస్తున్నాను. 'డిటెక్టివ్ తీక్షణ' పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. మీ అందరి కష్టానికి తగ్గ ప్రతిఫలం ఖచ్చితంగా ఈ చిత్రం మీకు అందిస్తుంది."

నిర్మాతలు గుత్తా ముని ప్రసన్న, ముని వెంకట చరణ్ కార్యక్రమానికి వచ్చిన అతిథులకు ధన్యవాదాలు తెలిపారు. ఎంతోకాలంగా తమకు ఎంతో సపోర్ట్ చేస్తున్న ప్రియాంక ఉపేంద్ర కు కూడా థాంక్స్ చెప్పారు.

ప్రియాంక ఉపేంద్ర మాట్లాడుతూ, "నేను 50 చిత్రాలు నటించానని తలుచుకున్నప్పుడు అవి 50 సెకండ్లు మాదిరిగా అనిపిస్తాయి. దీనికి కారణం ఆయా చిత్రాల్లో నన్ను ఎంచుకున్న దర్శక నిర్మాతలే. నేను ఎవరు ఏం చెప్పినా వినడానికి సిద్ధంగా ఉంటాను. 'డిటెక్టివ్ తీక్షణ' కోసం అందరు ఆర్టిస్టులు, టెక్నీషియన్లు ఎంతో కష్టపడి పని చేశారు. రాత్రి రెండు గంటల సమయంలో కూడా సెట్ లో అందరూ ఎంతో ఉల్లాసంగా ఉండేవారు. ఈ సినిమాలో నా క్యారెక్టర్ ఫిజికల్ గా స్ట్రాంగ్ గా లేకపోయినప్పటికీ మెంటల్ గా మాత్రం ఎంతో షార్ప్, బ్రిలియంట్ దర్శకుడు త్రివిక్రమ్ రఘుకు ఎంతో గొప్ప భవిష్యత్తు ఉంది."

చిత్రంలో కీలక పాత్ర పోషించిన విజయ సూర్య తో పాటు ఇతర ముఖ్యపాత్రలో కనిపించిన సిడ్లింగు శ్రీధర్, శశిధర్ మరియు ఆర్ డైరెక్టర్ నవీన్ కుమార్ తమ అనుభవాలను పంచుకున్నారు. వీరితో పాటు కర్ణాటక ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ బిఏ.ఎంఏ. హరీష్ మరియు టాలీవుడ్ పి ఆర్ ఓ బిఏ రాజు'బ టీం (శివకుమార్ బి) కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ చిత్రానికి సంగీతాన్ని పి రోహిత్ అందించారు. పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కిన 'డిటెక్టివ్ తీక్షణ' ను కన్నడ, తెలుగు, హిందీ, తమిళ, మలయాళం, బెంగాలీ, ఒరియా, వంటి ఏడు భాషల్లో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు

**Printed, Published and Owned by** KIRAN KUMAR UDARA and **Printed** at Arunodaya Notebook Manufacturers Private Limited. D. No. 33-5-9, Papaiah Street, Seethramapuram, Vijayawada-520002 (Andhrapradesh) and **Published at:** D.No. 54-17-15, ITI road, Vijayawada - 520008, A.P.,Ph:**8340909999**

**Editor** : KIRAN KUMAR